అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 22-7-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 202 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

హింసను నియంత్రించండి




వివరాలు 11లో మణిపూర్ అల్లర్లపై ఢిల్లీలో విద్యార్థి, యువజన సంఘాల ఆందోళన

శాంతిని నెలకొల్పండి

25న మణిపూర్ ఆదివాసీలకు సంఘీభావ కార్యక్రమాలను జయప్రదం చేయాలి : సీపీఐ, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీల విజ్ఞప్తి



తమ్మినేని..



కూనంనేని..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయని సీపీఐ, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీలు ఆందోళన వ్యక్తం చేశాయి. అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సీపీఐ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుకీ తెగకు చెందిన ఆదివాసీ మహిళలను ఇద్దరిని నగ్నంగా ఊరేగించి, సామూహిక లైంగికదాడి చేసి, హత్య చేయడం సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 25న ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మణిపూర్ ఆదివాసీలకు సంఘీభావ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. రెండు పార్టీల సభ్యులు, ప్రజాసంఘాలు, వామపక్ష శ్రేయోభిలాషులు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మణిపూర్ జనాభాలో 54 శాతానికి పైగా ఉన్న మైతీ కులస్తులకు, కుకీ, నాగ గిరిజన తెగల మధ్య బీజేపీ తన రాజకీయ లబ్ధికోసం చిచ్చుపెట్టిందని విమర్శించారు. గిరిజన చట్టాలను అతిక్రమించి మైతీలను గిరిజనులుగా మార్చడానికి ఒడిగట్టిందని తెలిపారు. ఆదివాసీలను అడవుల నుంచి దూరంచేస్తున్నదని పేర్కొన్నారు. దీన్ని ప్రతిఘటించిన కుకీ, నాగ తెగలపై మతోన్మాదశక్తులు బీజేపీ అండతో రెండున్నర నెలలుగా తీవ్రమైన దాడులకు తెగబడుతున్నాయని వివరించారు. గృహ దహనాలు, చర్చీలతోపాటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. ఈ హింసాత్మక ఘటనలకు కేంద్ర, మణిపూర్ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు బాధ్యత వహించి దోషులను శిక్షించాలనీ, బాధితులకు న్యాయం చేయాలనీ, అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పాలని తమ్మినేని, కూనంనేని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

పార్లమెంట్‌లో ఉభయసభల్లో చర్చకు ప్రతిపక్షాల పట్టు

మణిపూర్ సెగలు

- ప్రధాని సమాధానమివ్వాలని డిమాండ్
- విపక్షాలిచ్చిన నోటీసులు తిరస్కరణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్ అంశం పార్లమెంటును కుదిపేసింది. అక్కడి అల్లర్లు, మహిళలపై జరుగుతున్న అమానుష ఘటనలపై సభలో చర్చ జరగాల్సిందేనంటూ ప్రతిపక్షాలు పార్లమెంటును స్తంభింపచేశాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ రాజీనామా చేయాలనీ, పార్లమెంటుకు ప్రధాని నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి. లోక్‌సభ, రాజ్యసభల్లోనూ ప్రతిపక్షాలు ఇదే తరహాలో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశాయి. ప్రతిపక్ష సభ్యులు ఈ అంశంపై వెల్‌లోకి వెళ్లి ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మెన్ వారిని తమ స్థానాల్లోకి వెళ్లి కూర్చోవాలని పలుమార్లు సూచించినా, ప్రతిపక్షాలు పట్టు వీడలేదు. ఒక రాష్ట్రంలో దుర్మార్గమైన హింస చెలరేగుతుంటే, ప్రధాని మౌనంగా ఉండటం ఏంటని తీవ్రంగా విమర్శించాయి. దీనితో ఉభయసభల్లో ఎలాంటి కార్యకలాపాలు జరక్కుండానే సోమవారానికి వాయిదా పడ్డాయి.



లోక్‌సభలో...

మంగళవారం ఉదయం లోక్‌సభ, రాజ్యసభలు ప్రారంభంకావడానికి కంటే ముందే మణిపూర్ హింసపై చర్చించాలని కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, బీఆర్ఎస్, టీఎంసీ సహా పలు పార్టీలు వాయిదా తీర్మాన నోటీసులిచ్చాయి. కానీ వీటిని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మెన్ అనుమతించలేదు. ఆ తీర్మాన నోటీసుల్ని తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. దీంతో సభలో ఒక్కసారిగా అలజడి ఏర్పడింది. సభలో చర్చించడానికి ఇంతకంటే ప్రధాన సమస్య ఏముందంటూ ప్రతిపక్షాలు వారితో వాగ్వివాదానికి దిగాయి. చర్చ జరగాల్సిందేనంటూ పట్టుబట్టి, వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేస్తారని స్పీకర్ ఓం బిర్లా చెప్పారు. అయినా ప్రతిపక్షాలు వెనక్కి తగ్గలేదు. ప్రధాని మోడీ సభలో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో నిముషాల వ్యవధిలోనే లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. ఆ తరువాత సభ తిరిగి ప్రారంభమైనా, పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదు. ప్రతిపక్ష సభ్యులు అదే డిమాండ్‌తో మళ్లీ ఆందోళనలకు దిగారు. దీనితో సభను సోమవారానికి (జులై 24) వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

కేంద్రం ఎదురుదాడి

'మణిపూర్ ఘటన చాలా తీవ్రమైంది. అక్కడ జరిగిన ఘటన యావత్ దేశం సిగ్గుతో తలదించుకునేలా చేసిందని స్వయంగా ప్రధాని చెప్పారు. మణిపూర్ అంశంపై చర్చించాలని ప్రభుత్వం కోరుకుంటుంది. ప్రతిపక్షాలు చర్చ జరక్కుండా గందరగోళం సష్టిస్తున్నాయి. దీనిపై ప్రతిపక్షాలు సీరియస్‌గా లేవని భావిస్తున్నా' అంటూ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఈ అంశంపై చర్చకు కేంద్రం సిద్ధమేననీ, దీనిపై కేంద్ర హోం మంత్రి ప్రకటన చేస్తారని పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రకటించారు. అయితే, ప్రతిపక్షాలు మాత్రం పార్లమెంట్‌లో చర్చించాల్సిన ఇతర అంశాలను పక్కన పెట్టి.. మణిపూర్ అంశంపై మాత్రమే చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నాయన్నారు.

సుదీర్ఘచర్చే జరగాలి

మణిపూర్ హింస, అక్కడ జరుగుతున్న పరిణామాలపై పార్లమెంటులో సుదీర్ఘ చర్చ జరగాలని కోరుతూ ప్రతిపక్షాలు రూల్ 276 కింద అత్యవసర చర్చకు పట్టుపడుతున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో రూల్ 176 కింద చర్చకు సిద్ధమని పేర్కొంది. రూల్ 176 కింద ఇతర సభా కార్యకలాపాలు పూర్తయ్యాక, సమయాన్ని బట్టి చర్చకు అనుమతి ఇస్తారు. ప్రతిపక్షాలు ఈ ప్రతిపాదనను తిరస్కరించాయి.

మణిపూర్ సీఎం రాజీనామా చేయాల్సిందే..

రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ మణిపూర్ ముఖ్యమంత్రితో...11లో

మోడీ బాధ నిజమే అయితే...

సీఎంను బర్తరఫ్ చేయాల్సింది : ఖర్గే



మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనను ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిజంగానే తీవ్రంగా పరిగణిస్తే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌ను ఆయన తొలుత బర్తరఫ్ చేసి...11లో


మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి

సీపీఐ(ఎం) డిమాండ్

- దేశవ్యాప్తంగా నిరసన కార్యాచరణకై పిలుపు



న్యూఢిల్లీ : మణిపూర్ ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. మణిపూర్‌లో జరిగిన సంఘటనలను నిరసిస్తూ, మణిపూర్ మహిళా బాధితులకు, ప్రజలకు సంఘీభావంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యాచరణ చేపట్టాలని, ముఖ్యమంత్రి రాజీనామాకై డిమాండ్ చేయాలని సీపీఐ(ఎం) తన శాఖలకు పిలుపిచ్చింది. ఈ మేరకు ...11లో




రాహుల్ పరువునష్టం కేసు విచారణ..

August 04కి వాయిదా

గుజరాత్ ప్రభుత్వానికి, పూర్ణేష్ మోడీకి సుప్రీం నోటీసులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పరువు నష్టం కేసులో గుజరాత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 4కు వాయిదా వేసింది. ప్రతివాదులు బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేష్ ఈశ్వరభాయ్ మోడీ, గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ...11లో



జ్ఞానవాపి మసీదు ఆవరణలో శాస్త్రీయ సర్వే

వారణాసి కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : జ్ఞానవాపి మసీదు ఆవరణలో గతంలో మూసివేసిన ప్రాంతాన్ని మినహాయించి మిగిలిన ప్రాంతంలో భారత పురావస్తు శాఖ శాస్త్రీయ సర్వే నిర్వహించేందుకు వారణాసి కోర్టు శుక్రవారం ఆమోదం తెలిపింది. కోర్టు ఆదేశాలతో జరిగిన వీడియో సర్వేలో హిందూ మహిళలు చెబుతున్న శివలింగం లేదా ముస్లింలు చెబుతున్న ఫౌంటేన్ ...11లో



భరోసా ఇచ్చేదాకా పోరు

16 రోజులైనా సమ్మెపై స్పందించని సర్కార్

- పలువురు నేతల సంఘీభావం

నవతెలంగాణ- విలేకరులు


గ్రామాలను ఆరోగ్యవంతంగా ఉంచడంలో కీలక పాత్ర వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో చెత్త పేరుకుపోతున్నా.. ముసురు వర్షాల నేపథ్యంలో ప్రజల ...11లో

అధునాతన రైసు మిల్లులపై ప్రత్యేక కమిటీ

సీఎం కేసీఆర్ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

రాష్ట్రంలో ధాన్యం దిగుబడి నాలుగు కోట్ల టన్నులకు చేరుకునే అవకాశాలున్నాయని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయ విధానంలో భాగంగా ఫుడ్ ప్రాసెస్ కంపెనీలను స్థాపించేందుకు నిర్ణయించామని తెలిపారు. ఇందులో భాగంగా మిల్లింగ్ కెపాసిటీని పెంచేందుకు వీలుగా రాష్ట్రంలోని మిల్లులకు అదనంగా మరిన్ని అధునాతన రైస్ మిల్లులను అందుబాటులోకి తెస్తామని వివరించారు. ఇందుకు సంబంధించిన విధి విధానాల ఖరారు కోసం ప్రత్యేక కమిటీని సీఎం ప్రకటించారు. ఆ కమిటీకి ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షుడిగా, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్, టీఎస్ఐఐసీ ఎమ్‌డీ నర్సింహారెడ్డి సభ్యులుగా వ్యవహరిస్తారు.



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్..

రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు తదితరాంశాలపై శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నిల్వ ఉన్న 1.10 కోట్ల టన్నుల ధాన్యాన్ని, నాలుగు లక్షల టన్నుల బియ్యాన్ని తీసుకోకుండా ఎఫ్‌సీఐ పలు రకాలుగా ఇబ్బందులు పెడుతోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితి ఈ విధంగా ఉంటే... అదనంగా మరింత ధాన్యం దిగుబడి కానుందని తెలిపారు. ఈ క్రమంలో రైతులు పండించిన వరి పంటను పలు రకాల ఆహార ఉత్పత్తులుగా మలిచి, ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేయాలని సూచించారు. తద్వారా రైతులకు మరింత లాభం చేకూరే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న రైస్ మిల్లుల సామర్థ్యం కోటి టన్నులు మాత్రమేనని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. అందువల్ల మరో రెండు కోట్ల టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసే దిశగా అధునాతన మిల్లులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో పేరున్న 'సటాకే' లాంటి కంపెనీలతో చర్చించామని వివరించారు. రామకృష్ణారావు నేతృత్వంలోని కమిటీ శనివారం నుంచే ఆయా కంపెనీలతో చర్చించి, ప్రభుత్వానికి...11లో

ఇలాంటివి వందలు జరిగాయి

అందుకే ఇంటర్నెట్‌ను నిషేధించాం

- మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై మణిపూర్ సీఎం బీరేన్



ఇంఫాల్ : మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళల్ని నగ్నంగా ఊరేగించిన ఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తుంటే.. మరోవైపు ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో కొన్ని వందలు జరిగాయని, అందుకే ఇంటర్నెట్‌ను నిషేధించామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.బీరేన్‌సింగ్ చెప్పడం మరింత దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. మహిళల్ని నగ్నంగా ఊరేగించిన సంఘటనలో దోషులపై ఇంకా చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నకు ముఖ్యమంత్రి పై విధంగా సమాధానం ఇచ్చారు. ఇద్దరు మహిళల్ని ఊరేగించి, అందులో ఒకరిపై సామూహిక మానభంగం జరిగిన ...5లో

దేశాన్ని రక్షించాను..నా భార్యను కాపాడుకోలేకపోయా..

కార్గిల్ యుద్ధ వీరుడి ఆక్రందన



మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించిన ఘటన ఎంత ఆవేదన కలిగిస్తోందో.. ఈ బాధిత మహిళల్లో...11లో

మూడు నెలల్లో మూడు సార్లు ఫిర్యాదు చేశాం!

- మణిపూర్ అధికారుల నుంచి స్పందన లేదు :ఎన్‌డబ్ల్యూసీ చైర్ పర్సన్

వివరాలు 5లో..

పైకే ఐక్యత...లోపల అనైక్యతే!

మధ్యలోనే వెళ్లిపోయిన విజయశాంతి

- పలువురు నేతల దుమ్మా
- మాట్లాడేందుకు వివేక్‌కు దక్కని అవకాశం
- ఈటల, రఘునందన్‌పై బండి మాటల తూటా
- తాను ఏడ్చానంటూ రాజగోపాల్‌రెడ్డి ఓపెన్
- ముభావంగా ఈటల, రఘునందన్‌రావు
- సంజయ్ ఆవేదన సభగా కిషన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ సభ

5లో..

ఆరోపణలు రుజువు చేయ్..

లేకుంటే ముక్కు నేలకు రాయ్

- ఎంపీ అరవింద్‌కు ఎమ్మెల్సీ కవిత సవాల్

నవతెలంగాణ-నిజామాబాద్

తనపై అర్థంపర్థం లేని ఆరోపణలు చేయడం కాదని, వాటిని రుజువు చేయాలని.. లేకుంటే పులాంగ్ చౌరస్తా వద్ద ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని ఎంపీ అరవింద్‌పై ఎమ్మెల్సీ కవిత ఫైర్ అయ్యారు. 24 గంటల్లోగా తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయాలని సవాల్ విసిరారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆమె చిట్‌చాట్...11లో



మాట్లాడుతున్న కవిత..

ఉద్యోగ భద్రత-కనీస వేతనం లేవు...

గురుకులాలతో సమానంగా ఫలితాలు సాధిస్తున్నా గుర్తింపు లేదు

రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు (యూఆర్ఎస్), సమగ్ర శిక్షలోని ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయినా వారికి ఉద్యోగ భద్రత లేదు, కనీస వేతనం అమలు కావడం లేదు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రెగ్యులర్ ఎంప్లాయీస్‌తో సమానంగా కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనమివ్వాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం వారికి కనీస వేతనాన్నే అమలు చేయడం లేదు. 20 ఏండ్లుగా పనిచేస్తున్నా, గురుకులాలతో సమానంగా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నా శ్రమకు తగిన వేతనం రావడం లేదు. సరైన గుర్తింపు దక్కడం లేదు. మరోవైపు వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) కమిటీ సిఫారసులూ అమలుకు నోచుకోవడం లేదు. దీంతో వారు మనోవేదనకు గురవుతున్నారు. హాస్టల్ నిర్వహణ కోసం కేర్‌టేకర్, సీఆర్టీలకు నైట్‌డ్యూటీలు వేయడంతో ఆందోళన చెందుతున్నారు.

- సీఎం హామీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి
- అమలుకు నోచుకోని పీఆర్సీ కమిటీ సిఫారసులు
- కేర్‌టేకర్, నైట్‌డ్యూటీలతో మానసిక ఒత్తిడి
- కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగుల ఆందోళన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాన పనికి సమాన వేతనమివ్వాలనీ, ఎస్‌వోను ప్రిన్సిపాల్‌గా, పీజీసీఆర్టీలను జేఎల్స్‌గా, సీఆర్టీలను స్కూల్ అసిస్టెంట్లుగా, పీఈటీలను పీడీలుగా గుర్తించి ఆ పోస్టు బేసిక్‌పేను చెల్లించాలనీ, పీఆర్సీ సిఫారసు ప్రకారం కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులకు ఏటా రూ.వెయ్యి ఇంక్రిమెంట్ ఇవ్వాలనీ, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కేజీబీవీ, యూఆర్ఎస్ కాంట్రాక్టు ఉద్యోగులకు సీఎల్ వినియోగానికి అర్హత కల్పించాలనీ, నెలకు రెండు సీఎల్స్ అనే పరిమితిని ఎత్తేయాలనీ, గురుకులాల పద్ధతిలో నిర్వహిస్తున్నందున వారికి వసతి కల్పించాలనీ, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి అనుగుణంగా కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆయా ...5లో



(ఫైల్)

విద్యాసంస్థలకు నేడు సెలవు: విద్యామంత్రి సబిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారీ వర్షాల నేపథ్యంలో శనివారం కూడా రాష్ట్రంలోని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తున్నట్టు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే గురు, శుక్రవారాలు రెండు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు శనివారం కూడా సెలవు ఉంటుందని స్పష్టం చేసింది.

ఆరు జోన్లుగా వైద్య, ఆరోగ్య శాఖ..!

ఒక్కో జోన్‌కు ఒక డీఎంఅండ్‌హెచ్‌ఓ

- మరింత తగ్గనున్న రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధి
- ఇంకా ఖరారు కాని విధివిధానాలు
- యూపీహెచ్‌సీ,పీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల వికేంద్రీకరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైద్య సేవలను మెరుగుపర్చేందుకు వైద్య, ఆరోగ్యశాఖ మరో అడుగు ముందుకేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల వారీగా ఉన్న వైద్యశాఖను జోన్లుగా విభజించడానికి సిద్ధమైంది. గతంలో నిర్వహించిన మంత్రిమండలి సమావేశంలోనే ఈ నిర్ణయం తీసుకోగా.. గురువారం ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ విధానం అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి జోన్ల వారీగా డీఎంఅండ్‌హెచ్‌ఓలు అందుబాటులో ఉండనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలకు మాత్రమే డీఎం అండ్ హెచ్‌లు ఉన్నారు. ఈ మూడు జిల్లాల వైద్యశాఖను సికింద్రాబాద్, చార్మినార్, ఖైరతాబాద్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి పేర్లతో ఆరు జోన్లుగా వికేంద్రీకరించి ఆరుగురు డీఎం అండ్ హెచ్‌ఓలను నియమించనున్నారు. వీరంతా ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానలు, ప్రయివేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు, క్లినిక్‌లు, ప్రయివేటు ల్యాబ్‌లు ఇలా అన్నింటినీ పర్యవేక్షించాల్సి ఉంటుంది. వికేంద్రీకరణ వల్ల వైద్యాధికారులకు పని భారం తగ్గి ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుంది. ఆయా ప్రాంతాల్లోని బస్తీ వాసులకు సత్వర వైద్య సేవలు అందించడంతోపాటు విపత్తుల సమయంలో క్లోజ్ మానిటరింగ్‌కు అవకాశం ఉంటుంది. జాతీయ టీకాలు, నులి పురుగులు లాంటి కార్యక్రమాల నిర్వహణ కూడా సులభతరం కానుంది. కొత్తగా ఎంపికైన డీఎంఅండ్ హెచ్‌ఓలు జోనల్ కమిషనర్లకే రిపోర్టు చేయాల్సి ఉంటుంది.



తగ్గనున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖల పరిధి

ప్రస్తుతం హైదరాబాద్ డీఎం అండ్‌హెచ్‌ఓ పరిధిలో 91 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 166 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో 19 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా, మరో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ జోన్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలన్నీ హైదరాబాద్ పరిధిలోకి వెళ్లనున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో 36 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా.. వీటిలో 12 తప్ప మిగిలినవన్నీ కొత్త డీఎంఅండ్‌హెచ్‌ల పరిధిలోకి రానున్నాయి. ఏ ఆరోగ్య కేంద్రం ఏ డీఎం అండ్‌హెచ్‌ఓ పరిధిలోకి వస్తుందనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. అటు ప్రభుత్వం కానీ, ఇటు వైద్య, ఆరోగ్య శాఖ కానీ ఇంత వరకు విధివిధానాలను ఖరారు చేయలేదు. ఇప్పటి వరకు రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పరిధిలో ఉన్న ఆరోగ్య కేంద్రాలు.. ఇకపై జోన్‌లోని డీఎంఅండ్ హెచ్‌ఓల పరిధిలోకి రానుండటంతో ఆయా జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ పరిధి మరింత తగ్గనుంది.

పర్యవేక్షణ సులభతరం చేసేందుకే..

గ్రేటర్ వ్యాప్తంగా ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, ఫర్టిలిటీ సెంటర్లు, డెంటల్ ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు, చిన్న చిన్న క్లినిక్‌లు వేల సంఖ్యలో ఉన్నాయి. వీటితో పాటు బస్తీ దవాఖాన, యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు కూడా ఉన్నాయి. వైద్య, ఆరోగ్యశాఖను జోన్ల వారీగా విభజించడంతో డీఎంఅండ్‌హెచ్‌ఓల పరిధి తగ్గి ఆయా ఆస్పత్రులపై పర్యవేక్షణ పెరగనుంది.

రోగులకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందడంతోపాటు అనుమతుల్లేకుండా కొనసాగుతున్న క్లినిక్‌లు, నర్సింగ్ హోంలు, ఆస్పత్రులపై మరింత నిఘా పెంచడానికి వీలుంటుందని సర్కార్ భావిస్తోంది. బస్తీలు, గల్లీలు, సిటీ పరిసర ప్రాంతాల్లో నకిలీ డాక్టర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. వీరి ఆట కట్టించడంతోపాటు ఫేక్ ధ్రువపత్రాలు సృష్టించేవారు, సిజేరియన్లను ప్రోత్సహించే ఆస్పత్రులు, భ్రూణ హత్యలను ప్రోత్సహిస్తున్న ఆస్పత్రులు, డాక్టర్లపై ప్రత్యేక నిఘా పెట్టే అవకాశం ఉంటుందని ప్రభుత్వం అంచనాకు వచ్చినట్టు సమాచారం.

దోస్త్ మూడోవిడత సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 26

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మూడో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువు ఈనెల 26 వరకు ఉందని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, విద్యాశాఖ కార్యదర్శి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం నుంచి ఈనెల 26 వరకు మొదటి, రెండు, మూడో విడతలో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసిన వారు కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. 26 నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. ఈనెల 28 నుంచి 31 వరకు దోస్త్ ఇంట్రా కాలేజీ విడత ద్వారా వెబ్ ఆప్షన్లను నమోదు చేయాలని తెలిపారు. వచ్చేనెల ఒకటిన సీట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. కాలేజీల్లో సీట్లు ధ్రువీకరించుకున్న విద్యార్థులే ఇంట్రా కాలేజీ విడతకు అర్హులని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

రేపటివరకు సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో సీట్లు పొందిన అభ్యర్థులు సెల్ఫ్‌రిపోర్టింగ్ చేసే గడువును ఆదివారం వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ శుక్రవారమొక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో సెల్ఫ్ రిపోర్టింగ్‌తోపాటు ఆన్‌లైన్‌లో ట్యూషన్ చెల్లింపు గడువును ఆదివారం వరకు పొడిగించామని తెలిపారు. అయితే ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ తొలివిడతలో 173 కాలేజీల్లో 82,666 సీట్లుంటే, 70,665 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించిన సంగతి విదితమే.

'మెడికల్ సీట్ల కౌన్సెలింగ్‌లో కేంద్రీకృత విధానం సరికాదు'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెడికల్ సీట్ల కౌన్సెలింగ్‌లో కేంద్రీకృత విధానం సరైంది కాదని చేవెళ్ల ఎంపీ జి రంజిత్‌రెడ్డి లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయన ప్రశ్నకు శుక్రవారం కేంద్ర వైద్యశాఖ మంత్రి మనుసూఖ్ మాండవీయ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2023-24 విద్యా సంవత్సరానికిగానూ తాము మెడికల్ సీట్ల కౌన్సెలింగ్‌లో కేంద్రీకత విధానం అవలంభించడం లేదని తెలిపారు. భారత సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన నియమ నిబంధనలకు లోబడే, పాత ప్రక్రియలోనే మెడికల్ సీట్ల కౌన్సెలింగ్‌ను చేపడతామని మంత్రి స్పష్టం చేశారు. మెడికల్ సీట్లలో కేవలం 15 శాతం మాత్రమే ఆలిండియా కోటా ఉంటుందని వివరించారు.

వర్షాలతో స్తంభించిన జనజీవనం

- ప్రాజెక్టుల్లోకి వరద నీటితో గేట్లు ఎత్తివేత
- మత్తడి పోస్తున్న చెరువులు, కుంటలు
- నీట మునుగుతున్న పంట పొలాలు
- కేంద్రాలకు ముంపు ప్రాంత ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

నవతెలంగాణ-విలేకరులు

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. చెరువులు, కుంటలు మత్తడి పోస్తున్నాయి. రహదారులపై వరద నీరు చేరి వాహన, పాదచారులకు ఇబ్బందికరంగా మారాయి. పంట పొలాల్లోకి కూడా వర్షపు నీరు భారీగా వచ్చి చేరడంతో పంట నీట మునిగే పరిస్థితులు నెలకొన్నాయి. శిథిలావస్థకు చేరిన ఇండ్లు కూలుతున్నాయి.

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని చెరువుల్లోకి వరద నీరు వచ్చి చేరింది. ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగళూర్ గేట్ నుంచి మై హెూమ్స్ వెళ్ళే దారిలో ఉన్న వాగు నిండి రోడ్డుపైకి నీరు వస్తోంది. కడ్తాల్ మండలంలోని టాకురాజుగూడ గ్రామంలో వర్షం ధాటికి ఓ ఆవు, దూడ మృత్యువాతపడ్డాయి. వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం మైలారం మొండికుంట చెరువు అలుగు పారడంతో కొత్త తండా చింతకుంట గ్రామానికి పోయే రోడ్డు మార్గంలో అంపల్లికి చెందిన డ్రైవర్ వరదలో చిక్కుకున్నాడు. స్థానికులు అప్రమత్తమై మరో ట్రాక్టర్ సహకారంతో డ్రైవర్‌ని కాపాడారు. నవాబుపేట మండలం చించల్‌పేట్ గ్రామంలో మూసినదిపై నిర్మించిన వంతెన (బ్రిడ్జి) వద్ద వరద ఉధృతిని కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి పరిశీలించారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం సమీపంలోని బీమలింగం మూసీ నది వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేసి ప్రయాణికులను దారి మళ్లిస్తున్నారు. భూదాన్‌పోచంపల్లిలో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆలేరు మండలకేంద్రంలో ఈదుల వాగు, రత్నాల వాగు పొంగిపొర్లుతున్నాయి. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిగూడెంలో కౌలు రైతు యాట ముత్యాలు వ్యవసాయ బావి వద్ద విద్యుద్ఘాతానికి గురై మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మోదీన్‌పురం ఆవాసం పాండ్యానాయక్‌తండాలో ధరావత్ మధు(23) తన పొలం గట్ల మీద నడుస్తుండగా అప్పటికే తెగిపడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగలడంతో విద్యుద్ఘాతమైంది. సూర్యాపేట ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో మృతి చెందాడు.

ఉమ్మడి మెదక్ జిల్లాలోని మంజీర నదిలోనికి వరద నీరు వచ్చి చేరుతోంది. ఘనపూర్ ఆనకట్ట పొంగిపొర్లుతోంది. సంగారెడ్డి జిల్లా పరిధిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజార్శిషా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్ సూచించారు. అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం షెరిగుడా గ్రామంలో గొల్ల మల్లేశ్ ఇంటి కప్పు కూలిపోయింది. కృష్ణ మండలం అయినాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో రైల్వే వంతెన కిందకు భారీగా నీరు చేరింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని మొట్ల తిమ్మాపురంలోని వట్టే వాగు ఉధృతంగా ప్రవహించడంతో రెండు రోజులుగా గ్రామం జలదిగ్బంధంలో ఉంది. కాచినపల్లి గ్రామానికి చెందిన పశువుల కాపరి గోగ్గల పాపారావు(60) మూర్ఛ వ్యాధి వచ్చి వాగులో పడిపోయి మృతిచెందారు. జనగామ జిల్లా జఫర్గఢ్ మండల కేంద్రానికి చెందిన గొర్ల కాపరి ముడికే కొమురయ్యకు చెందిన గొర్రెలు, మేక విద్యుద్ఘాతంతో మృత్యువాతపడ్డాయి. తరిగొప్పుల మండలం అక్కరాజు పల్లి గ్రామంలో తాటి పోచయ్య ఇల్లు కుప్పకూలింది. ములుగు జిల్లా మంగపేట తహసీల్దార్ కార్యాలయంలోకి వర్షం నీరు వచ్చి చేరింది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం చెరువు నీటిమట్టం 25 అడుగులు దాటిందని నీటిపారుదల శాఖ ఏఈ హర్షద్ తెలిపారు. వరంగల్ జిల్లా పాకాల సరస్సు నీటిమట్టం 19 అడుగులకు చేరుకోగా, మాదన్నపేట పెద్ద చెరువు 17 అడుగులకు గాను 16 అడుగుల నీరు చేరుకొంది. మరో రెండ్రోజుల్లో మత్తడి పడే అవకాశాలు ఉన్నాయి. గురిజాల పెద్దం చెరువు లోలెవల్ కాజ్ వే వరద ప్రవాహం తీవ్రంగా ఉండగా రాకపోకలు స్తంభించాయి. మహబూబాబాద్ జిల్లాలోని మినీ బొగత జలపాతం పరవళ్ళు తొక్కుతోంది.


కడెం ప్రాజెక్టు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగా తదితర నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. పంటలన్నీ నీట మునిగాయి. అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాలలో గోదావరి నీటి మట్టం పెరగడంతో సమీపంలో నిర్మించిన మాతాశిశుసంరక్షణ కేంద్రాన్ని అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. బోథ్ మండలం ధన్నూర్(బి) గ్రామంలో జుపాక రాజేశ్వర్ ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందారు. ఇంద్రవెల్లి మండలం గిన్నెర పంచాయతీ పరిధిలోని తోయగూడ గ్రామానికి చెందిన కొడప రాంబాయి మృతి చెందడంతో వాగుదాటలేక మృతదేహాన్ని ఎడ్లబండ్ల సాయంతో ఊరికి చేర్చారు.

హైదరాబాద్‌లోని సీతాఫల్‌మండీ, చిలకలగూడ, బేగంపేట, ప్యారడైజ్, తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం తర్వాత నగరంలో వర్షం కాస్త తగ్గడంతో ప్రజలు బయటకు రావడం కనిపించింది. హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ హిమాయత్ నగర్‌లోని ఆదర్శ్ బస్తీలో ముంపునకు గురైన ప్రాంతంతోపాటు నల్లకుంటలోని పద్మ నగర్, నాగయ్య కుంట అడిక్‌మెట్ ప్రాంతాల్లో నాలా పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి పరిశీలించారు. హిమాయత్ నగర్ స్ట్రీట్ నెం.14 లోతట్టు ప్రాంతంలో గురువారం రాత్రి నుంచి నాలా పొంగి ఇండ్లలోని రావడంతో మాన్సూన్ ఎమర్జెన్సీ టీంతో పాటు డీఆర్ఎఫ్ టీంలు మోటర్లు పెట్టి నీటిని బయటకు పంపించారు.

ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీరు విడుదల

ఎగువన ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోనూ ఎడితెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలోని పలు ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు రావడంతో మేడిగడ్డ బ్యారేజీ 75 గేట్లు తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారు. మేడిగడ్డలో 93.80 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అన్నారం బ్యారేజీ 56 గేట్లు ఎత్తి 1,26,000 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో కడెం ప్రాజెక్టులోని 14గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాత్నాల, గడ్డెన్నవాగు, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని విడిచిపెడుతున్నారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి అలుగులపై నుండి నీరు పొంగిపొర్లుతూ మంజీరా నది ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి చేరుతుంది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. ఎల్లారెడ్డిలోని కల్యాణి ప్రాజెక్టుగేట్లు ఎత్తారు. నిజామాబాద్ జిల్లా సాలూర వద్ద మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దాని పై నుంచి రాకపోకలు నిషేధిస్తూ రెవెన్యూ అధికారులు కందకం తవ్వారు. కందకుర్తి త్రివేణి సంగమం వద్ద గోదావరి ఉధృతికి శివాలయం మునిగిపోయింది. ఎస్సారెస్పీకి 59 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మెదక్ జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా 20.136 టీఎంసీలకు చేరుకుందని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ చెరువులకు వరద పోటెత్తింది. హిమాయత్‌సాగర్ రెండు గేట్లను ఎత్తి 700 క్యూసెకుల నీటిని దిగువకు వదిలారు.


43 అడుగుల వరద నిలకడగా భద్రాద్రి గోదారి

భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు 43 అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ ప్రియాంక అలా భద్రాచలం బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని మంత్రి సూచించారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్ట్ మొత్తం 24 గేట్లకు గాను 16 గేట్లను పూర్తి స్థాయిలో ఎత్తి 50,745 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.


బయ్యారం పెద్ద చెరువు


మెదక్‌లో...


నిర్మల్ ఇంద్రవెల్లిలో...


పొంగుతున్న బొగత

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సహాయమందించండి

- ఎస్పీలకు డీజీపీ అంజనీకుమార్ ఆదేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అందుబాటులో ఉండి తగిన సహాయ సహకారాలను అందించాలని పోలీసు అధికారులను రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ ఆదేశించారు. శుక్రవారం అన్ని జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో జలమయం అయ్యాయనీ, లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో వర్షప్రభావిత ప్రాంతాల పోలీసు అధికారులు స్థానిక ముంపు ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వర్షాలపై తగిన సూచనలు, జాగ్రత్తలను ప్రజలకు సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు అందించి వారు తగిన జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో చాలా వరకు భారీ వర్షాల కారణంగా రోడ్లు తెగిపోయిన పరిస్థితులు ఏర్పడ్డాయనీ, ఆ ప్రాంతాల ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తూ సహాయపడాలని సూచించారు. భారీ వర్షాలు ముగిసే వరకూ ఉన్నతాధికారులెవ్వరు కూడా హెడ్‌క్వార్టర్లను వదలరాదని ఆదేశించారు. ముఖ్యంగా ఖమ్మం, భద్రాచలం ప్రాంతాల్లో, గోదావరి ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా బాధిత ప్రజలను సహాయక కేంద్రాలకు తరలించడానికి రెవెన్యూ అధికారులకు సహకరించాలని సూచించారు. కాగా, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో భారీ వర్షాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కింది స్థాయి అధికారులకు తగిన సూచనలిస్తున్నట్టు రీజియన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

లలిత సంగీత శిఖరం చిత్తరంజన్ కన్నుమూత

- ఆకాశవాణిలో మూడు దశాబ్దాలకుపైగా స్వరకర్తగా సేవలు


(ఫైల్)

నవతెలంగాణ-కల్చరల్

తొలితరం లలిత సంగీత శిఖరం.. డాక్టర్ మహాభాష్యం చిత్త రంజన్(85) శుక్రవారం ఉదయం హైదరాబాద్ కొత్తపేటలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆకాశవాణిలో మూడు దశాబ్దాలపైగా లలిత సంగీతం స్వరకర్తగా, అధికారిగా, గాయకుడిగా పనిచేశారు. దూరదర్శన్ తెలుగు కార్యక్రమాలు ప్రారంభం నుంచి ఆయన విధులు నిర్వర్తించారు. ప్రసిద్ధ కవులు సినారె, దాశరథి దేవులపల్లి కృష్ణశాస్త్రి తదితరుల లలిత గీతాలను స్వర పరచి వాటికి ప్రాచుర్యం కల్పించారు. ఆకాశవాణిలో ఈ పాట నేర్చుకొందాం, కలిసి పాడుదాం కార్యక్రమ రూప కల్పనలో ఎందరో గాయనీ గాయకులను చిత్త రంజన్ పరిచయం చేశారు. ప్రభుత్వ పురస్కారాలు, సాంస్కృతిక సంస్థల సత్కారాలు ఎన్నో అందుకున్న చిత్తరంజన్ తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. తెలుగు విశ్వవిద్యాలయంలో లలిత సంగీతం విభాగానికి కోర్సును రూపొందించి ఉపన్యాసకునిగా పనిచేశారు. ఆయన ముగ్గురు కుమార్తెలు సంగీతరంగంలో ప్రసిద్ధులు. చిత్తరంజన్ అంత్యక్రియలు శనివారం తార్నాక శ్మశాన వాటికలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

పలువురి సంతాపం

చిత్తరంజన్ మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. గొప్ప సంగీత కళాకారున్ని కోల్పోయామని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణ అన్నారు. తుది వరకూ లలిత సంగీతమే శ్వాసగా జీవించారని కొనియాడారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. లలిత సంగీతం పెద్ద దిక్కును కోల్పోయిందన్నారు. గాన సభతో ఆయనకు ఎంతో అనుబంధం ఉందని గాన సభ అధ్యక్షులు కళా జనార్ధనమూర్తి తెలిపారు. పలువురు సంగీత కళాకారులు కలగా కృష్ణమోహన్ శశికళ, సురేఖ వి.కె.దుర్గ, రమణకుమారి తదితరులు సంతాపం ప్రకటించారు.

మణిపూర్ ఆకృత్యంపై ఆగ్రహం

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్రం దిష్టిబొమ్మ దహనం
- ఆ రాష్ట్ర సీఎం రాజీనామాకు డిమాండ్

నవతెలంగాణ- విలేకరులు

మణిపూర్‌లోని కాంగ్‌పోక్పీ జిల్లాలో కుకీ తెగకు చెందిన ఇద్దరు ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగికదాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. మణిపూర్ ఆకృత్యాలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాయి.

ఐద్వా, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై సాగుతున్న అఘాయిత్యాలపై ఆందోళన వ్యక్తం చేశారు. వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించి బాధిత మహిళల కుటుంబ సభ్యులను హత్య చేసినట్టు కూడా వార్తలు వస్తున్నాయని అన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, సహాయ కార్యదర్శి గాదె నరసింహ, బొల్లు రవీందర్, తక్కెళ్ళపల్లి శ్యామ్, ఐద్వా పట్టణ కార్యదర్శి భూతం అరుణకుమారి, అధ్యక్షులు తుమ్మల పద్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మిర్యాలగూడలో సీఐటీయూ, బంజారా, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో ఐద్వా ఆధ్వర్యంలో ఏఎంసీ కాలనీలో నిరసన తెలిపారు. కొత్తగూడెం పట్టణ కేంద్రంలోని పాత కొత్తగూడెం గౌతమ్‌నగర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఖమ్మం నగరంలోని జడ్పీ సెంటర్‌లో ఐద్వా, పీఓడబ్ల్యూ ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు.

వట్టిపోయిన శ్రీశైలం, జూరాల రిజర్వాయర్లు

- గత ఏడాది జులై 21న జూరాలలో 8.42 టీఎంసీలు
- తాజాగా డెడ్ స్టోరేజ్
- ఆందోళనలో అన్నదాతలు

నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి



గత ఏడాది జులై 7వ తేదీ నాటికే భారీ వరదల వల్ల జూరాలతోపాటు శ్రీశైలం గేట్లను తెరిచారు. ఈ ఆ జలాశయాలు వెలవెల పోతున్నాయి. వరదలు మరింత ఆలస్యమైతే వరి నాట్లకు ఇబ్బందులు తప్పేలా లేదు. ప్రధానంగా శ్రీశైలం రిజర్వాయర్ ఆధారంగా నిర్మించుకున్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలో ఉన్న ఆయకట్టు అంతా బీళ్లుగా మారే అవకాశాలున్నాయి. జూరాలది అదే పరిస్థితి. ఈ రిజర్వాయర్ మీద నెట్టెంపాడు, రామన్‌పాడు, బీమా వంటి ప్రాజెక్టులు ఉన్నాయి. రెండు రిజర్వాయర్ల పరిధిలో సుమారు ఐదు లక్షల ఎకరాలకుపైగా సాగయ్య అవకాశాలు ఉన్నాయి. రిజర్వాయర్లోకి నీటి చుక్క రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఈపాటికే భారీ వరదలు వచ్చి కృష్ణానది పరవళ్ళు తొక్కింది. ఈసారి ఆ పరిస్థితులు లేవు. జూరాల నీటి సామర్థ్యం 1045 అడుగులు, 9.66 టీఎంసీలు. అయితే, 3.95 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. గత ఎడాది జులై 21న 8.42 టీఎంసీల నీరు ఉంది. శ్రీశైలం రిజర్వాయర్‌లో 885 అడుగుల నీళ్ల రావాలి. 33.58 టీఎంసీల నీళ్ల నిల్వ ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఈసారి చాలా తక్కువగా ఉంది. జూరాలలో ఐదు టీఎంసీల నీళ్ల తక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లాలో నదులు ఎండిపోయాయి. రిజర్వాయర్లన్నీ వెలవెలబోతున్నాయి. రిజర్వాయర్లకు అనుబంధంగా కృష్ణ, తుంగభద్ర, భీమా నదులు ఎండిపోయాయి. ఎగువ కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలలో వర్షాలు లేకపోవడంతో వరదలు లేవు.

సాగు భూములు బీడు

రిజర్వాయర్ల కింద సాగయ్యే భూములు నీరు లేక బీడుగా మారాయి. సుమారు 6 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్‌లో సాగయే సోనా, మసూరి, బాపట్ల, సాంబార్లు ఐదు నెలలకు దిగుబడి వస్తుంది. వర్షాలు ఆలస్యం కావడంతో ఈ పంటలు సాగు ఈసారి కష్టమే. సాగు చేసినా తెగుళ్ల వచ్చి దిగుబడి తగ్గే అవకాశాలున్నాయి. హంస సాగైతే దిగుబడి తక్కువగా ఉంటుంది. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ అధికారులు రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

న్యాయమే గెలిచింది...

- హైకోర్టు తీర్పుపట్ల గెస్ట్ లెక్చరర్ల సంఘం హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

న్యాయమే గెలిచిందనీ, హైకోర్టు తీర్పు అధికారుల మొండివైఖరికి చెంపపెట్టుఅని గెస్ట్ లెక్చరర్ల సంఘం విమర్శించింది. 1,654 మంది గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలనీ, కొత్త వేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలంటూ హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 405 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పదేండ్లుగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లను కాదనీ, ప్రస్తుత విద్యాసంవత్సరంలో పీజీ మెరిట్ ఆధారంగా కొత్త వారిని ఎంపిక చేయాలంటూ ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్ మార్గదర్శకాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే గెస్ట్ లెక్చరర్లు న్యాయ పోరాటం కోసం హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. తాత్కాలిక ఉద్యోగిని తొలగించి మరో తాత్కాలిక ఉద్యోగిని నియమించడం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించినట్టు అవుతుందని పేర్కొన్నారు.

1,654 మంది గెస్ట్ లెక్చరర్లను యధావిధిగా కొనసాగించాలంటూ కమిషనర్‌ను, ప్రభుత్వాన్ని ఆదేశించిందని వివరించారు. కొత్త నోటిఫికేషన్ వేసిన ఇంటర్ విద్యా కమిషనర్, అధికారులకు ఈ తీర్పు చెంపపెట్టు అని విమర్శించారు.

గుండెపోటుతో కరీంనగర్ డీఐఈఓ మృతి



నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈఓ) టి.రాజ్యలక్ష్మి శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. మూడున్నరేండ్లుగా డీఐఈఓ(ఎఫ్ఏసీ)గా సేవలందిస్తునారు. టైపిస్ట్‌గా ఉద్యోగంలో చేరి, జూనియర్ లెక్చరర్, ప్రిన్సిపాల్, డీఐఈఓ స్థాయికి చేరుకున్నారు. ఆమె భర్త పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో రిటైరయ్యారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కరీంనగర్‌లోని చైతన్యపురిలో గల ఆమె నివాసంలో మృతదేహాన్ని ఉంచారు. జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్స్, నాన్ టీచింగ్ స్టాఫ్, డీఐఈఓ ఆఫీస్ స్టాఫ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. కాగా, రాజ్యలక్ష్మి మృతి పట్ల జిల్లా మంత్రి గంగుల కమలాకర్ సంతాపం ప్రకటించారు.

ఆదివాసి మహిళలపై లైంగిక దాడి అమానుషం..

- దోషులను కఠినంగా శిక్షించాలి : పీఓడబ్ల్యూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్ 3

మణిపూర్‌లో ఆదివాసి మహిళలపై అత్యంత పాశవికంగా లైంగిక దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ప్రగతి శీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి ఝాన్సీ, అందె మంగ శుక్రవవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.గత మూడు నెల్లుగా మణిపూర్‌లో మారణ హోమం జరుగుతున్నదని తెలిపారు. 2002 గుజరాత్ మారణ హోమాన్ని గుర్తు చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లపై దాడులు, కూల్చివేయడం, హత్యలు, సామూహిక లైంగిక దాడులు, ప్రార్థనాస్థలాల కూల్చివేత జరుగుతున్నా కేంద్రం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నదని విమర్శించారు. 'మోడీ మాట్లాడండి. మాట్లాడండి'. అంటూ కుకీ మహిళలు అభ్యర్థించినా ప్రధాని నోరు మెదపటం లేదని తెలిపారు. చివరకు సుప్రీం కోర్టు జోక్యంతో మోడీ మౌనం వీడారని ఆవేదన వ్యక్తం చేశారు

'నో క్యాస్ట్ నో రిలీజియన్' కాలంపై హైకోర్టు తీర్పు హర్షణీయం

- జస్టిస్ చంద్రకుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యతో పాటు ఇతర అన్ని దరఖాస్తుల్లో నో క్యాస్ట్ నో.. రిలీజియన్ అనే కాలమ్‌ను తప్పకుండా. చేర్చాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించడాన్ని కుల, మతాంతర వివాహాల రక్షణ ఐక్య వేదిక చైర్మెన్ జస్టిస్ చంద్ర కుమార్ హర్షం వ్యక్తం చేశారు. కులాన్ని మతాన్ని వదులుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందనీ, ఆ స్వేచ్ఛను అడ్డుకునే హక్కు ఎవ్వరికీ లేదని తెలిపారు. అలాంటి దరఖాస్తులను తిరస్కరించే హక్కు ఏ అధికారికి లేదనీ, ఆ మేరకు మున్సిపాల్టీ కమిషనర్లకు, విద్యాశాఖ కమిషనర్లకు న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేయటం మంచి పరిణామమని పేర్కొన్నారు. అలాంటి అప్లికేషన్లను తిరస్కరించే పద్ధతి రాజ్యాంగంలో లేదనీ, అది లౌకిక స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. అది ఆర్టికల్ 14, 19, 21 25ను ఉల్లంఘించటమే అవుతుందంటూ జస్టిస్ కన్నెగంటి లలిత చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని తెలిపారు. ఇది ఒక సంచలన తీర్పు అని కొనియాడారు. దీనిని తక్షణమే అమలు చేయాలని కోరారు. కోర్టు తీర్పుపట్ల కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు, కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. వహీద్, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్,టీపీఎస్‌కే నాయకులు భూపతి వెంకటేశ్వర్లు తదితరులు కూడా హర్షం వ్యక్తం చేశారు.

సంపాదకీయం

పేదరికం తగ్గిందట!

తిమ్మిని బమ్మిని చేయడం..లేనిది ఉన్నట్టు చూపడం... మోడీ ఏలుబడిలో సర్వసాధారణంగా మారిపోయింది. తాజాగా నీటి అయోగ్ అందుకు ఉపక్రమించడం విడ్డూరం. దేశంలో పేదరికం తగ్గిపోతోందంటూ ఆ సంస్థ ఇచ్చిన నివేదిక మోడీ సర్కారుకు రాజకీయ లబ్ధిచేకూర్చేందుకే.

పేదరికాన్ని తగ్గించడంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం కీలకపాత్ర పోషించింది. వామపక్షాల ఒత్తిడితో కేంద్రంలోని యుపిఎ2 ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం వల్ల 2005-06 నుంచి 2019-21 మధ్య 41.5 కోట్ల మంది దారిద్ర్యం నుంచి బయటపడ్డారని ఐక్యరాజ్యసమితి నివేదిక ఇటీవల పేర్కొంది. ఆ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ఎత్తులు వేస్తూ ఏటా నిధులు తెగ్గోసే పరిస్థితినే మోడీ ఏలుబడిలో చూస్తున్నాం. మనకన్నా రెండేళ్లు ఆలస్యంగా స్వాతంత్ర్యం పొందిన చైనా ఇప్పటికే పేదరికాన్ని పూర్తిగా రూపుమాపింది.

గత అయిదేళ్లలో 13.5కోట్ల మంది పేదరికం నుంచి బయట పడినట్లు నీటి అయోగ్ తాజాగా సెలవిచ్చింది. గత ఏడాది ప్రపంచ ఆకలి సూచీలో మొత్తం 121 దేశాల్లో 107వ స్థానంలో భారత్ నిలిచింది. అంతకుముందు ఏడాదితో పోల్చితే ఆరు స్థానాలు దిగజారింది. 2016 నుంచి ఈ ర్యాంకు దిగజారిపోతూనే ఉంది. తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఇరుగుపొరుగు దేశాలైన పాకిస్థాన్ (99), శ్రీలంక (64), నేపాల్ (81), బంగ్లాదేశ్ (84) మన కన్నా మెరుగైన స్థితిలో ఉన్నాయి. ఐదేళ్లకంటే తక్కువ వయసు పిల్లల పోషకాహార లోపం ఉన్న జనాభా నిష్పత్తి, శారీరక క్షీణత (ఎత్తుకు తగ్గ బరువు), పిల్లల్లో ఎదుగుదల లోపం (వయసుకు తగ్గ ఎత్తు), మరణిస్తున్న పిల్లల నిష్పత్తి ప్రపంచ ఆకలి సూచీ పరిగణనలోకి తీసుకున్న అంశాలు. ఈ సూచీ కంటే వాస్తవ పరిస్థితి మరింత భయంకరంగా ఉందనేది వైద్యనిపుణుల అనుభవం.



దేశంలో అధికారిక సర్వేలు, గణాంకాలు తప్పుల తడక అని, రాజకీయ జోక్యం పెరిగిపోతుండడం వల్ల గణాంకాలు విశ్వసనీయత కోల్పోతున్నాయని పలువురు ఆర్థిక వేత్తలు, మేధావుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని రకాల ఆర్థిక సర్వేలు, గణాంకాల సమీక్షకు కొత్త స్టాండింగ్ కమిటీ వేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిన మూడు రోజులకే నీటి అయోగ్ ఈ నివేదిక వెలువరించడం గమనార్హం. కార్పొరేట్ల ప్రయో జనాల పరిరక్షణే ధ్యేయంగా ప్రణాళికా సంఘం స్థానే పుట్టుకొచ్చిన నీటి అయోగ్ తాజాగా ప్రభుత్వానికి రాసిన లేఖలో ఐదేళ్లలో (2015-16, 2019-21 మధ్య) 13,54,61,035 మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపింది. పేదరికాన్ని కొలిచే పద్ధతులను మార్చడం, ప్రాతిపదికల్లో కొన్నిటిని తొలగించడం ద్వారా పేదరికం తగ్గినట్టు చూపడం ఆమోదయోగ్యం కాదు. పరిశీలించిన 12 అంశాల్లో... పేదరికాన్ని తగ్గించడంలో పోషకాహారంలో మెరుగుదల, పాఠశాల విద్య, పారిశుధ్యం, వంట ఇంధనం ముఖ్యమైన పాత్ర పోషించాయని నీటి అయోగ్ పేర్కొంది.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) సర్వే ప్రకారం మనదేశంలో 57 శాతం మంది మహిళలు, 67శాతం మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రసూతి మరణాలకు, పిల్లల మరణాలకు, పిల్లల్లో ఎదుగుదలకు ప్రధాన కారణమైన రక్తహీనతను ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6 సర్వే నుంచి ఎత్తివేయాలని తాజాగా కేంద్రంలోని పాలకులు నిర్ణయించారు. మనదేశంలో 21.7 శాతం సంపద ఒకశాతం శత కోటీశ్వరుల చేతుల్లో ఉండగా, 40 శాతం మంది దేశ ప్రజల చేతుల్లో ఉన్న సంపద 19.8 శాతమే. మోడీ ఏలుబడిలో ఆర్థికరంగం అస్త వ్యస్థం కావడం, సమస్తం కార్పొరేటీకరిస్తుండటం, అన్ని రంగాల్లో వైఫల్యంతో పేదరికం గణనీయంగా పెరిగింది. దీనిని కప్పిపుచ్చి, ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందేందుకు నీటి అయోగ్ వంటి సంస్థల ద్వారా అనుకూల నివేదికలు తెప్పించుకోవడం పరిపాటిగా మారింది. గత ఏడాది విడుదలైన మానవాభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ)లో మనదేశం 132వ స్థానంలో ఉంది. రెండేళ్ల క్రితంతో పోలిస్తే ఒక స్థానం దిగజారింది. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను అధిగమించి ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నామని చాలాకాలంగా మోడీ సర్కారు ఊదరగొడుతోంది. మానవాభివృద్ధిలో 18వ స్థానంలో ఉన్న బ్రిటన్‌కు, మన దేశానికి మధ్య 114 స్థానాల అంతరం ఉందన్న విషయాన్ని మాత్రం దాటవేస్తూ ఉంటుంది.

పేదరికాన్ని తగ్గించడంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం కీలకపాత్ర పోషించింది. వామపక్షాల ఒత్తిడితో కేంద్రంలోని యుపిఎ హయాంలో ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం వల్ల 2005-06 నుంచి 2019-21 మధ్య 41.5 కోట్ల మంది దారిద్ర్యం నుంచి బయటపడ్డారని ఐక్యరాజ్యసమితి నివేదిక ఇటీవల పేర్కొంది. ఆ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ఎత్తులు వేస్తూ ఏటా నిధులు తెగ్గోసే పరిస్థితినే మోడీ ఏలుబడిలో చూస్తున్నాం. మనకన్నా రెండేళ్లు ఆలస్యంగా స్వాతంత్ర్యం పొందిన చైనా ఇప్పటికే పేదరికాన్ని పూర్తిగా రూపుమాపింది. సర్వం కార్పొరేట్లకు దోచిపెట్టే మోడీ జమానాలో పేదరికం తగ్గిందనడం ఈ శతాబ్దంలోనే అతి పెద్ద జోక్!

యూసీసీ ముసాయిదా ఎక్కడ?



రామ్ పునియానీ

భారత లా కమిషన్ ప్రకటన, ప్రధాని నరేంద్ర మోడీ ఏకరూప పౌరస్మృతి (యూనిఫాం సివిల్ కోడ్)పై చేస్తున్న బలమైన వాదనలు, విభజన అంశంపై మరోసారి చర్చను లేవదీశాయి. ఇది భారతీయ జనతా పార్టీ చరిత్రలో, తన ఎన్నికల ప్రణాళికల్లో భాగంగా ఉంటూ వస్తోంది. బీజేపీ తన 1996 ఎన్నికల మ్యానిఫెస్టోలో నారీశక్తి (మహిళా శక్తి) అనే పతాక శీర్షికతో యూనిఫాం సివిల్ కోడ్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించింది. అయినప్పటికీ ఆ పార్టీ, యూసీసీ ముసాయిదాలోని పలు అంశాలకు పరిష్కారాల్ని చూపించలేదు. విడాకులు, భార్య పోషణ, వారసత్వపు హక్కులు, పిల్లల సంరక్షణకు సంబంధించి యూసీసీలో ఎలాంటి చట్టాలున్నాయి? ఇప్పటివరకు చెప్పుకోదగిన ప్రతిస్పందన, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు నుండి, యూసీసీని వ్యతిరేకిస్తున్న గుర్తింపుపొందిన మైనారిటీ సంస్థల నుంచే వచ్చింది. ఈసారి యూసీసీ ప్రతిపాదన ఆదివాసీలు, సిక్కు గ్రూపులు, ఇంకా ఇతర వర్గాల ప్రజల నుండి కూడా వ్యతిరేకతను ఎదుర్కొంటుంది.

"వివాహం, విడాకులు, వారసత్వం, భూ బదలాయింపు లాంటి మా సాంప్రదాయ చట్టాలను యూసీసీ ఉల్లంఘిస్తుందని" కేంద్రీయ సర్న సమితికి చెందిన కార్యకర్త సంతోష్ టిర్కీ అభిప్రాయపడ్డాడు. అదే విధంగా, "మేము లా కమిషన్‌కు ఈమెయిల్స్ పంపించడం ద్వారా నిరసన తెలియజేయడమే కాకుండా నిరసన ప్రదర్శనలను కూడా నిర్వహిస్తాం. మా వ్యూహాల్ని రచించడానికి సమావేశాలు నిర్వహిస్తున్నాం. రాజ్యాంగంలోని ఐదు, ఆరవ షెడ్యూల్‌లోని నిబంధనలను యూసీసీ నీరుగార్చుతుందని" జార్ఖండ్‌కు చెందిన మరొక ఆదివాసీ గ్రూప్ నాయకుడైన రతన్ టిర్కీ అన్నాడు. నేషనల్ డెమోక్రటిక్ అలెయెన్స్‌లోని ఒక భాగస్వామ్య పార్టీ, ఉత్తర ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కొంతమంది బీజేపీ నాయకులు కూడా ఈ యూనిఫాం సివిల్ కోడ్‌ను వ్యతిరేకిస్తున్నట్లు చెపుతున్నారు. 'లా అండ్ జస్టిస్' పార్ల మెంట్ స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు, బీజేపీకి చెందిన సుశీల్ మోడీ, ఉత్తర ఈశాన్య రాష్ట్రాలతో సహా గిరిజన ప్రాంతాల్లో యూనిఫాం సివిల్‌కోడ్ అమలులోని సాధ్యాసాధ్యాలను ప్రశ్నించాడు.శిరోమణి అకాలీ దళ్ నాయకుడు గుర్జీత్ సింగ్ తల్వాండీ, యూసీసీని బర్తరఫ్ చేయకుండా లా కమిషన్‌తో సంప్రదింపులకు చొరవ చూపాలని, అది ఒప్పందంగా కాక, ప్రతిపాదనకున్న వ్యతిరేకతను సంరక్షించాలని, సిక్కు మత అత్యున్నత కమిటీ అయిన శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీని కోరాడు.

వ్యక్తిగత చట్టాలు, కుటుంబ చట్టాలు, పౌర చట్టాలకు, నేర చట్టాలకు చాలా భిన్నంగా ఉంటాయనే విషయాన్ని పునరావృతం చేయడం ఇక్కడ కీలకం. భారతదేశంలో బ్రిటిష్ పాలకులు ప్రతిఒక్క మతానికి చెందిన అధికారులతో సంప్రదింపులు జరిపి, వ్యక్తిగత చట్టాలను రూపొందించారు. ఉదాహరణకు, హిందూ చట్టాలకు సంబంధించిన మితాక్షర, దయాభాగలు కొనసాగుతున్నాయి. అందువల్ల హిందువుల పౌరచట్టాలలో కూడా ఏక రూపత లేదు. భారత ప్రథమ ప్రధాని, జవహర్ లాల్ నెహ్రూ వ్యక్తిగత చట్టాల్లో శాశ్వతమైన లింగ అన్యాయం గురించి కలతచెంది, మొదటి న్యాయశాఖ మంత్రి డా.బి.ఆర్. అంబేద్కర్‌ను హిందువుల కోసం కోడ్‌లో సంస్కరణల్ని ప్రారంభించాలని కోరాడు. సమానత్వాన్ని కోరుకున్న వ్యక్తిగా అంబేద్కర్, హిందూ వ్యక్తిగత చట్టాలన్నీ మహిళలపై పూర్తి ఆధిపత్యాన్ని చెలాయించేవిగా ఉన్నాయని గ్రహించి, ముందుగా ఆయన హిందూ కోడ్ బిల్లు ముసాయిదాను రూపొందించాడు. ముందుగా మెజారిటీ మత సంస్కరణలతో ప్రారంభించి తరువాత మిగిలిన మతాల్లో అలాంటి సంస్కరణలు చేపట్టాలనేది ఆయన ఆలోచన.

దేశ విభజన సమయంలో జరిగిన అల్లర్ల నేపథ్యంలో, మైనారిటీ మతం పైన మెజారిటీ మతం తన అనుకూల విధానాలను విధిస్తుంది అనే విధంగా కనిపించడం భారతదేశానికి ఇష్టం లేదు కాబట్టి, స్వాతంత్ర్యం సిద్ధించిన వెంటనే ముస్లిం వ్యక్తిగత చట్టాల్లో సంస్కరణల్ని చేపట్టలేదు. ఆ తరువాత ముస్లిం చట్టాల క్రోడీకరణను చేపట్టడం జరిగింది. తక్షణ ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించడం ద్వారా ముస్లిం చట్టంలో ఒక సంస్క రణను చేపట్టడం కూడా జరిగింది. (బీజేపీ అనవసరంగా ఈ విధానాన్ని నేరంగా పరిగణించడం ద్వారా, ప్రజల్ని విభజించి, ముస్లింలు చట్టాల్ని ఉల్లంఘించే వారుగా చూపించింది). గుర్తుంచుకోవాల్సిన మరొక ముఖ్యమైన విషయం ఏమంటే, ఇండియన్ ముస్లిమ్స్ ఫర్ సెక్యులర్ డెమోక్రసీ లాంటి కొన్ని ప్రగతిశీల ముస్లిం గ్రూపులు గతంలో కూడా మతపరమైన తటస్థ వ్యక్తిగత చట్టాల కోసం పిలుపునిచ్చాయి. లింగ సమానత్వంపై ఆధారపడి, హిందూ కోడ్ బిల్లులో అంబేద్కర్ రూపొందించిన చట్టాలకు తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. బిల్లును పలుచనచేసి, దశల వారీగా ప్రవేశపెట్టవలసి వచ్చింది. హిందూ జాతీయవాద శక్తుల అండదండలతో సాంప్రదాయ హిందువులు, అంబేద్కర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడంతో మనస్తాపం చెందిన ఆయన కేబినెట్ మంత్రి పదవికి రాజీనామా చేశాడు.

"యూసీసీ జాతీయ ఐక్యతను బలోపేతం చేస్తుందన్న వాదనను ఎవరూ విశ్వసించరు. లింగ న్యాయం జరగాలంటే ఏకరూపతే మార్గం అనే ఆలోచన నుండి చాలా మహిళా గ్రూపులు వైదొలిగాయి కూడా. విడాకులలో, వారసత్వం, పిల్లల సంరక్షణలో లింగ న్యాయం ఎలా ఉంటుందని వారు అడుగుతున్నారు. ఇప్పటికే ఉనికిలో ఉన్న వైవిధ్యమైన కోడ్‌ల నుండి చట్టాల తొలగింపు ఈ లక్ష్యాన్ని సాధిస్తుందా? మరో ప్రశ్న ఏమంటే... యూసీసీని కేవలం అధికార ఆజ్ఞలతో విధించవచ్చా? యూసీసీని విధించడం ద్వారా సాంప్రదాయాలు, ఆచారాలు లేకుండా వదిలించు కోవచ్చా? అది ఒక మిలియన్ రూపాయల ప్రశ్న.

ప్రస్తుత భారత ప్రభుత్వం ద్వారా గాంధీ శాంతి బహుమతిని అందుకున్న గీతాప్రెస్ ప్రచురించిన కళ్యాణ్ మ్యాగజైన్ అసలు ప్రతి, హిందూ కోడ్ బిల్లుపై వ్యతిరేకతను ఈ విధంగా వ్యక్తం చేసింది... "ఇప్పటి వరకు హిందూ ప్రజలంతా ఆయన మాటలను చాలా తీవ్రంగా పరిగణిస్తూ వస్తున్నారు. కానీ ఇప్పుడు, అంబేద్కర్‌చే రూపొందించ బడిన హిందూ కోడ్ బిల్లు, హిందూ ధర్మాన్ని నాశనం చేయడానికి ఉద్దేశించబడిన కుట్రలో చాలా ముఖ్యమైనదని రూఢీ అయ్యింది. ఆయన లాంటి వ్యక్తి న్యాయశాఖ మంత్రిగా కొనసాగితే అది హిందువులకు అవమానం, సిగ్గుచేటు, హిందూ ధర్మం పై ఒక మచ్చ." 70వ దశకం ప్రారంభంలో మధుర అత్యాచార కేసు తరువాత యూసీసీ కోసం డిమాండ్ చాలా బలంగా వ్యక్తీకరించబడినప్పటికీ రానున్న మహిళా ఉద్యమం నుండే యూసీసీ కోసం డిమాండ్ వచ్చింది. మహిళా ఉద్యమంలోని కొన్ని వర్గాలు ఏకరూపత, న్యాయం చేకూర్చుతుంది అని విశ్వసించాయి. కానీ అందుకు విరుద్ధంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రెండవ సర్సంగ్ చాలక్ అయిన ఎం.ఎస్.గోల్వాల్కర్, యూసీసీ భారతదేశం భిన్నత్వాన్ని దెబ్బతీస్తుందని 1972, ఆగస్టు 23వ తేదీన ఆర్గనైజర్ పత్రిక కోసం కే.ఆర్.మల్కానీకిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాడు.

"వాస్తవానికి, గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి బహుమతిని అందించిన బీజేపీకి, మహిళా సాధికారత పట్ల ఎలాంటి ఆసక్తి లేదు కానీ, యూసీసీని వ్యతిరేకిస్తూ ముస్లిం మత ఛాందస సంస్థలు, గొంతులు చించుకుంటాయనే విషయం మాత్రం తెలుసు. ప్రజలను మతాల వారీగా విభజించి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ లబ్ధి పొందేందుకు మాత్రమే ఈ యూసీసీ ఉపయోగపడుతుంది. అన్ని రాజకీయశక్తులు ఐక్యంగా నిలబడి యూసీసీపై తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేయడానికి ముందే యూసీసీ ముసాయిదా కోసం డిమాండ్ చేయాలి.



యూసీసీ జాతీయ ఐక్యతను బలోపేతం చేస్తుందన్న వాదనను ఎవరూ విశ్వసించరు. లింగ న్యాయం జరగాలంటే ఏకరూపతే మార్గం అనే ఆలోచన నుండి చాలా మహిళా గ్రూపులు వైదొలిగాయి కూడా. విడాకులలో, వారసత్వం, పిల్లల సంరక్షణలో లింగ న్యాయం ఎలా ఉంటుందని వారు అడుగుతున్నారు. ఇప్పటికే ఉనికిలో ఉన్న వైవిధ్యమైన కోడ్‌ల నుండి చట్టాల తొలగింపు ఈ లక్ష్యాన్ని సాధిస్తుందా? మరో ప్రశ్న ఏమంటే... యూసీసీని కేవలం అధికార ఆజ్ఞలతో విధించవచ్చా? యూసీసీని విధించడం ద్వారా సాంప్రదాయాలు, ఆచారాలు లేకుండా వదిలించు కోవచ్చా? అది ఒక మిలియన్ రూపాయల ప్రశ్న. సామాజిక మార్పు తేవాలన్నా, లింగ న్యాయం జరగాలన్నా ఎంతో కృషి జరగాలి. విభిన్న వర్గాల, మతాల, సమాజాల అధికార ప్రతినిధులుగా పిలువబడుతున్న వారు మొత్తంగా వారి కమ్యూనిటీల అభిప్రాయాన్ని ముఖ్యంగా మహిళల అభిప్రాయాల్ని ప్రతిబింబించకపోవచ్చు. మనం లింగ న్యాయం కోసం ఉన్నప్పుడు, సమాజంలో నాయకత్వ పాత్రను పోషించిన పురుషుల్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. వివిధ కమ్యూనిటీలకు చెందిన మహిళల్లో ఉంటున్న బలమైన భావాల్ని, వారి ఆగ్రహాన్ని గుర్తించి, చట్ట సవరణలు, చట్టాల మార్పుల్లో వారి ప్రాతినిధ్యాన్ని నిర్ణయాత్మకంగా మార్చాలి.


యూసీసీ ద్వారా మహిళలకు సాధికారత కల్పించవచ్చు అనే బీజేపీ వాదనల్లో డొల్లతనం కనపడుతుంది. గడచిన తన తొమ్మిదేండ్ల పాలనలో భారతీయ జనతా పార్టీ, భిన్న సమాజాలు, వర్గాలు, మతాల్లో సంస్కరణలకు చొరవ చూపి ఉండవచ్చు. విభిన్న వర్గాలకు చెందిన మహిళలు ఆందోళనలు చేస్తున్నప్పటికీ, ఆ ఆందోళనల ప్రభావం చాలా తక్కువగా ఉంది. అన్నిటినీ మించి, మైనారిటీల్లో పెరుగుతున్న అభద్రత, సాంప్రదాయ శక్తులలో పెరుగుతున్న సంఘ సౌభ్రాతృత్వ శక్తి, ఆరోగ్యకరమైన చట్ట సంస్కరణలకు చాలా శక్తివంతంగా అడ్డుకట్టలు వేస్తున్నాయి. మత ప్రాతిపదికన ప్రజలను విభజించడం బీజేపీ లక్ష్యం కాబట్టి, అది యూసీసీ గురించి మాట్లాడు తుంది. నిజాయితీతో కూడిన ప్రయత్నం, రెండు చర్యలకు దారి తీస్తుంది. అన్ని సామాజిక సమూహాలలో సంఘం నాయకత్వంలో సంస్క రణలు, లింగ న్యాయం. యూసీసీకి అంగీకారం తెలపడం లేదా వ్యతిరేకించడం కంటే కూడా యూసీసీ ముసాయిదా కోసం పిలుపు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ముస్లిం సమాజంలోని గొంతుకలు గుడ్డిగా చట్టపరమైన మార్పులను వ్యతిరేకించడం కంటే కూడా ముసాయిదా సమీక్షకు పిలుపు ఇవ్వాలని ప్రతీ ఒక్కరూ ఆశించాలి.

వాస్తవానికి, గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి బహుమతిని అందించిన బీజేపీకి, మహిళా సాధికారత పట్ల ఎలాంటి ఆసక్తి లేదు కానీ, యూసీసీని వ్యతిరేకిస్తూ ముస్లిం మత ఛాందస సంస్థలు, గొంతులు చించుకుంటాయనే విషయం మాత్రం తెలుసు. ప్రజలను మతాల వారీగా విభజించి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ లబ్ధి పొందేం దుకు మాత్రమే ఈ యూసీసీ ఉపయోగపడుతుంది. అన్ని రాజకీయశక్తులు ఐక్యంగా నిలబడి యూసీసీపై తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేయడానికి ముందే యూసీసీ ముసాయిదా కోసం డిమాండ్ చేయాలి.

("న్యూస్ క్లిక్ " సౌజన్యంతో)
అనువాదం:బోడపట్ల రవీందర్, 9848412451

శాంతి ఒక్కటే సరియగు సొల్యూషన్

జీవపరిణామ సిద్ధాంతాన్ని సిలబస్ నుంచి తొలగించుకున్న నేటి తరుణంలో... జీవి పుట్టుక గురించి తెలుసుకోవడానికి, "భూగోళం పుట్టుక కోసం రాలిన సురగోళాలెన్నో/ ఈ మానవ రూపం కోసం జరిగిన పరిణామాలెన్నో" అని మళ్లీ, మళ్లీ పునరుచ్చరణ చేసుకోవాలి. దేశమంతా గాడాంధకారం అలుముకున్న పరిస్థితులపై సమరభేరి మోగించాల్సిన సమయంలో మనం మరోసారి దాశరథిని స్మరించుకుంటున్నాం. "ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడ బానలమెంతో/ ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో..." అంటూ చరిత్రను శోధించి, నిజాలను గుప్పిట పట్టుకుని విశ్వగీతమయ్యాడు. ఒకే ఒక్క వాక్యంలో మానవ పరిణామ వాదాన్నీ కండ్లముందుంచాడు. భూత భవిష్యత్ వర్తమానాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఈ గీతం ఆయన చారిత్రక దృష్టికి ఓ మచ్చుతునక. గతితార్కిక చారి త్రక భౌతికవాద స్ఫూర్తికి ప్రతీక.



నిద్రాణమై ఉన్న తెలంగాణ సమాజాన్ని తన కవితాస్త్రాలతో మేలుకొలిపాడు. కవిత్వంలో పోరాటాన్నీ, పోరాటంలో కవిత్వాన్నీ మమేకం చేసి తెలంగాణ సాయుధ పోరాటాన్ని సుసంపన్నం గావించాడు. నిజాం రాచరికపు క్రూరమైన దోపిడీ, రజాకార్ దౌర్జన్యాలకు ఎదురు తిరిగి మహోజ్వలంగా పోరాడిన తెలంగాణ రైతాంగం ఆయన రచనల్లో సజీవంగా కనిపిస్తారు. కవిగా, కమ్యూనిస్టు కార్యకర్తగా ఏకకాలంలో ద్విముఖ కర్తవ్యాన్ని అద్వితీయంగా నిర్వహించాడాయన. ఈ కర్తవ్య నిర్వహణలో నిర్బంధాలకు సైతం జడవక నికరంగా నిలబడ్డాడు... తెలంగాణ సాయుధపోరాటంతో ఏ మాత్రం సంబంధం లేనీ, పాల్గొనని పార్టీ, చరిత్రంతా తమకే తెలుసంటూ 'రజాకార్ ఫైల్స్' అంటూ సినిమా వస్తున్న సందర్భంలో దాశరథిని మన చదవాల్సిన అవసరం ఉంది.

"ఓ నిజాం పిశాచమా... కానరాదు నిన్నుమించిన రాజు మాకెన్నడేని" అంటూ జైలుగోడలపై ప్రతిధ్వనించాడు. జైలులో ఉండి కూడా ప్రజారాజ్యాలను అన్వేషించాడు. పేదవాడి నెత్తుటి చుక్కల్లో విప్లవాలను వెతికాడు. తెలంగాణ ప్రజల కన్నీళ్లను అగ్గిరవ్వలు చేసి నిజాం రాచరికంపై దండయాత్ర చేసాడు.

**"దగాకోరు బదాచోరు రజాకారు పోషకుడవు
దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది
దిగిపోవోరు, తెగిపోవోరు"** అని నిజాంను గద్దించాడు. భావ ప్రేరిత ప్రసంగాలతో గర్జించాడు. ఊరూరా సాంస్కృతిక చైతన్యాన్ని రగిలించాడు. మన కవుల్లో చాలామందిలో కవిత్వంలో కనిపించిన పోరాటం జీవితంలో కనిపించదు. కానీ దాశరథి కవిత్వంలోనే కాదు జీవితంలోనూ పోరాట యోధుడే... గడీలను ఎదిరించినందుకు... జైలు గోడల మధ్య బంది అయ్యాడు. అయినా వెనుదిరగలేదు. కవిగా కదిలించాడు. నడిపించాడు. **"నాపేరు ప్రజాకోటి - నా ఊరు ప్రజావాటి"** అని సగర్వంగా ప్రకటించడమే గాక **"కంటికి కనిపించిందంతా - కైతగా రాస్తున్నాన"**ని చెప్పాడు. నేటి తరం దాశరథి నుండి గ్రహించాల్సిందిదే. దాశరథి తరువాత కాలంలో సినిమా గీతాలు రాసినా, ఆస్థానకవి కొలువులో చేరినా ఆయన ప్రజా జీవితం నుండి, పోరాటాల నుండి చేసిన రచనలే ఆయనను చరిత్రలో గొప్ప వ్యక్తిగా, శక్తిగా నిలిపాయన్నది వాస్తవం. అలాగని ఆయన సినీ ప్రస్థానాన్ని తక్కువ చేసి చూడలేం. ఆయన కలం ప్రళయాగ్నులే కాదు ప్రణయామృతాలూ వర్షించింది...

**"తీగెలను తెంపి, అగ్నిలో దింపినావు
నా తెలంగాణ కోటి రతనాల వీణ"
అని జన్మభూమిని ఎలుగెత్తిన ఆ కలమే...
"గోదారీ గట్టుందీ గట్టు మీదా చెట్టుందీ"** అని చిలిపిగా ప్రశ్నించింది. అది ప్రణయగీతమైనా, కరుణరస రాగమైనా, యుగళగీతమైనా, మానవత్వం పరిమళించే ఉదాత్త కవిత్వమైనా ఆయన కలం అలవోకగా పొలికించింది.

**"జెండా ఒక్కటి మూడు వన్నెలది దేశంబొక్కటే భారతా
ఖండాసేతు హిమాచలోర్వర కవీట్కాండంబులోనన్ రవీం
ద్రుండొక్కండె కవీంద్రుడూర్జిత జగద్వ్యాలలో శాంతికో
దండోద్యద్విజయుండు గాంధి ఒక్కడే తల్లీ మహాభారతీ"**
అని వర్ణించాడు. భారత దేశం ఒక్కటే, మువ్వన్నెల జెండా ఒక్కటే. మహా కవి రవీంద్రుడు ఒక్కటే. ప్రపంచానికి ఆచరణాత్మకంగా దారి చూపిన గాంధీ ఒక్కడే అని దేశమాతకు ప్రణమిలుతాడు. ప్రతి మార్పును స్వీకరించిన పరిణామం చెందాడు. పరిస్థితుల్ని చీల్చి చెండాడు. అక్షరాల్ని వివిధ ప్రక్రియల్లో విత్తి మట్టిపొరల్లో మొలకెత్తిన విత్తనంలా ఆవాజ్ చేస్తూనే ఉంటాడు. ఎదిగినా ఒదిగిపోయే తత్వం దాశరథిలో కనవడుతుంది.

"అడుగడుగుకూ మడుగులు కట్టిన యెదద నెత్తురులు వడబోయించి పక్కుకట్టిన గాయాన్ని నొక్కి నెత్తురు చుక్కలు పిండి పక్కున నవ్వే ఆ నక్కలు.." ఈ పద్యం మణిపూర్‌లో నెలకొన్న నేటి వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతోంది.

**"రక్తం నదులై పారకపోతే రాదా రెవల్యూషన్!
బుర్రలు బుర్రలు పగులక సమస్యకు లేదా సొల్యూషన్?
హింసాయుద్ధం ఔట్‌డేటెడ్ అని నేనంటాను
శాంతి ఒక్కటే మానవజాతికి సరియగు సొల్యూషన్"** అంటూ ఈ పరిణామాలకు ఆయనే ఒక సొల్యూషన్ కూడా చూపించాడు. కానీ, నిత్యం మతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టి చలి కాచుకునే పాలకులకు అది రుచించదు కదా! ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఏ రచనకైనా జీవితమే ముడిసరుకు. అందుకే రచయితలు ప్రజల మధ్యకు వెళ్లాలి. ప్రజలతో మమేకమవ్వాలి. ప్రజలంటే ఎవరు..? మనం ఎవరికోసం రాస్తున్నామో, ఎవరి విముక్తిని కోరుతున్నామో వారే మన ప్రజలు. ఏ రచనకైనా గ్రంథజ్ఞానం ఎంత ముఖ్యమో ప్రత్యక్ష జీవిత పరిజ్ఞానమూ అంతే ముఖ్యం.

అది కథైనా, కవితైనా మరే రచనైనా జీవితమే ప్రేరణకావాలి. అప్పుడే అందులో జీవం ఉంటుంది. నిజమైన కవినీ, కళాకారుడినీ ప్రజలూ, వారి ఆశలూ, నిరాశలూ, ఉద్య మాలూ, జీవన పోరాటాలూ ఎంతగా కదిలించగలవో, ఎంతటి అపురూప సాహిత్య సృష్టికి దోహదం చేయగలవో అనేదానికి దాశరథి రచనలే ఓ ప్రత్యక్ష ఉదాహరణ.



అనంతోజు మోహన్‌కృష్ణ
8897765417

(నేడు దాశరథి 98వ జయంతి)

కుల దురహంకారాన్ని అంతం చేయలేమా?

ఓవైపు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఆకాశమెత్తుకు ఎదుగుతుంటే మరోవైపు సాటి మనిషిని మనిషిలా చూడలేని నీచపు పరిస్థితి సమాజంలో నెలకొంది. ఇంకా కులవివక్ష ఎక్కడుంది? అనేవాళ్లకు ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఘటనలే సజీవ సాక్ష్యాలు. బతకడానికి వచ్చి మనల్ని బానిసలుగా చేసిన బ్రిటిషోళ్లపై ఏండ్లుగా పోరాడి సాధించుకున్న దేశం 75ఏండ్ల స్వాతంత్ర్యాన్ని కూడా పూర్తి చేసుకుంది. అది దేశ ప్రజల అతిపెద్ద విజయం. ప్రపంచంలోనే అన్ని దేశాలకంటే గొప్పదని చాటుతున్న మన రాజ్యాంగం ఆవిర్భావించి 73ఏండ్ల కు చేరుకుంది. ప్రజల సమైక్య స్ఫూర్తి అభినందనీయం. కానీ అవధులు దాటిన కులవివక్ష, అంటరానితనం, కుల దురహం కారాన్ని నేటికీ అంతం చేయలేక పోవడం శోచనీయం. పల్లె, పట్నం అని తేడాలేకుండా చాపకింద నీరులా వేళ్లూనుకుంటున్న వివక్షను అరికట్టలేమా? అగ్రకుల ఆధిపత్య పెత్తందారీ దుశ్చర్యలను ఐక్యంగా ప్రతిఘటించలేమా? మానవ మనుగడకు ఆటంకంగా నిలుస్తున్న ఈ అస్పృశ్యతను ఎదుర్కోలేమా? ఈ ప్రశ్నలన్నీ పౌరులుగా మనకు మనం వేసుకోవాల్సిన ప్రశ్నలు. కుల దురహంకార దాడులు, హత్యలు, పండుగల్లో వివక్షలు, అంబేద్కర్ విగ్రహ నిర్మాణాల్లో అడ్డగింపులు, బానామతి పేరుతో హింసలు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ మూడునెలల్లోనే వరుస సంఘటనలు. ఇవన్నీ ఎవరు నిరోధించాలి? వీటికి అడ్డుకట్ట వేసేదెవరు? ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం1989, పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1955 ఉన్నా అవి పేరుకు మాత్రమేనని ఈ ఘటనలు రుజువు చేస్తున్నాయి.

"ఆధునికయుగంలోనూ ఆటవిక చర్యలు పెరగడం, దాన్ని కులదురహంకారం ప్రేరేపించడం పట్ల పౌరసమాజం ఇప్పటికైనా స్పందించాలి. అవసరమైన చోట ప్రతిఘటించాలి. 'మనమంతా హిందువులం, గంగా జల బిందువులం, బంధువులం' అని రోజు బాకా ఊదే సంఘ్ పరివారం, మతోన్మాద శక్తులు ఏ ఒక్కనాడు వీటిని ఖండించిన పాపాన పోలేదు. వీరికి మద్దతుగా నిలిచిన దాఖలాలు అంతకన్నా లేవు."

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచ్చన్నపేట గ్రామానికి చెందిన దళిత విశ్రాంత ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య మండలంలోని గోపాల్‌నగర్ సర్వే నెం.174లో అక్కడి సీపీఐ(ఎం) నాయకత్వంలో పేదలు గుడిసెలు వేసుకున్నారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంత మవుతుంటే సమాచార హక్కు కార్యకర్తగా ఆ భూముల పరిరక్షణ కోసం ఆయన నికరంగా నిలబడ్డాడు. ఆ భూములను కబ్జా చేస్తున్న అక్కడి అధికార పార్టీ జెడ్పీటీసీ గిరబోయిన అంజయ్య రూ.10లక్షలు సుఫారీ ఇచ్చి రామకృష్ణయ్యను కిడ్నాప్ చేయించి అతికిరాతకంగా హత్యచేయించి కాలువగట్లల్లో పడేశాడు. చంపిన రోజు సాయంత్రం బాణాసంచా కాల్చి పండుగ చేసుకున్నారు. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి కుడిభుజం లాగా ఉండే జెడ్పీటీసీ చేసిన ఈ హత్య వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందని సర్వత్రా చర్చ జరుగుతున్నది. మరో ఘటనలో వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఇటుకాలపల్లి గ్రామంలో రజక యువకుడు ముదిరాజ్ యువతిని ప్రేమించి వివాహమాడినందుకు ఆ వివాహానికి సహకరించిన తన నలుగురు స్నేహితుల ఇండ్లకు నిప్పుపెట్టి ధ్వంసం చేశారు. మారణాయుధాలతో వెళ్లిన వారిలో గ్రామ అధికార పార్టీకి చెందిన సర్పంచ్ కీలకపాత్ర పోషించాడు. ఇద్దరు బీసీల మధ్య జరిగిన కులాంతర వివాహమైనప్పటికీ ఇంతటి దౌర్జన్యం జరగడం గమనార్హం.



టి. స్కైలాబ్‌బాబు
9177549646

సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చెరువుల పండుగలో దళితులు తమతో కలిసి భోజనం చేయొద్దని గ్రామ పెత్తందారులు హుకుం జారీచేశారు. అక్కడ జరిగిన వివక్షపై దళిత యువకులు ప్రతిఘటించారు. దాంతో కక్ష పెంచుకున్న పెత్తందారులు గ్రామంలోని మంగలి షాపు వ్యక్తిని 'ఎస్సీలకు షాపులో కటింగ్ చేయొద్దు నీకు టైం ఉంటే చెట్టు కింద చేయి' అని సదరు గ్రామపెద్దలు ఆదేశించారు. దీంతో కటింగ్ కోసం సెలూన్ వద్దకు వెళ్లిన దళిత యువకులు నిలదీసి 'కటింగ్ ఎందుకు చెయ్యవు' అని గట్టిగా వాదించారు. దీంతో సెలూన్ వ్యక్తి గ్రామపెద్దలు నిర్ణయించారని బదులిచ్చాడు. దీనిపై గ్రామంలో కేవీపీఎస్ మరికొన్ని సంఘాలు కలిసి దళితులను సమీకరించి దశలవారి పోరాటాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఆర్‌డీఓ, స్థానిక పీఎస్‌లో కూడా ఫిర్యాదు చేశారు. 'చలో తిమ్మాపూర్' కార్యక్రమం నిర్వహించారు. ఫలితంగా 8మందిపై కేసు నమోదు చేసి వారిని రిమాండ్ చేశారు. ఏసీపీ, ఆర్డీవో, సీఐ మరికొంత అధికారులు గ్రామంలోకి వచ్చి అందరిని కూర్చోబెట్టి కేసులు ఉంటాయి, భవిష్యత్‌లో వివక్ష జరగదని హామీ ఇవ్వడంతో ఆందోళనలు విరమించబడ్డాయి.

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కొల్కూరు గ్రామంలో మంత్రాల నెపంతో ఇద్దరు దళిత దంపతులను గ్రామం నడిబొడ్డున చెట్లకు కట్టేసి కొట్టడమే కాకుండా హత్య చేయడానికి ప్రయత్నించారు. మరో ముదిరాజ్ కుటుంబానికి చెందిన వ్యక్తులను కూడా ఇదే విధంగా చేయడానికి ప్రయత్నించగా వారు పరారయ్యారు. పోలీసులకు కంప్లైంట్ చేయవద్దని, ఎవరు ఫొటోలు, వీడియోలు తీయొద్దని గ్రామంలో కొంతమంది పెత్తందారులు హుకుం జారీ చేశారు. ఇది సామాజిక మాధ్యమాలలో ప్రసారం కావడంతో కెవిపిఎస్ నాయకత్వం జోక్యం చేసుకొని గ్రామంలో పర్యటించి ఆ బాధితులను హాస్పిటల్‌లో చేర్పించి జిల్లా అధికారులకు వినతి పత్రాలిచ్చి, గ్రామంలో మండల కేంద్రంలో దశలవారి పోరాటాలు చేయగా 11మందిని అరెస్టు చేశారు. బాధితులు ధైర్యంగా ప్రస్తుతం అదే గ్రామంలో నివసిస్తున్నారు. మేడ్చల్ జిల్లా మేడ్చల్ మండలం రావెల్ కోల్ గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా దళితులు బోనం చెల్లించ డానికి రాగా గ్రామ పెత్తందారులు అడ్డుకున్నారు. 'మీరు అన్ని కులాల తర్వాత ఆఖరిలో బోనం చెల్లించుకోవాలి. మీ బోనమిక్కడ చెల్లించనీయం' అంటూ అడ్డుకున్నారు. దీనిపై గ్రామ దళిత యువకులు తిరుగుబాటు చేశారు. పత్రికల్లో రావడంతో మరుసటిరోజే గ్రామ పెత్తందారులు దళితులకు క్షమాపణలు చెప్పి భవిష్యత్తులో జరగనీయబోమని రాజీ కుదుర్చుకున్నారు.



ఇవన్నీ కూడా ప్రసార, సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వచ్చినవే. ఇంకా వెలుగులోకి రానివి మరెన్నో. ఇంతటి వివక్ష సమాజాన్ని పట్టిపీడిస్తుంటే ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. కేవీపీఎస్ జోక్యం చేసుకుని పోరాడితే తప్ప బాధితులకు సరైన న్యాయం జరగట్లేదు. చట్టం ముందు అందరూ సమానులేనని, రాజ్యాంగం ప్రకారం పౌరులు స్వేచ్ఛగా జీవించాలని హక్కులు చెబుతున్నా అవి కాలరాయబడిపోతున్నాయని చెప్పడానికి పైన జరిగిన ఘటనలే ఉదాహరణలు.

ఆధునికయుగంలోనూ ఆటవిక చర్యలు పెరగడం, దాన్ని కులదురహంకారం ప్రేరేపించడం పట్ల పౌరసమాజం ఇప్పటికైనా స్పందించాలి. అవసరమైన చోట ప్రతిఘటించాలి. 'మనమంతా హిందువులం, గంగా జల బిందువులం, బంధువులం' అని రోజు బాకా ఊదే సంఘ్ పరివారం, మతోన్మాద శక్తులు ఏ ఒక్కనాడు వీటిని ఖండించిన పాపాన పోలేదు. వీరికి మద్దతుగా నిలిచిన దాఖలాలు అంతకన్నా లేవు. పైగా తిమ్మాపూర్‌లో కులవివక్ష, అంటరానితనం జరిగితే ప్రతిఘటించిన దళిత యువకులకు వ్యతిరేకంగా సామాజిక మాధ్య మాలలో ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తప్పుడు వీడియోలు ప్రసారం చేశారు. కాషాయ పరివారమంటే అగ్రకుల పెత్తందారుల పక్షమేనని వారు రుజువు చేశారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. కులవివక్ష జరగకుండా గ్రామాల్లో సామాజిక చైతన్య సభలు నిర్వహించాలి. ప్రజల్లో సమానత్వ భావనను పెంపొందించాలి. మనుషులందరూ సమానమేనని చాటాలి. కులవివక్షను అరికట్టిన రాష్ట్రంగా దేశంలో మన తెలంగాణ ముందు వరుసలో నిలవాలి.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు

(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,440	▲ 310
22 క్యారెట్లు	- 55,400	▲ 300
కిలో వెండి	- 82,000	▲ 400

పీఎం కిసాన్‌కు 2.34 కోట్ల మంది రైతులు దూరం



పార్లమెంటులో ప్రశ్నలు.. సమాధానాలు

కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేవలం నాలుగు నెలల్లోనే 2,34,59,262 మంది రైతులు పీఎం కిసాన్‌కు దూరమయ్యారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. రాజ్యసభ ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 2022-23లో ఏప్రిల్-జులైలో 10,45, 68, 304 మంది రైతులు పీఎం కిసాన్ లబ్దిదా రులు కాగా, ఆ సంఖ్య 2022-23 డిసెంబర్-మార్చి నాటికి 8,11,09,042కు తగ్గిందని తెలిపారు. అంటే నాలుగు నెలల్లో 2,34,59,262 మంది రైతులు పీఎం కిసాన్ పథకానికి నోచుకోలేదని అన్నారు.

మెడికల్ కోర్సులకు కేంద్రీకృత కౌనెల్సింగ్ ప్రాతిపాదన లేదు

మెడికల్ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ఇంద్రీకృత కౌనెల్సింగ్ నిర్వహించే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మనస్సుఖ్ మాండవీయ తెలిపారు. చేవెళ్ల, మహబూబాబాద్ ఎంపిలు డాక్టర్ గడ్డ రంజిత్ రెడ్డి, మాలోత్ కవిత అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వివిధ కోటాల కింద సీట్ల కేటాయించే విధానంలోనూ మార్పు లేదని మంత్రి పేర్కొన్నారు. అండర్ గ్రాడ్యూయేట్స్ కోర్సుల్లో కేవలం 15 శాతం సీట్లు మాత్రమే అఖిల భారత కోటాలో ఉంటాయని కేంద్ర మంత్రి వెల్లడించారు.

ఎయిమ్స్ పేర్లు మార్చే ప్రతిపాదన లేదు.

ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని 20 ఎయిమ్స్ పేర్లు మార్చే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మనసుఖ్ మాండవీయ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు, స్థానిక యోధుల పేర్లను ఎయిమ్స్ కు కేంద్ర ప్రభుత్వం పెట్టాలనుకునేది నిజమేనా అని శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి శుక్రవారం లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

2018 నుంచి ఈ ఏడాది జులై 23 వరకు దేశ వ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో 604 మంది న్యాయమూర్తులను నియమించగా అందులో 158 మంది జనరల్ కేటగిరి, 72 మంది ఓబీసీ, 18 మంది ఎస్సీ, 9 మంది ఎస్టీ, 34 మంది మైనారిటీ వర్గానికి చెందిన వారని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. మరో 13 మంది న్యాయమూర్తులు తమ వివరాలు ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాదానమిచ్చారు. రాజ్యాంగంలోని 124, 127, 224 ఆర్టికల్స్ ప్రకారం హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో ఏ వర్గానికి, కులానికి రిజర్వేషన్లు కల్పించలేదని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 2020 నుంచి ఈ ఏడాది జులై 15 వరకు సుప్రీంకోర్టు 1,07,651 కేసులు విచారణను ముగించిందని మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 96,7500, తెలంగాణ హైకోర్టు 1,12,280 కేసుల విచారణను ముగించిందని కేంద్ర మంత్రి వెల్లడించారు.

2018-2023 వరకు ఆంధ్రప్రదేశ్‌లో 6,502 మంది పిల్లలు అదృశ్యం కాగా, అందులో 4,682 మంది పట్టుబడ్డారని, తెలంగాణలో 1,591 మంది తప్పిపోగా, 1,243 మందిని పట్టుకోగలిగామని కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

తెలంగాణలో 8,540 మెడిసిన్ సీట్లు, ఏపీలో 6,435

మెడిసిన్ సీట్లు తెలంగాణలో 8,540, ఆంధ్రప్రదేశ్‌లో 6,435 ఉన్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవర్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలో 28 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,890 సీట్లు, 28 ప్రయివేట్ కాలేజీల్లో 4,650 సీట్లు ఉన్నాయని, ఏపీలో 18 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,235 సీట్లు, 19 ప్రయివేట్ కాలేజీల్లో 3,200 సీట్లు ఉన్నాయని తెలిపారు.

ఏపీ హైకోర్టు తరలింపు అంశం.. కేంద్రం వద్ద పెండింగ్‌లో లేదు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపు అంశం కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో ఎంపీ తలారి రంగయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపు పూర్తిస్థాయి ప్రతిపాదనేదీ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో లేదని తెలిపారు. హైకోర్టు తరలింపు గురించి రాష్ట్ర ప్రభుత్వం, అక్కడి హైకోర్టు చర్చించి నిర్ణయం తీసుకోవాలని, అందుకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని అన్నారు.

పైకే ఐక్యత...లోపల అనైక్యతే ?



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ సభలో మేమంతా ఐక్యంగా ఉన్నామంటూనే నేతలు మాటల తూటాలను పేల్చేశారు. ఇతర నేతలపై తమ విమర్శనాస్త్రాలను ఎక్కుపెట్టారు. మా ఐక్యతపైకే..లోపల అసమ్మతి రగులుతూనే ఉందనే వాస్తవం వారి మాటల్లోనే బయటపడింది. నేతల మధ్య అనైక్యత బాహాటంగానే ఆ సభలో వ్యక్తమైంది. చివరకు కిషన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ సభ కాస్తా బండి సంజయ్ ఆవేదన సభగా మారింది. మాట్లాడిన ప్రతిఒక్కరూ బండిని పొగుడుతున్న సందర్భాల్లో ఈటల రాజేందర్, రఘునందన్‌రావు ముభావంగా కనిపించారు. 'కొందరు ఢిల్లీకి తప్పుడు ఫిర్యాదులు చేసి కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. ఇకనైనా లేనిపోని ఫిర్యాదులు చేయడం మానండి. కిషన్‌రెడ్డినయినా ప్రశాంతంగా పనిచేయనివ్వండి. ఇప్పుడు కాకుంటే తెలంగాణలో అధికారంలోకి రావడం కష్టం...' అంటూ బండి సంజయ్ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. 'పత్రికల్లో ఉండేవాళ్లు ప్రజల్లో ఉండలేరు. సోషల్‌మీడియా, పత్రికలు, మీడియాల్లో కాదు ప్రజల్లో ఉండండి' అని సూచన చేస్తూ సొంత పార్టీ నేతలపైనే ఆయన విమర్శలు ఎక్కుపెట్టారు. బండి చురకలతో ఈటల రాజేందర్, రఘునందన్‌రావు ముఖాలు వాడిపోయాయి.

సంజయ్ మాటలు ఆ ఇద్దరికీ సూటిగా తగిలేలా ఉన్నాయని కమలం పార్టీలో చర్చ నడుస్తున్నది. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటి కాదని చెప్పేక్రమంలో లిక్కర్ కేసులో తన కుమార్తె కవితను కాపాడేందుకు కేసీఆర్ ఈడీని మ్యానేజ్ చేశారంటూ రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య స్నేహం లేదంటూనే...కమలం పార్టీని రాజగోపాల్‌రెడ్డి మరింత ఇరకాటంలోకి నెట్టారంటూ ఆ పార్టీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు. బండిని చూస్తే ఏడుపొస్తోందనీ, బాత్‌రూమ్‌లోకెళ్లి ఏడ్చేశానంటూ కూడా కోమటిరెడ్డి ఓపెన్ అయిపోయారు. ఎంపీ సోయం బాబూరావు మాట్లాడే క్రమంలో బీజేపీ కార్యకర్తలు కొందరు సంతృప్తిగా ఉన్నారు..మరికొందరు అసంతృప్తిగా ఉన్నారు..అందరూ ఐక్యంగా ఉంటేనే కేసీఆర్‌ను ఓడగొట్టగలుగుతామంటూ బీజేపీలో నెలకొన్న అనైక్యతను ఎత్తిచూపారు.

ఈటల ముందే ఎందుకు?

ఏ పార్టీ సభల్లోనైనా ముందు నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మాట్లాడిన తర్వాత ఆ పార్టీలో అత్యంత ముఖ్యనేతలు మాట్లాడటం ఒక ఆనవాయితీ. ఇప్పుడు బీజేపీలో కిషన్‌రెడ్డి అధ్యక్షులుకాగా, ఎన్నికల ప్రచార కమిటీ చైర్మెన్ హోదాలో ఈటల రాజేందర్ కూడా ప్రాధాన్యతా పదవిలో ఉన్నారు. కానీ, సభలో ఈటల రాజేందర్‌తో ముందే మాట్లాడించారు. ఆ తర్వాత లక్ష్మణ్, మురళీధర్‌రావు, డీకే, బండి, కిషన్‌రెడ్డి తదితర నేతలు మాట్లాడారు. దీంతో పార్టీలో ఈటలకు అంత ప్రాధాన్యతే లేదనే చర్చ బీజేపీ శ్రేణుల్లోనే మొదలైంది. మరోవైపు జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్‌కు సభలో మాట్లాడే అవకాశం దక్కకపోవడమూ విమర్శలకు తావిస్తున్నది.

మధ్యలోనే వెళ్లిపోయిన రాములక్క

విజయశాంతి సభ చివర వరకు ఉండకుండా మధ్యలోనే వెళ్లిపోవడమూ చర్చనీయాంశమైంది. ఆమె వెళ్తున్న క్రమంలో కొందరు నేతలు గుసగుసలాడుకున్నారు. 'తెలంగాణను అత్యంత తీవ్రంగా వ్యతి రేకించిన వాళ్లు స్టేజీపై ఉన్నారు. తెలంగాణవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాలని ప్రయత్నించిన వారూ అక్కడ ఉన్నారు. తెలంగాణ వ్యతిరేకులు అక్కడ ఉండటంతో అసౌకర్యంగా ఫీల్ అయ్యాను. అక్కడ చివరి వరకు ఉండటం అసాధ్యం. అందుకే కార్యక్రమం ముగియకముందే అక్కడ్నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది' అంటూ విజయశాంతి సోషల్ మీడియా సాక్షిగా బాంబు పేల్చేశారు. ఈ వ్యాఖ్యలు కిరణ్‌కుమార్‌రెడ్డిని ఉద్దేశించి చేసినవేనని ప్రచారం జరుగుతున్నది.

కిషన్‌రెడ్డి ఆహ్వానించినా దుమ్మానే

త్వరలో బీజేపీని వీడబోతున్నారంటూ ప్రచారం జరుగుతున్న ఏనుగు రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్, జిట్టా బాలకృష్ణారెడ్డి సభకు డుమ్మాకొట్టారు. తన బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి, సభకు రావాలని కిషన్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించినప్పటికీ నేతలు రాకపోవడం బీజేపీ శ్రేణుల్లో చర్చనీయాంశమవుతున్నది. అంతిమంగా సభలో మాట్లాడినవాళ్లంతా సంజయ్ పట్ల సానుభూతి ప్రకటించడంతో కిషన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ సభ కాస్తా బండి ఆవేదన సభగా మారినట్టు అనిపించింది!

ఇలాంటివి వందలు జరిగాయి

(మొదటిపేజీ తరువాయి)

దారుణ ఘటన మే 4న జరగ్గా, మే 18న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రెండు నెలల తరువాత, గురువారం ఈ కేసులో మొదటి అరెస్టు జరిగింది. అది కూడా ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన తరువాత, 'ఈ ఘటనపై ఇంతకుముందు మీకు సమాచారం లేదా..? ఈ ఘటన మే 4న జరగ్గా మే 18న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు?' అని ఒక వార్తా సంస్థకు చెందిన ప్రతినిధి ఫోన్‌లో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు అసౌకర్యంగా ఫీలవుతూ ముఖ్యమంత్రి 'హింసాకాండాలో అనేకమంది మరణించారు. వెయ్యికిపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి' అని సమాధానం ఇచ్చారు. అయినా ముఖ్యమంత్రిని వార్తా సంస్థ ప్రతినిధి మరింతగా ప్రశ్నించగా.. 'మీరు క్షేత్ర స్థాయిలో నిజమైన పరిస్థితిని తెలుసుకోవాలి. ఇలాంటి కేసులు వందల సంఖ్యలో నమోద య్యాయి. అందుకే ఇంటర్నెట్‌ను నిషేధించాం' అని ముఖ్యమంత్రి అసహనంతో సమాధానం ఇచ్చి, ఫోన్‌ను డిస్‌కనెక్ట్ చేశారు. 'ఇలాంటివి వందలాది కేసులు ఉన్నాయి' అని ముఖ్య మంత్రి సమాధానం ఇచ్చిన వీడియో వైరల్‌గా మారింది. వివిధ రాజకీయ పార్టీలు, జర్న లిస్టులు, ప్రజలు బిరేన్ సింగ్ సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మహిళలను నగ్నంగా ఊరేగించిన నిందితుడి ఇంటికి నిప్పు

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్న భయానక వైరల్ వీడియోలో కనిపించిన నిందితులలో ఒకరి ఇంటికి స్థాని కులు కొందరు నిప్పంటించారు. ముగ్గురు నిందితులు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన తీరు దేశవ్యాప్తంగా తీవ్ర షాక్‌కు గురి చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియో ఒకటి బుధవారం వైరల్‌గా మారింది. దీంతో ఆగ్రహానికి గురైన కొందరు.. నిందితుల్లో ఒకరి ఇంటిని దహనం చేశారు. ప్రధాన నిందితుడు హుయిరేమ్ హెరోదాస్ మెయిటీ ఇంటిని ఒక గుంపు తగలబెట్టిందని కొన్ని వార్త కథనాలను బట్టి తెలుస్తున్నది. నింది తుల ఇంటికి నిప్పుపెట్టిన నిరసనకారులలో ఎక్కువగా మహిళలు ఉన్నారు.

కాంగ్‌పోక్పి జిల్లాలో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన గుంపులో భాగమైన హుయిరేమ్ హెరోదాస్.. వారిలో ఒకరిని(మహిళను) లాగుతున్నట్టు కనిపించాడు. మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలో పోలీసులు ఇప్పటికే నలుగురిని అరెస్టు చేశారు. వైరల్ వీడియో నుంచి తీసిన స్క్రీన్‌షాట్ ఆధారంగా పేచీ అవాంగ్ లైకైకి చెందిన హుయిరేమ్ హెరోదాస్ మెయిటీ అనే ప్రధాన నిందితుడిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. బుధవారం వెలుగులోకి వచ్చిన 26 సెకన్ల వీడియోలో మొదటగా అరెస్టయిన హుయిరేమ్ హెరాదాష్ సింగ్ కాంగ్‌పోక్పి జిల్లాలోని బి. ఫైనోమ్ గ్రామం వద్ద గుంపును ప్రముఖంగా నడిపిస్తున్నట్టు పోలీసులు తెలి పారు. "మణిపూర్ పోలీసులు సోదాలను నిర్వ హిస్తున్నారు. ఇతర నిందితులను వీలైనంత త్వరగా అరెస్టు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు" అని మణిపూర్ రాష్ట్ర పోలీసులు ట్వీట్ చేశారు.ఇటు వైరల్ వీడియోపై సుప్రీం కోర్టు కేసును సుమోటోగా స్వీకరించింది. ఇది "రాజ్యాంగ హక్కులకు అత్యంత తీవ్రమైన ఉల్లంఘన" అని న్యాయస్థానం పేర్కొన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివరణలు కోరింది. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా చూసుకోవాలనీ, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇక పాలనలో తీవ్ర వైఫల్యం చెందారని ఆరోపిస్తూ కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్షాలు మణిపూర్ సీఎం బీరెన్ సింగ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనూ మణిపూర్ అంశంపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

అది ఆకస్మికంగా జరిగింది : మణిపూర్ ఘటనపై అధికారులు

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన ఆకస్మికంగా జరిగిందని అక్కడి అధికారులు తెలిపారు. "దాడి చేసేవారు మే 3 రాత్రి నుంచి దాదాపు 9 గ్రామాల్లో సోదాలు జరుపుతున్నారు. ఆ తర్వాత రోజే ఇది (మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన) జరిగింది. ఇది ఒక ఆకస్మిక చర్య" అని సీనియర్ సెక్యూరిటీ అధికారి ఒకరు తెలిపారు.

మూడు నెలల్లో మూడు సార్లు ఫిర్యాదు చేశాం

మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అధికారుల నుంచి స్పందన లేదని జాతీయ మహిళ కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ తెలిపారు. గత మూడు నెలల్లో మూడు సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, స్పందన కరువైందని పేర్కొన్నారు. మే 4న ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో శుక్రవారం నాడిక్కడ ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రేఖా శర్మ మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి జూన్ 12న జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు వచ్చినా, ఎందుకు పట్టించుకోలేదని విలేకరులు ఆమెను ప్రశ్నించారు. తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, జులై 19న సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ కావడంతో సుమోటోగా స్వీకరించి.. వివరణ ఇవ్వాల్సిందిగా ఆ రాష్ట్ర అధికారులకు ఆదేశాలు జారీ చేశానని రేఖాశర్మ చెప్పారు. మణిపూర్‌లో పలువురు మహిళలపై జరుగు తున్న అకృత్యాల గురించి తనకు ఫిర్యాదులు అందినట్లు ఆమె అంగీకరించారు. 'మణిపూర్‌లో మహిళలపై హింసకు సంబంధించి ఆ రాష్ట్రం నుంచి మాత్రమే కాక ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా లేఖలు వచ్చాయి. మూడు సార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా, ఎలాంటి స్పందన లేదు. తాజా ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో సుమోటోగా స్వీకరించి.. అధికారులను వివరణ కోరాను" అని రేఖా శర్మ తెలిపారు. మే 18,29, జూన్ 19 తేదీల్లో అధికారులకు రాసిన లేఖలు రేఖాశర్మ మీడియాకు చూపించారు.

ఆ దారుణానికి ముందు...హత్యలు.. లూటీలు.. ఇళ్లు, ఆస్తుల దగ్ధం...ఎఫ్ఐఆర్‌లో అభియోగాలు

మణిపూర్‌లో ఒక గూండాల మూక ఇద్దరు గిరిజన మహిళల్ని వివస్త్రలను చేసి ఊరేగించిన దారుణ సంఘటన మే 4న జరగ్గా, దేశవ్యాప్త ఆందోళనల నేపథ్యంలో శుక్రవారం సైకుల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్ నకలును కొన్ని మీడియా సంస్థలు సంపాదించాయి. దీని ప్రకారం గిరిజన మహిళలను నగ్నంగాఊరేగించడానికి ముందు ఈ గూండాల మూక గ్రామాన్ని పూర్తిగా లూటీ చేయడంతోపాటు హత్యలు, ఇళ్లను తగుల బెట్టడం వంటి దుశ్చర్యలకు పాల్పడింది. నగ్నంగా ఊరేగించబడిన మహిళను రక్షించడానికి ఆమె సోదరుడు ప్రయత్నించగా, అతన్ని దారుణంగా హత్య చేశారు. ఎఫ్ఐఆర్ ప్రకారం కాంగ్పోక్పి జిల్లాలోని సైకుల్ పోలీస్ స్టేషన్‌కు దక్షిణంగా 68 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలోకి సుమారు 900 నుంచి వెయ్యి మంది తో ఉన్న సాయుధ గూండాల మూక మే 4న సుమారు మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రవేశించింది. వీరిలో చేతిలో ఎకె రైఫిల్స్, ఎస్ఎల్ఆర్, ఐఎన్ఎస్ఎఎస్, 303 రైఫిల్స్ వంటి అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయి. గూండాల మూక ప్రవేశించడంతోనే గ్రామంపై విరుచుకుపడింది. విధ్వంసం సృష్టించింది. అన్ని చరాస్థులను లూటీ చేసి ఒకచోట నేల మీద వేసి తగలబెట్టింది. ఇళ్లలోని నగదు, ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆహార ధాన్యాలు ఇలా అన్ని వస్తువులను తగులబెట్టారు. ఈ దాడితో భయపడి ఐదుగురు గ్రామస్థులు సమీప అడవిలోకి పారిపోయారు. వారిని పోలీసులు రక్షిస్తే వారి వద్ద నుంచి కూడా ఆ గ్రామస్తుల్ని ఈ మూక ఎత్తుకెళ్లింది. ఈ ఘటనకు సంబం ధించిన వీడియో ఆధారంగా ఇప్పటివరకూ నలుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నలుగురిలో ఒకరి ఇంటిపై స్థానిక ప్రజలు ఇటీవల దాడి చేసి, నిప్పు అంటించారు. తౌబల్ జిల్లాలోని పేచీ అవాంగ్‌లో ఉన్న నిందితుడి ఇంటిపై ఈ దాడి జరిగినట్లు పోలీసులు చెప్పారు.

మణిపూర్‌లో మరో షాకింగ్..వ్యక్తి తలనరికి వేలాడదీసిన వీడియో వైరల్

ఇప్పటికే హింసాత్మక ఘటనలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో మరో షాకింగ్ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఓ వ్యక్తి తలనరికి కంచెకు వేలాడదీసిన వీడియో క్లిప్ తాజాగా వైరల్‌గా మారింది. మణిపూర్‌లో ఒక గుంపు ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియో వైరల్ అయి.. దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన విషయం తెలిసిందే. దానిని మరువక ముందే ఈ దారుణ సంఘటన జులై 2న బిష్ణుపూర్ జిల్లాలో చోటుచేసుకంది. అర్ధరాత్రి వేళ జరిగిన ఘర్షణలో కుకీ వర్గానికి చెందిన నలుగురిని మైతీ వర్గానికి చెందిన వారు దారుణంగా చంపారు. డేవిడ్ థీక్ అనే వ్యక్తి తల నరికి.. ఆ ప్రాంతంలో వెదురు కర్రలతో చేసిన కంచెకు అతడి తలను వేలాడదీశారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

మణిపూర్‌లో శుక్రవారం మే 4న చిత్రించిన వీడియోలో మహిళ లను నగ్నంగా ఊరేగించి, పురుషుల గుంపు పట్టుకున్నట్లు చూపడంతో కొత్త ఉద్రిక్తత నెలకొంది. మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియో క్లిప్ ఈ నెల 19న సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

భారత్‌లో 46 శాతం నదులు కలుషితం

లోక్‌సభలో సీపీసీబీ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలోని నదుల పరిశుభ్రత, పరిరక్షణపై కేంద్రంలోని మోడీ సర్కారు నిర్లక్ష్యం వహిస్తున్నది. ఫలితం గా భారత్‌లో నదులు కలుషితమవు తున్నాయి. దేశంలో దాదాపు 46 శాతం నదులు కాలుష్య కోరల్లో చిక్కుకున్నా యి. లోక్‌సభలో ప్రవేశపెట్టబడిన కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) విశ్లేషణలో ఈ విషయం వెల్లడైంది. ఈ నివేదిక ప్రకారం.. సీపీసీబీ 2022లో దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు మరియు ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంత(యూటీ)లలోని 279 నదులపై 311 కలుషితమైన నదీ విస్తరణలను (పీఆర్ఎస్) గుర్తించింది. కాలుష్యం..



సేంద్రీయ కాలుష్య సూచిక లపై (అంటే బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ)) నిర్ణయించబడింది. దేశవ్యాప్తంగా మహారాష్ట్రలో అత్యధికం గా 55 పీఆర్ఎస్ ఉన్నది. బీహార్‌లో 18గా ఉన్నది.

ఉద్యోగ భద్రత-కనీస వేతనం లేవు

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చలో ఎస్పీడీ కార్యాలయ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాది మంది ఉద్యోగులు జోరువానలోనూ పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయాన్ని దిగ్బంధించారు.

కనీస వేతనం ఇచ్చేదాకా కదిలేది లేదంటూ ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అక్కడే బైఠాయించారు. అనంతరం 29 సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షులు కె జంగయ్య, ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గాభవాని, రాష్ట్ర కార్యదర్శి వి శాంతికుమారి కలిసి వినతి పత్రం సమర్పించారు. అయితే వీలైనంత త్వరగా చర్చలకు ఆహ్వానిస్తామంటూ అధికారులు సానుకూలంగా స్పందించారు. రెండు వారాల్లో సమస్యలను పరిష్కరించక పోతే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు.

న్యాయమైన సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : కె జంగయ్య, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలి. ఆరోగ్యకార్డులను ఇచ్చి నగదు రహిత వైద్యం అందించాలి. అర్ధాంతరంగా మరణించిన కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. పార్ట్‌టైం కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, ఒకేషనల్ ట్రైనర్లకు పూర్తికాలం పనిచేస్తున్నందున సీఆర్టీలుగా మార్చి బేసిక్ పే ఇవ్వాలి.

ఉద్యోగ భద్రత కల్పించాలి



కేజీబీవీ, యూఆర్ ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనమివ్వాలి. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలి. శాసనమండలిలో ఈ అంశాలను పలుసార్లు ప్రస్తావించినా పరిష్కరించకపోవడం ఆందోళనకరం. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలి.

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మంత్రులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదు : చావ రవి, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రులు, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా, ఆందోళనలు చేసినా ఫలితం లేదు. అందుకే డీఎస్ఈని ముట్టడించాల్సిన పరిస్థితి అనివార్యమైంది. మోడల్ స్కూల్ హాస్టల్ నిర్వహణ అదనపు బాధ్యతల నుంచి ఎస్ఓలను తప్పించాలి. విద్యార్థుల పర్ క్యాపిటాను గురుకులాలతో సమానంగా పెంచాలి. బాలికలకు కాస్మోటిక్ చార్జీలు, శానిటరీ కిట్లను అందించాలి. జూనియర్ కళాశాలలకు అదనపు సిబ్బందిని, అదనపు నిధులను కేటాయించాలి. యూఆర్ఎస్‌లలో తొమ్మిది, పది తరగతులను ప్రారంభించాలి. వాటికి స్వంత భవనాలు నిర్మించాలి. యూఆర్ఎస్‌లలోని మహిళా ఉద్యోగులకూ 180 రోజుల ప్రసూతి సెలవులివ్వాలి. కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగుల బదిలీలు నిర్వహించాలి.

నేడు మంత్రి ఎర్రబెల్లితో చర్చలు

- జీపీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ వెల్లడి
- మంత్రి ఎర్రబెల్లికి వినతిపత్రం అందజేసిన జూలకంటి, పాలడుగు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జీపీ కార్మికుల సమ్మె నేపథ్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల సంఘాల జేఏసీతో శనివారం ఉదయం చర్చలు జరిపేందుకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అంగీకరించారు. శుక్రవారం ఈ మేరకు జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శి యజ్ఞనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి దయాకర్‌రావు, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో చర్చల్లో పాల్గొనేందుకు జేఏసీ రాష్ట్ర నాయకత్వం అందు బాటులో ఉండాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వీలైనంత త్వరంగా పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నాడు హైదరా బాద్‌లో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గ్రామపంచా యతీ ఉద్యోగులు, కార్మిక సంఘాల జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్ వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామపంచాయతీ కార్మికుల పర్మినెంట్, ప్రభుత్వమే వేతనాలు చెల్లించేలా బడ్జెట్ కేటాయింపులు, కనీసవేతనం రూ.19 వేల చెల్లింపు, కారోబార్లు, బిల్ కలెక్టర్లను గ్రామ సహాయ కార్యదర్శులుగా నియమిం చటం, మల్టీపర్పస్ విధానం రద్దు, జీవో నెంబర్ 51 సవరణ, తదితర అంశాలను మంత్రి ఎర్రబెల్లి దృష్టికి వారు తీసుకెళ్లారు. కార్మికుల విషయంలో ప్రభుత్వం మొండి వైఖరిని ప్రదర్శించొద్దనీ, వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని వారు మంత్రిని కోరారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్మికుల జేఏసీ నేతలను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆహ్వానించారు.

ఘనంగా మల్లిఖార్జున ఖర్గే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే జన్మదిన వేడుకలు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల నుండి వచ్చిన వ్యక్తి మల్లిఖార్జున ఖర్గే అని కొనియాడారు. ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, బండారి మనోహర్, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గోల్డెన్ గేట్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గోల్డెన్ గేట్ యూనివర్సిటీలో నేడు స్పాట్ అడ్మిషన్లను స్వీకరించనున్నారు. అమెరికాలోని ప్రఖ్యాత గోల్డెన్ గేట్ యూనివర్సిటీ.. హైదరాబాద్‌లో అర్హులైన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు అందించేందుకు ఇక్కడ పేరుపొందిన యూనివర్సిటీ హబ్‌తో తన భాగస్వామ్యాన్ని ప్రకటించింది. దీనివల్ల మేనేజ్‌మెంట్, ఐటీ, ఇంజినీరింగ్ విభాగాల్లోని పలు కోర్సుల్లో విద్యార్థులకు అపారమైన అవకాశాలు లభిస్తాయి. స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇక్కడ యూనివర్సిటీ ప్రతినిధులతో మాట్లాడి, దరఖాస్తులు ఖరారు చేసుకుని, ఐ-20 డాక్యుమెంట్లను కూడా సకాలంలో పొందే అవకాశం ఉంటుంది. ఆసక్తి గల విద్యార్థులు 6387149133 నెంబర్‌కు ఫోన్ లేదా వాట్సప్ ద్వారా సంప్రదించవచ్చు అని యూనివర్సిటీ హబ్ ప్రతినిధులు తెలిపారు.

వర్షంలోనూ కార్మికుల సమ్మె..



నవతెలంగాణ-హయత్‌నగర్

వర్షంలోనూ గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ఈ మేరకు శుక్రవారం హయత్‌నగర్ మండల కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న సమ్మెకు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ మద్దతు తెలుపుతూ మాట్లాడారు. నిత్యం గ్రామాలను శుభ్రం చేస్తున్న కార్మికుల జీతాలు పెంచకుండా.. కేవలం వారిని సన్మానించి, పబ్బం గడుపుకోవాలని తెలంగాణ ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. కొన్ని రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ మద్దతు ఇస్తుందన్నారు. ఈ సమ్మెను ఆపడం కోసం అధికారులు, సర్పంచులు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులకు ప్రమాదం జరిగితే మాదే బాధ్యత అని కాగితంపై రాసి ఇచ్చే దమ్ము.. సర్పంచులు, అధికారులకు ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రయత్నాలు మానుకోకపోతే.. సీఐటీయూ సంఘం ఐక్యం చేసుకుటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గ్యార పాండు, కనకయ్య, ప్రభాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గుండె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి నిల్వలకు పరిష్కారం

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి





నవతెలంగాణ-వనస్థలిపురం

మార్నింగ్ వాక్‌లో వరద నీటి నిల్వలను పరిష్కరించినట్టు హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి తెలిపారు. మార్నింగ్ వాక్ లో భాగంగా డివిజన్‌లోని జగదాంబ కాలనీ, భాగ్యలత బీడీఎల్ కాలనీలలో శుక్రవారం కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలకు కాలనీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి వర్షపు నీటి నిల్వలు లేకుండా నేరుగా వెళ్లే విధంగా ఒక మార్గాన్ని ఏర్పాటు చేయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్, ఏఈ నరేంద్ర తేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

హయత్ నగర్ డివిజన్‌లోని శారదా నగర్‌లో శుక్రవారం కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి పర్యటించారు. భారీ వర్షాలతో రోడ్లపై నీరు నిలిచి కాలనీవాసులు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని సమాచారం అందడంతో వెంటనే కార్పొరేటర్...మాన్‌సూన్ టీమ్, జేసీబీ యంత్రాంగంతో అక్కడికి చేరుకున్నారు. దిగువ ఉన్న ప్రాంతానికి నీరు వెళ్లే విధంగా పక్కనే అడ్డుగా ఉన్న ప్రహరీ గోడకు కన్నం పెట్టించి..నీరు వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అవసరమైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రాకూడదని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల కాలనీ వాసులు తాగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాండల శ్రీధర్, బద్దం రవి, నక్క శ్రీకాంత్, కే ఎల్ నరసింహారావు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న చిలుక ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ- చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన అహ్మద్ షారిఫ్ తల్లీదండ్రులు లేని నిరుపేద యువకుడు. అనుకోకుండా ఇంటి పై అంతస్తు నుండి ప్రమాదవశాత్తు జారీ కింద పడిపోయాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి.. మానవతా దృక్పథంతో ఆలోచించి వెంటనే రుచిత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తోడుపునూరి సతీష్, ప్రాణహిత ఆసుపత్రి అధినేత డా. రాహుల్ రెడ్డి, అనిల్ సంయుక్త ఆధ్వర్యంలో షారిఫ్‌కు ఆపరేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ షారిఫ్ జారిపడి 5 రోజులు గడిచిందని, స్థానికుల ద్వారా అతని వివరాలు తెలుకున్నట్లు తెలిపారు. అతనికి ఎవరూ లేకపోవడంతో సహాయ, సహకారాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్బర్, కళ్యాణ్, విజయ్, అనుదీప్, విప్లవ్, నగేష్, అనీల్, ఆసుపత్రి మేనేజర్ అరుణ్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడండి : సీపీఐ



నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్ నగర్ మండలంలోని సర్వే నెంబర్ 191లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుండి కాపాడాలని హయత్ నగర్ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. డివిజన్ పరిధిలోని హన్మఫల్ హయత్ నగర్‌లోని సర్వే నెంబర్ 191లో 1.09గుంటల భూమి స్థలాన్ని శుక్రవారం సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రంగారెడ్డి కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ ఆ భూమి కబ్జాకు గురవుతుందని ఇప్పటికే 10సార్లు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన రెవెన్యూ అధికారులే కబ్జా దారులకు మద్దతుగా ఉన్నట్లు తెలుస్తోందని ఆరోపించారు. ఈ భూమికి రక్షణ కవచం ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సక్కు నాయక్, సుభద్ర, సుజాత, శోభన్, శేఖర్ లు పాల్గొన్నారు.

'పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత'



నవతెలంగాణ- చైతన్యపురి

పరిసరాల పరిశుభ్రత అందరీ బాధ్యత అని ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, విజయపురి కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పున్న గణేష్ నేత, కార్యవర్గ సభ్యుడు గట్ల రవీంద్ర అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విజయపురి కాలనీలో శుక్రవారం సంక్షేమ సంఘం ప్రతినిధులు చెత్తాచెదారాన్ని తొలగించి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో కాలనీ ముంపునకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. కాలనీలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి ముందస్తుగా చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకుడు బండి మధుసూదన్ రావు, పి.ఆనంద్ కుమార్, సంపత్, శ్రీకాంత్ రెడ్డి, అనుదీప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి'



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో ఉన్న ఎక్కంకుంట సుందరీకరణ పనులు, గుర్రంగూడ నుండి అల్మాస్ గూడ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని 6,7 డివిజన్ల కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డిలు కోరారు. ఈ విషయమై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ఎక్కంకుంట సుందరీకరణ కోసం రూ.50లక్షలు, గుర్రంగూడ నుండి అల్మాస్ గూడ వరకు రూ.3కోట్ల నిధులు మంజూరైనా సంబంధిత కాంట్రాక్టర్లు నేటికీ పనులు ప్రారంభించలేదన్నారు. రోడ్డు నిర్మాణ పనులను ఓ కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేసినట్లు తెలిపారు.దీంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ఆ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు.

నీట మునిగిన కాలనీలో పర్యటన



నవతెలంగాణ -ఎల్బీనగర్

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లింగోజిగూడ డివిజన్ పరిధిలోని అల్తాఫ్ నగర్ కాలనీ కొంత మేర నీట మునిగింది. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచనల మేరకు మాజీ కార్పొ రేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి, ఇతర నాయకులు రాత్రి నుంచి అక్కడ ఉన్న బస్తీ ప్రజలకు సహాయ సహకారాలు అందించారు. ఈ మేరకు లింగోజిగూడలో శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పర్యటించి మాట్లాడారు. ఇంట్లోకి పూర్తిగా నీరు వచ్చిన వారిని పక్కనే ఉన్న కమ్యూనిటీ హాల్‌కు తరలించినట్లు తెలిపారు. తర్వాత భోజన సదుపాయాలను కల్పించినట్లు చెప్పారు. అలాగే వరదనీరు పోవడానికి పక్కనే ఉన్న స్కూల్ గోడను కొంతమేర తొలగించి..నీరు సులువుగా వెళ్లేటట్లు ఏర్పాటు కూడా చేశారన్నారు. వర్షాకాల దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దాదాపు 90% పనులు పూర్తైనట్లు వివరించారు. ఇప్పుడు జరిగిన ఇబ్బందులకు క్షమించాలని స్థానికులను కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు కోటేశ్వరరావు, కనకయ్య, మాజీ అధ్యక్షులు తిలక్ రావు, రాకేశ్ ఠాగూర్, మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బొంబాయి, శ్రీధర్, నాయకులు, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'పాలకుల నిర్లక్ష్యం వల్లే ఇండ్లలోకి నీరు'



నవతెలంగాణ - ఎల్బీనగర్

పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వలనే ఇండ్లలోకి వర్షపు నీరు చేరుతుందని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాం రెడ్డి విమర్శించారు. గడ్డి అన్నారం డివిజన్ పరిధిలోని వీవీ నగర్ కాలనీలో శుక్రవారం మల్ రెడ్డి రాం రెడ్డి పర్యటించి.. నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇండ్లలోకి నీరుచేరి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని మండిపడ్డారు. సరూర్ నగర్ చెరువు కింది భాగంలో ఉన్న లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఈ వర్షాల వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచకపోవడం వలన కొన్ని కాలనీల రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను డల్లాస్ చేస్తాం, ఓల్డ్ సిటీని ఇస్తాంబుల్ చేస్తామని గతంలో గొప్పగా సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. చిన్న పాటి వర్షాలకే హైదరాబాద్ అతలాకుతలం అవుతోంది, విశ్వనగరమో ఏమో కాని బీఆర్ఎస్ పాలనలో ఇంకా సమస్యలు పెరిగిపోయాయని విమర్శించారు. ఈ పర్యటనలో వెంకటేష్ యాదవ్, సురేందర్ రెడ్డి, వేణు యాదవ్, కిషోర్ గౌడ్, జైపాల్ రెడ్డి, శ్రీను, గోవర్ధన్, గులాం మొహమ్మద్, శరత్ రెడ్డి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

సభ్యసమాజం తలదించుకునేలా బీజేపీ పాలన..



నవతెలంగాణ- సంతోష్ నగర్

సభ్యసమాజం తలదించుకునేలా బీజేపీ ప్రభుత్వ పాలన ఉందని సీఐటీయూ, డివైఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. మణిపూర్‌లో ఓ మహిళను నగ్నంగా ఊరేగించడాన్ని వ్యతిరేకిస్తూ.. సీఐటీయూ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జంగంమ్మెట్ డివిజన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు మీనా, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్‌లు మాట్లాడారు. మణిపూర్‌లో మూడు నెలల నుండి అనేక ఘటనలు జరుగుతున్నా..బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అంతేకాదు ఈ మణిపూర్ ఘటన పోలీసుల ఎదురుగానే జరిగింది..ఇది జరిగి కూడా రెండు నెలల పైనే అవుతుందన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కిషన్, డివైఎఫ్ఐ నాయకులు శ్రీను, రాజేష్, అరుణ్, మురారి పాల్గొన్నారు.

ధూల్ పేట్ :



గత మూడు నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండ, అమానుషాలపై జమాఅతె ఇస్లామీ హింద్(జే.ఐ.హెచ్) తెలంగాణ చీఫ్ డాక్టర్ ఖాలిద్ ముబషిర్ జాఫర్ శుక్రవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాతబస్తీ ధారుల్ షిఫాలో ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండు చేశారు.

'టీడీపీకి పుర్వవైభవం తీసుకొస్తాం..'

నవతెలంగాణ - మీర్ పేట్

మహేశ్వరం నియోజకవర్గంలో టీడీపీకి పూర్వవైభవం తీసుకొస్తామని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 36వ డివిజన్ కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్ అన్నారు. బాలాపూర్ చౌరస్తాలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేశ్వరంలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు త్వరలో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ అనే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. బాలాపూర్ చౌరస్తా ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని 23న తెలంగాణ పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి కంభంపాటి రామ్మోహన్‌రావులు ప్రారంభిస్తారని చెప్పారు. భౌగోళిక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగింది తప్ప.. సామాజిక, బహుజన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాలేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి.. దొరల గడీలను బద్దలు కొట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు కోమరేష్, నాయకులు ముత్యాల వాసు సాగర్, శ్రీశైలం, మల్లేష్, అసిఫ్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తులు అరెస్ట్



నవతెలంగాణ -వనస్థలిపురం

నేరాలకు పాల్పడుతూ తమ ప్రవర్తనను మార్చుకోకుండా.. అమరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకు న్నారు. ఈ ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పూర్తి వివరాలు..వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి నేతృత్వంలో డిటెక్టివ్ సీఐ వెంకటయ్య క్రైమ్ బృందం ద్విచక్ర వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా.. అనుమానంతో ఆ ఇద్దరి నిందితుల్ని అదుపులోకి తీసుకుని విచారించారు. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నాగర్ కర్నూల్ మద్దినేనిపల్లి గ్రామానికి చెందిన ఏ సత్యనారాయణ వృత్తిరీత్యా డ్రైవర్, అబ్దుల్లాపూర్మెట్ మండలం తుర్కయాంజల్ గ్రామానికి చెందిన కే అవినాష్ వృత్తి రీత్యా వంటలు చేసేవాడు. వనస్థలిపురం క్రైమ్ బ్రాంచ్ బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో ద్విచక్ర వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా..హీరో హెూండా స్ప్లెండర్ పై సంచరిస్తున్న నిందితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి హీరో హెూండా స్ప్లెండర్ ప్లస్, రెండు బజాజ్ పల్సర్లు,హెూండా ప్యాషన్ ప్రో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనాల విలువ సుమారు మూడు లక్షలు ఉంటుందని అంచనా వేశారు. పాత నేరస్తులైన వీరు అమరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 లో చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలియజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, వారిని రిమాండ్ కు తరలిస్తున్నట్లు సీఐ జలంధర్ రెడ్డి తెలిపారు.

జలాశయాలల్లో వరద నీరు



హిమాయత్ సాగర్ రిజర్వాయర్ వివరాలు:
- పూర్తి స్థాయి నీటి మట్టం : 1763.50 అడుగులు
- ప్రస్తుత నీటి స్థాయి : 1762.75 అడుగులు
- రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం : 2.970 టీఎంసీలు
- ప్రస్తుత సామర్థ్యం : 2.650 టీఎంసీలు
- ఇన్ ఫ్లో : 1200 క్యూసెక్కులు
- అవుట్ ఫ్లో : 700 క్యూసెక్కులు
- మొత్తం గేట్ల సంఖ్య : 17
- ఎత్తిన గేట్ల సంఖ్య : 02

- హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ రెండు గేట్లు అడుగు మేర ఎత్తివేత
- మూసీ నదిలోకి 700 క్యూసెక్కుల వరద నీరు విడుదల

నవతెలంగాణ-సిటీబ్యూరో

గత నాలుగు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జంట జలాశయాలు హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్‌కు వరద నీరు వస్తోంది. అప్రమత్తమైన జలమండలి అధికారులు హిమాయత్ సాగర్ రిజర్వాయర్ రెండు గేట్లను ఒక ఫీటు మేరకు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం హిమాయత్ సాగర్‌కు 1200 క్యూసెక్కుల ఇన్ ఫ్లో రాగా, 700 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉంది. మరోవైపు ఉస్మాన్ సాగర్ (గండిపేట్) రిజర్వాయర్‌కు 700 క్యూసెక్కుల వదర నీరు వస్తోంది. రిజర్వాయర్ మొత్తం సామర్థ్యం 3.900 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.760 టీఎంసీలు. పూర్తి స్థాయి నీటి మట్టం 1790.00 అడుగులు కాగా ప్రస్తుతం 1785.40 అడుగులు ఉంది.

అప్రమత్తంగా ఉండాలి: ఎండీ

ఎడతెరిపి లేకుండా కురుస్తున వర్షాలతో జలమండలి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎండీ దాన కిశోర్ ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు జలాశయాల గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జలమండలి అధికారులతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిపాలనా యంత్రాంగాలు, జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

'అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి'



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని బీజేపీ కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి మంత్రి నివాసంలో ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, ఇంద్రసేనలు మాట్లాడారు. గత నెలలో 19న మహేశ్వరం నియోజకవర్గం తుమ్మలూరు వద్ద జరిగిన దశాబ్ది ఉత్సవాలలో భాగంగా హరిత హారం కార్యక్రమం అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి రూ.50కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ నిధుల నుండి బీజేపీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ల అభివృద్ధి, ప్రజల మౌలిక సదుపాయాల కల్పన కోసం.. ప్రత్యేక నిధులు లేక హెచ్ ఎండీఏ నిధులను మంజూరు చేయించాలని కోరారు. ఆ నిధులతో పలు కాలనీలలో సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, వరుద నీటి కాల్వల నిర్మాణ పనులు చేపట్టడానికి సహకరించాలన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారు అనిత ప్రభాకర్, గౌర రమాదేవి శ్రీనివాస్, అమిత శ్రీశైలం చారి, రామిడి మాధురి వీరకర్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ కార్పొరేషన్ 9,10వ డివిజన్‌లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని 10వ డివిజన్ కార్పొరేటర్ ముద్దా పవన్ కుమార్, 9వ బీఆర్ఎస్ నాయకులు రామిడి నర్సిరెడి కోరారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9,10 డివిజన్ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం మంత్రి సానుకూలంగా స్పందించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

నాగోల్‌లో జీహెచ్‌ఎంసీ కమిషనర్ పర్యటన



నవతెలంగాణ -ఎల్బీనగర్

ఎల్బీనగర్ జోనల్ పరిధిలోని హయాత్ నగర్ సర్కిల్ నాగోల్‌లో శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ పర్యటించారు. తర్వాత ఉప్పల్, చిల్కానగర్ వార్డ్ పరిసరాలలో జీవీపీలోని చెత్త తరలింపు విధానాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీ వాసులతో, శానిటరీ జవాన్లతో, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లతో పరస్పర చర్చలు జరిపారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో తడి, పొడి చెత్త వేరు చేయు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ వర్కర్స్ యొక్క పరిచయం, పుస్తకాలను చూశారు. శ్రీనగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న స్ట్రాం వాటర్ డ్రైన్ను సందర్శించారు. అనంతరం వార్డు కార్యాలయాన్ని సందర్శించి..వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ ఎస్. పంకజ, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రంజిత్, అరుణ కుమారి, డిప్యూటీ కమిషనర్లు, ఎల్బీనగర్, హయత్ నగర్ సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ అధికారులు, డీఈఈఎస్‌డబ్ల్యూఎంలు, వెటర్నరీ ఆఫీసర్లు డాక్టర్ జేవ్యనాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, అధికారులు పాల్గొన్నారు.

'బార్‌కు అనుమతులు ఇవ్వొద్దు'



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ నంది హిల్స్ కాలనీలో బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతి ఇవ్వొద్దని టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి రామిడి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు శుక్రవారం ఎక్సైజ్ సూపరిటెండెంట్ రవీందర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందీహిల్స్ రోడ్ నంబర్ 10 ప్రధాన రహదారిపై బార్ అండ్ రెస్టారెంట్ పెడుతున్నారని అన్నారు. ప్రజల నివాస ప్రాంతాల్లో బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతి ఇస్తే..ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ఎక్సైజ్ సూపరిటెండెంట్ రవీందర్ రావు స్పందిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ బార్ అండ్ రెస్టారెంట్ కు అనుమతులు ఇవ్వబోమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ హనుమంతరావు, హయత్ నగర్ ఎక్సైజ్ సీఐ లక్ష్మణ గౌడ్, న్యూ నంది హిల్స్ అధ్యక్షుడు చల్లా సురేందర్ రెడ్డి, కార్యదర్శి కృష్ణా రెడ్డి, గౌరవ సలహాదారులు మట్ట సత్యనారాయణ గౌడ్, ఏల్ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో యువకుడు మృతి



నవతెలంగాణ- మేడ్చల్

విద్యుత్ షాక్ తో యువకుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మేడ్చల్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ 4వ వార్డులోని స్మశాన వాటిక వద్ద శుక్రవారం సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో ఓ ఫైబర్ నెట్ వర్క్ వారు వారి పనులు నిర్వహిస్తున్న క్రమంలో కరెంట్ పోల్ పక్కనుండే వెళ్తున్న జార్ఖాండ్ కు చెందిన దిలీప్ పింగువ(22) అనే యువకుడు విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా పోలీసులు కేసు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పాస్టర్ జాన్ వెస్లీ మృతదేహానికి బొంతు రామ్మోహన్ నివాళ్లు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్, పాస్టర్ జాన్ వెస్లీ అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు, చర్చి కమిటీ సభ్యులు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు ఉన్నారు.

అర్హులు ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా...

- ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై నగర వాసులకు అవగాహన
- పలు ప్రాంతాలల్లో 'స్టాటిస్టిక్స్ ఈ.వీ.ఎం. డెమో స్టేషన్' సెంటర్లు



నవతెలంగాణ -సిటీబ్యూరో

రాష్ట్రంలో కొద్ది నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారులు అందుకు తగ్గట్టుగా సిద్ధమవుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ సారీ ఓటింగ్ శాతాన్ని మరింత పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా నగర ఓటర్లు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవడం కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), ఓటర్ వెరిఫికేషన్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీపీఏటీ)లపై నియోజకవర్గాల వారిగా అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గంలో సంచార వాహనాలు ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు నియోజకవర్గ స్థాయిలో ఈవీయం, వీ.వీ.ప్యాట్‌తో పలు ప్రాంతాల్లో ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. రాబోయే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆయా నియోజకవర్గ స్థాయి ఎలక్ట్రోల్ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ.వీ.యం, వీవీప్యాట్‌ల ద్వారా ఓటు వేసే విధానం, వీ.వీ. ప్యాట్‌ల ఉపయోగంపై అవగాహన కల్పిస్తున్నారు. స్టాటిస్టిక్స్ ఈ.వీ.ఎం. డెమో స్టేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

నియోజకవర్గాల వారీగా డెమో స్టేషన్ల ఏర్పాటు

అన్ని నియోజకవర్గాల్లో ఓటు హక్కు, వినియోగంపై అవగాహన కల్పించేందుకు వివిధ ప్రాంతాలల్లో డెమో స్టేషన్లను ఏర్పాటు చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో అబిడ్స్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మలక్ పేట్ నియోజకవర్గంలో నల్గొండ ఎక్స్ రోడ్‌లో సమీపంలోని డీ.సీ. ఆఫీస్, అంబర్ పేట్ నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్ డీ.సీ ఆఫీస్, ఖైరతాబాద్ నియోజకవర్గంలో జోనల్ కమిషనర్ కార్యాలయంలోని జూబ్లీహిల్స్ డీ.సీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్ గూడ డీ.సీ ఆఫీస్ కష్టకాంత్ పార్క్ దగ్గర, సనత్ నగర్ నియోజకవర్గం సికింద్రాబాద్ జోనల్ ఆఫీస్ కాంప్లెక్స్, బేగం పేట్ డీ.సీ ఆఫీస్ సిటీ సివిల్ కోర్టు కాంప్లెక్స్ మేరెడ్ పల్లి దగ్గర, నాంపల్లి నియోజకవర్గం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో మెహిందీపట్నం రెండవ అంతస్తులోని డీ.సీ. కార్యాలయం, కార్వాన్ నియోజకవర్గం ఖైరతాబాద్ జోనల్ ఆఫీస్ రెండవ అంతస్తు, గోషామహల్ నియోజకవర్గం అబిడ్స్ జీహెచ్ఎంసీ కాంప్లెక్స్‌లో డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, చార్మినార్ నియోజకవర్గం మొఘల్ పుర డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, చాంద్రాయణగుట్ట నియోజకవర్గం చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయం మూడవ అంతస్తు హఫీజ్ బాబా నగర్ వద్ద ఏర్పాటు చేశారు. యాకత్ పుర నియోజకవర్గం జోనల్ కమిషనర్ కార్యాలయం రెండవ అంతస్తులో ఏర్పాటు చేశారు. బహదూర్ పుర నియోజకవర్గం చార్మినార్ జోన్ కార్యాలయం నాలుగో అంతస్తులో, సికింద్రాబాద్ నియోజకవర్గం సికింద్రాబాద్ జోనల్ ఆఫీస్ మూడవ అంతస్తులో డెమో స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. ఒకొక్క సెంటర్‌కు ఒక అధికారిని ఇన్ చార్జిగా నియమించి ఓటర్లకు ఎలక్ట్రానిక్ యంత్రాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ అవగాహన కార్యక్రమాలు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు నిర్వహిస్తారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

- ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ నాయకులు
- ఈసీఐఎల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన



నవతెలంగాణ-సిటీబ్యూరో/కాప్రా

మణిపూర్‌లో మహిళల నగ్న ఊరేగింపు బాధ్యత మోడీ సర్కార్ దుర్మార్గపు చర్య అని, మణిపూర్ రాష్ట్రంలో విధ్వంస ఖాండను ఆపి వెంటనే ప్రజా సమస్యలు పరిష్కరించి శాంతి ని నెలకొల్పాలి అని ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీలు, స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణను నిలువరించడంలో విఫలమైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మణిపూర్ ముఖ్యమంత్రి బీరన్‌సింగ్ బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అశోక్, చంద్రశేఖర్, స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు యాదగిరిరావు మాట్లాడుతూ దాదాపు మూడు నెలల నుంచి మణిపూర్‌లో మైతి, కూకి జాతుల మధ్యలో జరుగుతున్న ఘర్షణను నిలువరించడంలో మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. బీజేపీ ఆ ఘర్షణలను రాజకీయాల కోసం ఉపయోగించుకుంటుందన్నారు. ఈ మధ్య ముగ్గురు మహిళలను బహిరంగ ప్రదేశాల్లో నగ్నంగా ఊరేగించి వారిపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలనీ, ఘర్షణ వాతావరణం నిలువరించాలనీ, శాంతిని నెలకొల్పాలనీ, మణిపూర్ ప్రజలకు దేశవ్యాప్తంగా ప్రజలు అండగా ఉండాలని తెలిపారు. మణిపూర్ ముఖ్యమంత్రి బీరన్‌సింగ్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తక్షణమే రాజీనామా చేసి కుకీజాతి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు కోమటి రవి, జిల్లా నాయకులు శ్రీనివాస్, ఉన్ని కృష్ణ, శ్రీనివాస్, స్ఫూర్తి గ్రూప్ నాయకులు వెంకటేశ్వర్లు, ప్రసాద్‌బాబు, శ్రీమన్నారాయణ, బసవపున్నయ్య, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు... సమస్యలు పరిష్కారం



నవతెలంగాణ -జవహర్‌నగర్

వరుసగా కురుస్తున్న వర్షాలతో జవహర్‌నగర్ కార్పొరేషన్ తడిసిపోయింది. అయితే మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండటంతో వరద నీరు ఆగకుండా వెలుతుండటంతో వరద ముప్పు తప్పింది. శుక్రవారం ఫైరింగ్ కట్ట సమీపంలోని మురుగు కాలువ నీరు రోడ్డుపై పారుతుండటంతో మేయర్ మేకల కావ్య వర్షంలోనూ సహాయక చర్యలు చేపట్టి సమస్యను పరిష్కారం చేయించారు. పాపయ్యబస్తీలో అవుట్లెట్ లేకపోవడంతో వరద నీరు ప్లాట్లలోకి చేరాయి. ఈ సందర్భంగా వర్షం సమాచారాన్ని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మేయర్ కావ్య, కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ సమీక్షిస్తున్నారు. కార్పొరేషన్ లో ఎక్కడ సమస్య అధికమైన పరిష్కారించేందుకు అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉన్నారని తెలిపారు. జిల్లా నాయకుడు మేకల అయ్యప్ప, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

నవతెలంగాణ -బోడుప్పల్

భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన జలమయం అయిన రోడ్లను కమిషనర్ వేణు గోపాల్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. బోడుప్పల్ నగర పరిధిలోని చింతల చెరువు, పోచమ్మ కుంట,రా చెరువులను అయన పరిశీలించారు. వరదల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేలా సిబ్బంది మూడు షిఫ్ట్‌లలో పనిచేయాలని సూచించారు. కార్పొరేషన్ అధికారులు ఇరవై నాలుగు గంటల పాటు అప్రమత్తంగా ఉండి కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని తెలిపారు.

చర్లపల్లి డివిజన్‌లో పర్యటించిన రాగిడి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ -కాప్రా

చర్లపల్లి డివిజన్ వెంకట్ రెడ్డి నగర్‌లో బస్తీ సమస్య లపై కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం పర్యటించారు. వెంకట్ రెడ్డి నగర్ లో వరుసగా మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల కాలనీలో లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లలోకి నీళ్ల చేరడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఈ సందర్భంగా వాపోయారు. మంచినీటి పైప్‌లైన్లలో మురుగునీరు, క్రిములు కీటకాలు వస్తున్నాయని లక్ష్మారెడ్డి దష్టికి తీసుకువచ్చారు. పరిశీలించిన రాగిడి లక్ష్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక ఎమ్మెల్యే కాని, కార్పొరేటర్ గాని పట్టించుకునే పరిస్థితి లేకపోవడం చాలా బాధా కరమని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్య స్తంగా మారి ఎక్కడపడితే అక్కడ కాలనీలో మురుగునీరు చేరి డెంగ్యూ మలేరియా లాంటి వ్యాధులకు ప్రజలకు గురవుతున్నారన్నారు. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు మరమ్మత్తులు చేయాలని కోరారు. నాలుగు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకోడానికే ఎమ్మెల్యే ఇప్పుడు పాదయాత్ర చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో ఈ బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని తెలిపారు. చర్లపల్లి డివిజన్ కంటెస్టడ్ కార్పొరేటర్ గడ్డం యాదగిరి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ యాదవ్, హౌసింగ్ బోర్డ్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ పొలిపాక అంజయ్య, పలకల నరసింహారెడ్డి, లింగం నాయక్, హీరాలల్ నాయక్ యువజన విభాగం నాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్, నీరజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీ ముత్యాలమ్మ, శ్రీ ఎల్లమ్మ ఆలయాలను సందర్శించిన రాగిడి

చర్లపల్లి డివిజన్ సాయి నగర్ కుషాయిగూడలో శ్రీ ముత్యాలమ్మ, శ్రీ ఎల్లమ్మ ఆలయ కమిటీ వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు.ఆలయ కమిటీ సభ్యులు , చర్లపల్లి డివిజన్ కంటెస్టడ్ కార్పొరేటర్ గడ్డం యాదగిరి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ యాదవ్, హౌసింగ్ బోర్డ్ డివిజన్ కంటెస్టడ్ కార్పొరేటర్ పొలిపాక అంజయ్య, పలకల నరసింహారెడ్డి, లింగం నాయక్, హీరాలల్ నాయక్ యువజన విభాగం నాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్, నీరజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వర్షాలకు చిన్న చర్లపల్లి వద్ద నిర్మిస్తున్న కల్వర్టు వద్ద నీటి ప్రవాహం ఎక్కువై పక్కన ఉన్న ఇండ్లు ముంపునకు గురి కావడంతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి జీహెచ్ఎంసీ మాన్ సూన్ సిబ్బందితో వెళ్లి సహాయక చర్యలు చేపట్టేలా కషి చేశారు. ఈ సందర్భంగా ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని,ఎలాంటి సమస్య వచ్చిన త్వరగా పరిష్కరించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు.
నవతెలంగాణ -కాప్రా

గౌడ హాస్టల్ మేనేజింగ్ కమిటీ సభ్యునిగా పాండాల శివకుమార్ గౌడ్



నవతెలంగాణ -కాప్రా

కాప్రా సర్కిల్ ఈసీఐఎల్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది పాండాల శివకుమార్ గౌడ్ గౌడ హాస్టల్ మేనేజింగ్ కమిటీ మెంబర్‌గా ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని గౌడ హాస్టల్లో జరిగిన మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో శివకుమార్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 27 మంది సభ్యులు కలిగిన గౌడ హాస్టల్ మేనేజింగ్ కమిటీలో తనకు అవకాశం కల్పించేందుకు కషిచేసిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కి, డాక్టర్ నరేష్ గౌడ్‌కు, అధ్యక్షుడు చక్రవర్తి గౌడ్‌కు, మాజీ అధ్యక్షులు జంగం గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గౌడ హాస్టల్ అభివృద్ధికి విద్యార్థులకు తన సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు.



బీఆర్ఎస్ ఐదు మండలాల యూత్ అధ్యక్షులుగా నీరజ్ గౌడ్ నియామకం

నవతెలంగాణ -శామీర్ పేట

అందరి సహకారంతో వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తానని మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఐదు మండలాల యువజన విభాగం నూతన అధ్యక్షుడు ర్యాకల నీరజ్ గౌడ్ అన్నారు. దుండిగల్‌లోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యలయంలో శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ శంభిపూర్ రాజు అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ యువజన కమిటీ ఏర్పాటు సమావేశంలో మూడుచింతలపల్లికి చెందిన ర్యాకల నీరజ్ గౌడ్‌ను నియోజకవర్గంలోని ఐదు మండలాల యూత్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ సందర్భంగా నీరజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఐదు మండలాలకు యూత్ అధ్యక్షునిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షునికి, మంత్రి మల్లారెడ్డికి సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి చామకుర మల్లారెడ్డి హాజరయ్యారు. బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు డాక్టర్ భద్రా రెడ్డి, జిల్లా రైతుబంధు అధ్యక్షులు నందరెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ దయాకర్ రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ మధుకర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంసీ పల్లి మండల అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, శామీర్ పేట మండల అధ్యక్షుడు సుదర్శన్, మున్సిపాల్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎంపీటీసీలు పారుపల్లి నాగరాజు, సర్పంచులు జాంరవి, కృపాకర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మేడ్చల్ : బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా రూరల్ యూత్ ఉపాధ్యక్షులుగా మేడ్చల్ మండల పరిధిలోని ఏల్లంపేట గ్రామానికి చెందిన కోరుపత్తి రామకృష్ణ నియామకం అయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన మంత్రి మల్లారెడ్డి,జిల్లా అధ్యక్షుడు,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ అందరికీ అందుబాటులో ఉంటనన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద యాదవ్,ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి,జెడ్పీటీసీ శైలజవిజయా నందా రెడ్డి,గ్రంథాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్,జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు విజయానంద రెడ్డి,మాజీ ఎంపీపీ పద్మజ జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్ క్యాంటీన్‌లో పప్పులో పాము

- భయాందోళనలో ఉద్యోగులు
- నిర్లక్ష్యం వహిస్తున్న యజమాన్యం, సిబ్బంది
- పూర్తిస్థాయిలో విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగుల డిమాండ్



నవతెలంగాణ -కాప్రా

ఈసీఐఎల్ కంపెనీ క్యాంటీన్‌లో పప్పులో పాము రావడంతో ఉద్యోగులు భయాందోళన చెందారు. ఈసీఐఎల్ సెంట్రల్ క్యాంటీన్ నుంచి వండిన వస్తువులను చర్లపల్లి లోని ఈవీఎం సంస్థకు తెచ్చి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం ఈవీఎం క్యాంటీన్‌లో సిబ్బంది ఆహార పదార్థాలను ఉద్యోగులకు అందించే సమయంలో పప్పులో నుంచి పాము పిల్ల బయట పడడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని బయటికి రాకుండా యజమాన్యం, సిబ్బంది జాగ్రత్త పడినట్టు తెలిసింది. అప్పటికే భోజనాలు చేసి విషయం తెలుసుకున్న కొంతమంది ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఈ క్యాంటీన్ వ్యవహారంలో అనేక అవకతవకలు జరిగినట్టు, ఇదే కాకుండా ఎలుకలు, బీడీలు, సిగరెట్టు, జిల్ల పురుగులు ఆహార పదార్థాలలో వస్తా యని నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. నిర్లక్ష్యం వహించిన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. కంపెనీ యాజమాన్యంపై కూడా ఫుడ్ ఇన్స్పెక్టర్లు కేసు నమోదు చేయాలని పూర్తిస్థాయి విచారణ చేయించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

లక్ష్మి నృసింహ్మా స్వామి వారిని దర్శించుకున్న నవీన్ విట్టల్ దంపతులు



నవతెలంగాణ -కీసర

చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ విట్టల్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. నవీన్ మిట్టల్ దంపతులను ఆలయ ఫౌండర్ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామివారి దర్శనం అనంతరం మహా మండపం లో స్వామివారి శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాలతో ఘనంగా ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మల్లారపు శ్రీహరి గౌడ్ పాల్గొన్నారు.

వరదలు వస్తాయని తెలిసినా ముందు జాగ్రత్త చర్యలు శూన్యం

- కాంగ్రెస్ పీర్జాదిగూడ నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి



నవతెలంగాణ -బోడుప్పల్

పాలక వర్గం చేతకానితనం వల్ల పీర్జాదిగూడ నగర ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పీర్జాది గూడ నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు.శుక్రవారం పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వర్షం కారణంగా నీట మునిగిన కాలనీల్లో కాంగ్రెస్ బృందం పర్య టించి భారీ వర్షాల కారణంగా స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల క్రితం వచ్చిన వరదల నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డిలు వచ్చి హడావుడిగా ప్రారంభోత్సవాలు చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ సమస్యకు పరిష్కారం చూపలేకపోయారని అన్నారు. దీనంతటికి నైతిక బాధ్యత వహించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనన్నారు.

రూ.110 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఎస్ఎన్డీపీ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాకపోవడం వల్ల నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి ఏటా వర్షాలు వస్తాయని తెలిసినా పాలక వర్గం ఎందుకు ముందస్తు చర్యలు చేపట్టలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్టు పనులు కాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. కేవలం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి లక్షలాది రూపాయల ప్రజా ధనం వథా చేశారని మండిపడ్డారు. ఇప్పటికైన అధికారులతో మాట్లాడి ఎస్ఎన్డీపీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని లేని పక్షంలో కాంగ్రెస్ అధ్వర్యంలో పెద్ద యెత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పన్నాల శ్రీనివాస్ రెడ్డి,అధికార ప్రతినిధి కొడే కుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్ ముదిగొండ రమేష్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలత బద్రు నాయక్, మజార్,బొడిగే ఉదయ్ కుమార్, పంగ రాజు, ఐలేష్, శ్రీకాంత్,ఉప్పరి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చర్లపల్లి డివిజన్ లోని సాయి నగర్ కాలనీ లో ముత్యాలమ్మ నల్ల పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారి సతీమణి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేట్ గొల్లూరి అంజయ్య, ఆలయ కమిటీ సభ్యులు, బీ.ఆర్.ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ -కాప్రా

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి...అభివృద్ధి చేస్తాం



నవతెలంగాణ-కీసర

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి...అభివృద్ధి చేస్తామని యువజన కాంగ్రెస్ నేషనల్ కో ఆర్డినేటర్ సింధుజ , రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి రుక్వర్ధన్ రెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డోర్ టు డోర్ క్యాంపెనింగ్ కార్యక్రమం దమ్మాయిగూడా మున్సిపాలిటీ లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సింధుజ , రుక్వర్ధన్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి ఓట్లు వేసి మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తేనే మన బతుకులు బాగు పడుతాయన్నారు. తెలంగాణ అమరవీరులకు ఒక్క కుటుంబానికి రూ.25,000 నెలవారి గౌరవ పెన్షన్, మొదటి ఏడాది రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, యూత్ కమిషన్ ఏర్పాటు, రూపాయలు 10 లక్షల వడ్డీ లేని రుణం, ఫీజు రియంబర్స్మెంట్, యువ మహిళ సాధకారితతో భాగంగా 18 సంవత్సరములు నిండిన యువతకి ఎలక్ట్రిక్ స్కూటర్ లు పంపిణీ, వరంగల్ డిక్లరేషన్ లో తీసుకున్న నిర్ణయాలను గడపగడపకు మున్సిపల్ కార్యవర్గం ప్రచారం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో దమ్మాయిగూడా మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్ప రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాసరెడ్డి, ఏనుగు సంజీవరెడ్డి,సుమేష్, శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, దుర్గాప్రసాద్, జగపతిరావు, మహిళా నాయకురాలు శోభారాణి, ఈగ శ్వేతా రాజు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రశాంత వాతావరణంలో మొహర్రం పూర్తి చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీస్ అధికారులకు సీపీ డీఎస్ చౌహాన్ సూచన



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్, రాచకొండ పరిధిల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఆదేశించారు. ప్రజలు, వాహనదారులు అత్యవసరమైతేనే బయటకు రావాలని ప్రజలను సీపీ కోరారు. భారీ వర్షాలతో ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, తీసుకోవలసిన చర్యలతోపాటు రానున్న మొహర్రం పండుగ నేపథ్యంలో చేపట్టవలసిన భద్రతా ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాచకొండ పరిధిలోని ప్రస్తుత పరిస్థితులను క్షేత్రస్థాయిలో పోలీస్ అధికారులను సీపీ అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం కమిషనరేట్ నుంచి ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాచకొండ కమిషనరేట్‌లో పనిచేస్తున్న డీసీపీలు, ఏసీపీలు, సీఐలతోపాటు ఇతర అధికారులతో సీపీ మాట్లాడారు.

భారీ వర్షాల కారణంగా సామాన్య ప్రజలు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అవసరమైన సంరక్షణా చర్యలు చేపట్టాలని అధికారులను సీపీ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, రోడ్ల మీద తెరిచి ఉంచిన మ్యాన్ హెూల్స్ పక్కన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వర్షం పడే సమయంలో, అవసరం అయితేనే ప్రజలు రోడ్ల మీదకు రావాలని, వీలైనంత వరకు, కార్ల వంటి వాహనాల ఉపయోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రజా రవాణా ఉపయోగించడంతో ట్రాఫిక్ రద్దీతగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ఇదిలావుండగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో మొహర్రం వేడుకలను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేయాలని సీపీ కోరారు. మొహర్రంల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 'ఆలమ్‌లు' ఏర్పాటు చేసే చోట మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు, బ్లూ కోల్ట్స్, పెట్రోల్ కార్లు మొదలైన వాటిని ఏర్పాటు చేయాలని, ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొనే సామూహిక ప్రార్థనల వంటి కార్యక్రమాలకు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని మసీదుల ప్రాంగణాల్లో వాహనాల నెంబర్ ప్లేట్ల చెకింగ్, పత్రాల చెకింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా వేసి ఉంచాలన్నారు. ఆయా ప్రాంతాల్లో సీసీటీవీల పనితీరును పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మత సామరస్యం కాపాడడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ సత్యనారాయణ, ఎస్.బీ. డీసీపీ బాలస్వామి, డీసీపీ జానకి, ఎస్.బీ. ఓఎస్డీ మహేష్, ఏసీపీలు జావేద్, జగదీష్ చందర్‌తోపాటు ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో పాల్గొన్నారు.

స్ప్రింగ్ విల్లే సమస్యలు పరిష్కరించాలని

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్ప్రింగ్ విల్లేకు చెందిన సమస్యలు పరిష్కరించాలని, కాలనీ పెండింగ్ పనులు, మౌలిక వసతులు కల్పించాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, బోర్ర చందు ముదిరాజ్‌తో కలిసి శుక్రవారం మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డిని కలిసి కోరారు. మేయర్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాల రూపకల్పనకు ఎల్లపుడూ కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్ప్రింగ్ విల్లే అసోసియేషన్ సభ్యులు నరేందర్ రెడ్డి, నరసింహ రెడ్డి, రాము, బాలకృష్ణ, శ్రీనివాసరావు, కృష్ణ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

నవతెలంగాణ-మల్కాజిగిరి



ఎడతెరిపిలేని వర్షాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. సోమవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మల్కాజ్గిరి ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్‌లోని బండ చెరువు వరద నీరు సమీప ప్రాంతాలలోని ఇండ్లలోకి చేరి ప్రజలందరూ అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. అక్కడి స్థానికులు అందించిన సమాచారం మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ ఆ ప్రాంతాన్ని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉమేష్ సింగ్, బి కే శ్రీనివాస్, సూర్య ప్రకాష్, శ్యామ్ రావు, ప్రవీణ్, సతీష్ పాల్గొన్నారు.

వర్షాకాలం వచ్చింది.. తస్మాత్ జాగ్రత్త..!

- విద్యుత్‌తో జరభద్రం
- జాగ్రత్తలు తప్పనిసరి



నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్షాకాలంలో విద్యుత్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం. గ్రేటర్ హైదరాబాద్‌లో రోజూ ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. వర్షంతోపాటు గాలి కూడా వీస్తే మరింత అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నది. విద్యుత్ మోటర్లు, స్తంభాలు, కరెంట్ తీగలు ఉన్న చోట అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. వర్షాకాలం కాలు బయట పెట్టాలంటే అప్రమత్తంగా ఉండాల్సిందే. మరీ ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో కాలు బయటపెడితే వాన నీటిలో ఎక్కడ మ్యాన్ హెూల్ ఉందో అనే భయం.. దాంట్లో పడితే ఇక ప్రాణాలపై ఆశ వదిలేసుకోవాల్సిందే. అంతేకాదు వర్షాకాలంలో విద్యుత్ విషయంలో కూడా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో పాటు గాలి కూడా వీస్తే ఇక విద్యుత్ స్థంబాలు నేలకూలతాయి. అప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. వాన నీటితో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతుంటాయి. ఆ సమయంలో వాటిని తాకితే ఇక పెను ప్రమాదమే సంభవిస్తుంది. నీటితో పుట్టిన విద్యుత్ కూడా నీటి తడి తగిలితే ప్రాణాంతకంగా మారుతుంది. వర్షాకాలంలో ట్రాన్స్ ఫార్మర్ల వద్ద అస్సలు నిలబడకూడదు. వీలైంతన వరకు విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు. పనుల మీద బయటకు వెళ్లిన సమయంలో వర్షం కురిస్తే ట్రాన్స్ ఫార్మర్ల వద్ద నిలబడకూడదు. ఎక్కడైనా విద్యుత్ తీగలు కిందకు వంగినట్టు గానీ.. రోడ్డుమీద పడి ఉన్నట్టు గానీ కనిపిస్తే వాటి వద్దకు వెళ్లకూడదు. ఎవ్వరినీ వెళ్లకుండా అప్రమత్తం చేయాలి. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేస్తే వారు తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. మరి వర్షాకాలంలో విద్యుత్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం..



ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

1.వర్షంతో పాటు ఈదురు గాలులు వీస్తున్నప్పుడు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో కరెంట్ స్తంభాలను తాకొద్దు. 2.విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మలమూత్ర విసర్జనచేయొద్దు. చెత్తా, చెదారం వేయొద్దు. తెగిపడిన విద్యుత్ తీగలను తాకొద్దు. 3.ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలపై ఇతర మరమ్మతులు చేయొద్దు. 4.విద్యుత్ తీగల కింద నిర్మాణాలు చేయొద్దు. మూగ జీవాలను విద్యుత్ స్తంభాలకు కట్టివేయొద్దు. 5.విద్యుత్ స్తంభం నుంచి ఇంటిలోకి వచ్చే సర్వీస్ వైర్ పైన బట్టలను ఆరవేయొద్దు. 6.తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు, పక్కకు ఒరిగిన స్తంభం, తుప్పు పట్టిన ఇనుప స్తంభం, తెగిపడిన విద్యుత్ వైర్లు, చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను చూసిన వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

త్రీమంకీ చౌరస్తా బస్ స్టాప్‌ను పున: నిర్మించాలి



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ త్రీ మంకీ చౌరస్తా వద్దగల ఆనాడు ఆల్విన్‌లో పని చేస్తున్నటువంటి ఉద్యోగుల కోసం వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా నిర్మించిన బస్ స్టాప్ కనుమరుగైందన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా బస్ స్టాప్‌ను పున: నిర్మించాలని సీపీఐ(ఎం)బాచుపల్లి కమిటీ నాయకులు జి. వెంకటరాజం అన్నారు. ఈ మేరకు త్రీ మంకీ చౌరస్తా వద్ద బస్సు స్టాప్‌ను మరల ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మాణం చేపట్టి ప్రయాణికులకు, విద్యార్థులకు వర్షాకాలం అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ(ఎం) జెండాలతో నిరసన తెలిపారు. ఆర్టీసీ అధికారులు, మున్సిపల్ అధికారులు ప్రజా ప్రయోజనాలు దృష్ట్యా వెంటనే బస్సు సెంటర్ నిర్మాణం చేపట్టాలని, బస్సు షెల్టర్ లేక ప్రజలు స్కూల్ పిల్లలు కాలేజీ పిల్లలు ఎండలో, వర్షానికి తడుస్తూ ఇప్పటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నరన్నారు. నిర్మాణం వెంటనే చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని, ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, నిజాంపేట మున్సిపల్ మేయర్ స్పందించి ప్రజలు ఇబ్బందులను గుర్తించి, బస్సు సెంటర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం)మండల కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. సీపీఐ(ఎం) మండల నాయ కులు బాల పీర్, స్వామి, పెంటయ్య మల్లికార్జున్ పాల్గొన్నారు.

ముజీబ్ ఆధ్వర్యంలో ఎంఎన్‌జేలో అన్నదానం



- పాల్గొన్న బోయినపల్లి బీఆర్ఎస్ కార్పొరేటర్ నరసింహ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సేవా రత్న డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో బోయినపల్లి బీఆర్ఎస్ కార్పొరేటర్ ఎం.నరసింహ యాదవ్ చేతుల మీదుగా శుక్రవారం ఎం.ఎన్.జే.క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో సుమారు 600 రోగుల సహాయకులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరసింహ యాదవ్ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిలిచినందుకు ముజీబ్‌కి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముజీబ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల ఆశీర్వాదంతో ప్రతి నెలా నాలుగుసార్లు క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో అన్నదానం చేయడం తనకు ఎంతో సంతోషాన్నిస్తుందని తెలిపారు. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నగర ప్రజలు జాగ్రత్త వహించాల్సిందిగా, అత్యావసర పరిస్థితులు తప్ప బయటికి రావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు కె.ఆర్. రాజ్ కుమార్, శంకర్, ఆస్పత్రి సభ్యులు శివకుమార్, శేఖర్, నాలుగో తరగతి నాయకులు ఎం.ఏ ముజీబ్, జిల్లా ఏపీఆర్వో మహమ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశం నిర్వహించిన ఎమ్మెల్సీ

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుం డిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గండి మైసమ్మ బీఆర్ఎస్ భవన్‌లో శుక్రవారం మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా, మేడ్చల్ నియోజకవర్గం రూరల్ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రివర్యులు, స్థానిక శాసనసభ్యులు మలారెడ్డితో కలిసి పాల్గొన్న ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు.

మణిపూర్ మంటలు ఆర్పి ప్రశాంత వాతావరణం కల్పించాలి

- ఉపాధ్యక్షుడు బూదాల బాబూరావు

నవతెలంగాణ-బాలానగర్



మణిపూర్‌లో మూడు నెలలుగా కొనసాగుతున్న ఘోరాతి ఘోర దారుణాలు జరగడాన్ని జాతీయ దళిత సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా శుక్రవారం జాతీయ ఉపాధ్యక్షుడు బూదాల బాబూరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిందితులను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా కొన సాగుతున్న జాతుల ఘర్షణలో చోటు చేసుకున్న అమానవీయ ఘటనలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ చేతగానితనం, కేంద్ర ప్రభుత్వ అలసత్వమని అక్కడి సమాజంలో ఎంతటి విపత్తులకు దారితీసిందో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతల మౌనాన్ని దేశ ప్రజలు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు. అక్కడి ఓ గ్రామంలో కుకీ తెగకు చెందిన ము గ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించి. సామూహిక లైంగిక దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. దాదాపు వెయ్యిమంది మైతీలు బలవంతంగా లాక్కెల్లి నగ్నంగా మార్చి ఊరేగించిన దృశ్యాలను చూసి దేశ ప్రజలు చలించిపోయారన్నారు.. తక్ష ణమే ప్రధాని మోడీ, హెూం మంత్రి అమిత్ షాలు నింది తులను గుర్తించి కఠిన శిక్షలు అమలు పరచి మణిపూర్ మంటలు ఆర్పి ప్రశాంత వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు.

బ్యాంక్ అఫ్ ఇండియా మేనేజర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



బ్యాంక్ అఫ్ ఇండియా బాలానగర్ బ్రాంచ్ నూతన మేనేజర్‌గా అరుణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా శుక్రవారం బాలనగర్‌లోని బ్యాంక్ (బ్రాంచ్) కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ పంచశీల కాలనీకి చెందిన చిన్నతరహా పారిశ్రామిక ప్రతినిథులు మానస టూల్ టెక్ అధినేత, ప్రముఖ కవి వాకిటి రామ్ రెడ్డి, గీతా నగర్ సూక్ష్మ చిన్నతరహా ప్రతినిథి ఉపేందర్ రెడ్డి, శృతిక శ్రీ ఇండస్ట్రీ అధినేత సామజిక సేవకుడు జింకల వెంకటేశం ముదిరాజ్, లక్ష్మి ఇండస్ట్రియల్ అధినేత మోతె రాజేశ్వర్‌తోపాటు కావ్యప్రియ టెక్నిక్స్ అధినేత తాండూర్ భాషయ్యలు కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బ్యాంక్ అఫ్ ఇండియా జోనల్ మేనేజర్ సుభాకర్ మాల్యాబత్తులకు కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంక్ అఫ్ ఇండియా మేనేజర్, సిబ్బంది వినియోగదారులకు ,పారిశ్రామిక వేత్తలకు అందిస్తున్న సేవలకు ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా



నవతెలంగాణ-మల్కాజిగిరి

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ ప్రేమకుమార్ అన్నారు. శుక్రవారం ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలో వర్షానికి జలమయమైన కాలనీలు ఎన్ఎండీసీ కాలని, షిరిడి నగర్, సత్తిరెడ్డి కాలనీ ఏరియాలలో కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, ఉమపతి, కాలని వాసులు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలలో పర్యటించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గత కొన్ని రోజులగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గాను కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, మీనాక్షి ఎస్టేట్‌లలో శుక్రవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వరద నీరు నిలవకుండా చూడాలని, ఎస్ఎన్‌డీపీ ద్వారా చేపడుతున్న నాలా పనులను త్వరతగిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలన్నారు. రాబోయే రోజుల్లో ఈ కాలువ నిర్మాణం ద్వారా వరద ముంపుకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది అని తెలిపారు. అదేవిధంగా చుట్టుపక్కల కాలనీలలో ముంపుకు గురిఅవుతున్న వరద నీటి మళ్లించడానికి రూ. 2.40 కోట్లతో త్వరలోనే కాలువ నిర్మాణానికి కూడా చేపట్టబోతున్నాం అని ఎమ్మెల్యే కాలనీ వాసులకు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ. చెన్నరెడ్డి, ఈ.ఈ. కృష్ణ చైతన్య, డి.ఈ.ఈ. పాపామ్మ ఏ.ఈ.లు సురేందర్ నాయక్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

బాలానగర్: వర్షాల కారణంగా ముంపు ప్రాంతాలలో ఎ దురయ్యే సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి ఎమ్మె ల్యే మాధవ్ కృష్ణారావు పర్యటించారు. కూకట్‌పల్లి




నియోజ కవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీనదయాల్ నగర్ లోతట్టు ప్రాంతం కావడం వల్ల వర్షాలు పడుతున్న నేపథ్యంలో అక్కడ నాలా ఉధృతంగా ప్రవహి స్తోంది. అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అధికారులతో కలసి వర్షం లోనే ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ నాలాకు సంబంధి ంచి రిటర్నింగ్ వాల్ ఎత్తు పెంచాలని, ఇప్పటికే దీనికి సం బంధించి కమిషనర్‌తో మాట్లాడానని తెలిపారు. ఈ విష యం పై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదే శాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికా రులు, మాజీ కార్పరేటర్ తూము శ్రావణ కుమార్, డివిజన్ అధ్యక్షుడు కంచి బిక్షపతి, సాయిలు యాదవ్, కాసు మహేందర్, సురేష్ నాయుడు, నాని యాదవ్ పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ : రానున్న రోజుల్లో భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో అధికారులు అందరు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం కారణంగా అల్లాపూర్ డివిజన్ పరిధిలోని ముంపు ప్రాంతాలలో సఫ్దర్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, రామారావు నగర్‌లలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ పర్యటించారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాలకు గురైన ప్రజల ఇంటింటికి వెళ్లి పలకరించి వారికి భోజనం ఏర్పాట్లు చేసి వారికి పునరావసతి కేంద్రం సఫ్దర్ నగర్ పబ్లిక్ హైస్కూల్లో ఏర్పాటు చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



ఈ కార్యక్రమంలో ఎఈ రంజిత్, వర్క్ ఇన్స్పెక్టర్ బలరాం, ఎస్ఆర్పి సురేష్, ఎస్ఎఫ్ఏ నరసింహా, అధ్యక్షులు లింగాల ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట: ఎడతెరిపి కు రుస్తున్న వర్షాలకు కుత్బుల్లాపూర్ ,గాజులరామారం జంట సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యా యి. పలు కాలనీలలో రోడ్లపై, ఇండ్ల ముందర వర్షపు నీరు స్తంభించిపోయి ప్రజలు, ప్రయాణీకులు ఇబ్బందులు పడు తున్నారు. గాజులరామారం గ్రామం సమీపంలోని బాలాజీ లేఔట్‌లో సర్కిల్ అధికారులు సీఈ. కిషన్, ఎస్ఈ. చిన్న రెడ్డి, ఈఈ .గోవర్ధన్ గౌడ్, డి ఈ. రూపదేవి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాలను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి పర్యటించారు. శాశ్వత పరిష్కారం కొరకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితర నాయకులు పాల్గొన్నారు.



ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సోమయ్య నగర్ బోనాల ఉత్సవాలు, 129 సూరారం డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీ నగర్‌లో జై శ్రీరామ్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో బోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పల భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీలు హజ్రత్ అలీ, మహ్మద్ సిద్దిక్, సీనియర్ నాయకులు, సయ్యద్, వేణు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వాగ్మీకరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ ఛారిటీ వ్యవస్థాపకులు, తెలుగు చలనచిత్ర పరిశ్రమ నటులు మోడల్స్ చెన్నమనేని వాసుదేవ్ రావు, రాజశేఖర్‌లు కలిసి వీవీఆర్ గ్రూప్ చైర్మెన్ వెన్నమనేని విష్ణురావులు శుక్రవారం స్వేచ్ఛ ఫౌండేషన్‌లోని అనాథ పిల్లలకు పెయింటింగ్ కలర్స్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలకు పిజ్జాలు అందించిన వీరేన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

చెత్త, చెదారాన్ని స్వచ్ఛ ఆటోలో మాత్రమే వేయాలి



నవతెలంగాణ- కేపీహెచ్‌బీ

చెత్త, చెదారాన్ని రోడ్లపై పడవేయకుండా స్వచ్ఛ ఆటోలలో మాత్రమే వేసేలా చూసుకోవాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత అధికారులను ఆదేశించారు. గురువారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఉప కమిషనర్లు, సహాయ వైద్యాధికారులతో జోనల్ కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎడ తెరిపి లేని వర్షాలను దృష్టిలో ఉంచుకుని శానిటేషన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆయా సర్కిళ్ళలోని స్వీపింగ్, చెత్త తొలగింపు, అన్ని జీవీపీ లలో ప్రతిరోజు చెత్తను తొలగించేలా చూసుకోవాలని ఆదేశించారు. 2 బీహెచ్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, జీహెచ్ఎంసీ ఉద్యోగులతో తగినన్ని టీమ్స్ వేసి రోజువారిగా సమీక్షించి నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా సర్కిల్ ఉప కమిషనర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు .ఈ సమావేశంలో ఉప కమిషనర్లు ఎ.రమేష్, కృష్ణయ్య, మం గ తాయారు, మల్లారెడ్డి, సహాయ వైద్యాధికారి డాక్టర్ మమత, జోనల్ సహాయ కమిషనర్ పాల్గొన్నారు.

ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కూల్చివేత తప్పదు

- కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ గౌడ్

నవతెలంగాణ- నేరేడ్‌మెట్



నాలాల స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే వరద నీటి ప్రవాహానికి అడ్డంకి గా మారితే వాటిని నిర్దాక్షణ్యంగా తొలగిస్తామని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా, అనిల్ కిశోర్ గౌడ్ హెచ్చరించారు. గత కొద్దిరోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి వెస్ట్ వెంకటాపురం రోడ్ నెంబర్ 15లో వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్నటువంటి అక్రమ కట్టడాన్ని శుక్రవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ పర్యవేక్షణలో అధికారులు తొలగించారు. దీంతో వరద నీరు సాఫీగా వెళ్లింది. ఈ కార్యక్రమంలో డీఈఈ కార్తీక్ , వర్క్ ఇన్స్పెక్టర్ వెంకట్ రావు, కాలనీ వాసులు ప్రసాద్, మేరీ, బీఆర్ఎస్ నాయకులు సంతోష్, లక్ష్మణ్, అనిల్, లోకేష్, జనార్ధన్ కుట్టి తదితరులు పాల్గొన్నారు.

వీడని ముసురు - స్తంభించిన జన జీవనం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



గత నాలుగు రోజుల నుంచి ఎడ తెరపి లేకుండా ముసురు వాన కురుస్తుండటంతో జన జీవనం స్థంభించి పోయింది. ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లడానికి వీలు లేకుండా పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ముఖ్యంగా రోజు వారి కూలీలు పని లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోం టున్నారు. రోజు అడ్డమీదికి వెళితే కనీసం రూ 500, 1000, సంపాదించుకునేవాళ్లం ఈ అకాల వర్షం వల్ల ఏటూ వెళ్ళ లేక పోతున్నామని, పనికి వెళ్ళక పోతే రోజు గడవాలంటే ఇబ్బందికరంగా మారిందని అడ్డా కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వరకు ముసురు వర్షం కురవడంతో చెరువులలోకి నీరు బాగా చేరింది. కాలనీలలో వరద నీరు ముంచెత్తింది. ఏది రోడ్డో ,ఎక్కడ గుంత ఉందో, మ్యాన్ హెూల్ ఎక్కడుందో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మరో రెండు, మూడు రోజులు వర్షం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటనలతో కూలీలు, సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోడ కూలిన కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు, కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ డివిజన్ బబ్బుగూడ ప్రాంతంలో, బొల్లం లక్ష్మి, రాముల ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ టీపీసీసీ సభ్యులు గొట్టి ముక్కల వెంగళ్ రావ్, నేరుగా భాదిత కుటుంబం ఇంటికి వెళ్ళి, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వారికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసారు. ఈ సందర్భంగా వెంగల్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పేదలకు ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీబ్లాక్ అధ్యక్షులు గోపిశెట్టి రాఘవేంద్ర, ఎన్ ఎస్ యు ఐ జనరల్ సెక్రటరీ సయీద్ మిస్బా, సుధాకర్ రెడ్డి, యువ నాయకులు సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి: మూసాపేట్ డివిజన్ బబ్బుగూడలోని నివాసం ఉంటున్న గణేష్, అనురాధల నివాస గృహం గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల గోడ కూలిపోయి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులతో మాట్లాడి వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేటట్లు ఆదేశాలు జారీ చేశారు.





డ్రయినేజీ సమస్యను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ కేఎస్ బేకరి రోడ్డులో తలెత్తిన డ్రయినేజీ సమస్యను జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భాగ్యనగర్ కాలనీ లో కెఎస్ బేకరి రోడ్డు లో తలెత్తిన డ్రైనేజి సమస్యను పరిష్కరించడానికి కాలనీలో పర్యటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతి, వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, సూపర్ వైజర్ నరేంద్ర, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో అనేక బహుళజాతి కంపెనీలు కోట్లాది పెట్టుబడులు పెట్టి యువతకు లక్షలాది ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయని టీఎస్ఎండీసీ చైర్మెన్ మన్నె క్రిశాంక్ అన్నారు. శుక్రవారం డైమండ్ పాయింట్ కేఫ్ లో 11వ "కేఫ్ పాలిటిక్స్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమ ంలో యువత భారీ సంఖ్యలో పాల్గొని పలు అంశాలపై చర్చించారు. రాజకీయా ల్లో యువత పాత్ర ప్రాధాన్యత, బహుళజాతి కంపెనీల్లో అవకాశాలపై చర్చించా రు. అనంతరం క్రిశాంక్ మాట్లాడుతూ యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చు కోవాలంటే మంచి కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌తో సిద్ధంగా ఉండాలన్నారు. కేఫ్ పాలిటిక్స్‌పై తాను నిర్వహిస్తున్న కేఫ్ పాలిటిక్స్ కార్యక్రమం యువతకు ఎంతగా ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో యువకులు వారి ఆలోచన ల ను వ్యక్తపరచడానికి వేదికగా మారుతున్నట్లు భావిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా రాజకీయాల్లో యువత పాత్ర ప్రాముఖ్యతపై అందరికి అవగా హన కలుగుతుంది" అని క్రిశాంక్ చెప్పారు.



నవతెలంగాణ-కంటోన్మెంట్

బీజేపీ ఎక్స్ సర్వీస్ మెన్ సెల్ రాష్ట్ర మాజీ కన్వీనర్ గోపు రమణారెడ్డి శుక్రవారం తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ రాష్ట్ర మంత్రి , బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే. అరుణని కలిశారు.

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



విద్యుద్ఘాతంతో మూడు పాడిగేదెలు మృత్యువాత



నవతెలంగాణ-ఘట్కేసర్

మూడు పాడిగేదెలు విద్యుద్ఘాతంతో మృత్యువాత పడిన సంఘటన ఘట్కేసర్ మండలం చౌదరిగూడ పరిధిలోని ఎంఎస్ఆర్ కాలనీ సమీపంలోని వ్యవసాయ పొలంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు పోచారం సామల వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎంఎల్ఆర్ కాలనీ సమీపంలోని వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం నేల కూలడంతో మేతకు వెళ్లిన మూడు పాడిగేదెలు విద్యుద్ఘాతంతో తగిలి మృతి చెందినట్టు తెలిపారు. విద్యుత్ స్తంభం నేలకూలినా విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫర నిలిపి వేయకపోవడంతోనే ఈ ఘోరం జరిగిందని భాధితులు వాపోయారు. ఒకోక్క పాడిగేదె దాదాపు రూ. లక్ష 20 వేల వరకు ఉంటుందని, మొత్త మూడు గేదెలు 3లక్షల 60వేల విలువ ఉంటుందని తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ఘోరం జరిగిందని బాధితుడు వెంకట్‌రెడ్డి ఆరోపించారు.

విక్రమ్ గౌడ్‌తో ఈటల రాజేందర్ భేటి



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

గోషామహల్ నియోజకవర్గం ఎం జేమార్కెట్ లోని మాజీ మంత్రి ముఖేష్ గౌడ్ తనయుడు, బీజేపీ నాయకుడు విక్రమ్ గౌడ్ నివాసానికి శుక్రవారం ఎమ్మెల్యే, బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ ఈటెల రాజేందర్ చేరుకొని నియోజకవర్గం లో తాజా రాజకీయాలపై చర్చించిన చర్చించినట్టు సమాచారం. రానున్న ఎన్నికల్లో బీజేపీ నుండే గోషామహల్ నియోజకవర్గం లో పోటీ చేస్తానని.. రాజాసింగ్ ఇంటికి వెళ్లి ఆయన మద్దతు కూడా కోరుతానని బీజేపీ నాయకుడు విక్రమ్ గౌడ్ మీడియాకు వెల్లడించారు. తన కుటుంబానికి గోషామహల్ నియోజకవర్గ ప్రజలతో 40 ఏండ్ల అనుబంధం ఉంది అన్నారు.

మున్సిపాల్టీల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టామని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని మున్సిపాల్టీల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి 24 గంటల పాటు ప్రజల సమస్యలను తెలుసుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో ఉన్న ఇండ్లల్లో ఉండరాదని, అలా ఎక్కడైనా ఉంటే వెంటనే తమకు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలోని ఆయా మున్సిపాల్టీల్లో ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్ల వివరాలను కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. మరో మూడు, నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లరాదని సూచించారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండే విధంగా ఈ కాల్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లాలోని ఆయా మున్సిపల్ కార్పొరేషన్లు, -మున్సిపాల్టీల్లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ల వివరాలు ఇలా..

మున్సిపల్ కార్పొరేషన్	మొబైల్ నెంబర్
బోడుప్పల్	040-27215959
జవహర్‌నగర్	99639-96908, 8074064746,
నిజాంపేట	040-29569700,
పీర్జాదిగూడ	73311-64056

మున్సిపాల్టీ	మొబైల్ నెంబర్
దమ్మాయిగూడ	96667-03077
దుండిగల్	95427-15377,
ఘట్కేసర్	91540-83772,
గుండ్లపోచంపల్లి	96661-82138,
కొంపల్లి	18004257590,
మేడ్చల్	93920-11506, 86390-50325
నాగారం	96400-10053,
పోచారం	89857-73105,
తూంకుంట	91542-79697

మనసు పలికే కథల్లో ఆత్మీయ స్పర్శ

ఆచార్య కొలకలూరి ఇనాక్



నవతెలంగాణ-కల్చరల్

ఆత్మీయత అనుబంధాలు మనసు పలికే కథలలో ద్యోతకమవుతాయని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. రవీంద్రభారతి లోని సమావేశ మందిరం లో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో పాలపిట్ట పబ్లికేషన్ నిర్వహణలో జాలాది రత్న సుధీర్ రచించిన మనసు పలికే కథా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య ఇనాక్ పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి కథా సమాజంలోని వాస్తవాలకు దర్పణం అన్నారు. కథ రచయిత పీ.ఎస్.రాంబాబు అధ్యక్షత వహించిన సభలో డినకరబాబు తదితరులు పాల్గొన్నారు



బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ యువజన కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-సిటీబ్యూరో

దుండిగల్‌లోని మేడ్చల్-మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మేడ్చల్ నియోజకవర్గ పార్టీ యువజన కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్,కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలోని 5 మండలాల యూత్ ప్రెసిడెంట్‌గా నిరాజ్ గౌడ్‌ను నియమిం చారు. రామకృష్ణ, దుర్గం వినయ్ రెడ్డిలను వైస్ ప్రెసిడెంట్లుగా, విజయ్ ముదిరాజ్‌ను జనరల్ సెక్రెటరీగా, సంతోష్ రెడ్డిని సెక్రెటరీగా నియమించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహేం దర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర యువ నాయకులు భద్రారెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షులు నందారెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ దయాకర్ రెడ్డి, డీసీఎంస్ వైస్ చైర్మెన్ మధుకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల మున్సిపాల్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల భర్తీకి ఓకే..!



- స్కూల్ ఎడ్యూకేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ముజీబ్‌కు సన్మానం
- సెంట్రల్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులకు కృతజ్ఞతలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఆఫీస్ సబార్డినేట్(అటెండర్) పోస్టులు ఖాళీగా ఉండడంతో వాటిని కారుణ్య నియామకాల కింద భర్తీ చేసేందుకు వీలుగా జూనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడేషన్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ శాఖలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాల కింద నియామకాలు చేసే జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా లేకపోవడంతో చాలామంది కారుణ్య నియామకాల కోసం ఏండ్లుగా ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముజీబ్ అనేక సమావేశాల్లో పలు ప్రభుత్వ వేదికలపై మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాల ద్వారా భర్తీ చేసి వారికి న్యాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ విషయాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల మామిళ్ల రాజేందర్, జగదీష్ నాయకత్వంలో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి ఈ జీవో రావడంలో ఎంతో కృషి చేశారు. ఈ నేపథ్యంలో టీఎన్జీవో యూనియన్ జిల్లా సహాధ్యక్షుడు, స్కూల్ ఎడ్యూకేషన్ యూనిట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్ శుక్రవారం ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో డాక్టర్ ముజీబ్‌ను కలిసి పూలబోకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే విద్యాశాఖలో కారుణ్య నియామకాల ద్వారా భర్తీ చేయాల్సిన నిరుద్యోగ అభ్యర్థుల లిస్ట్ అందజేసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కె.ఆర్. రాజ్‌కుమార్ మాట్లాడుతూ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు ఎం.రాజేందర్, ప్రధాన కార్యదర్శి జగదీశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బోయినపల్లి కార్పొరేటర్ నర్సింహ యాదవ్, ఈసీ మెంబర్ శంకర్, ఏపీఆర్వో వహిద్, పీఆర్వో జహంగీర్ అలీ, కార్యవర్గం, నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.ఏ.ముజీబ్, క్యాన్సర్ ఆస్పత్రి యూనిట్ కార్యదర్శి శివ కుమార్, ఉపాధ్యక్షుడు శేఖర్, శ్రీనివాస్ బాబు, అనిల్,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధార్థ్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్ పేట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కటింగ్ నిర్వహించారు.

నవతెలంగాణ
హైదరాబాద్
శనివారం । 22 జులై । 2023 10

క్షేత్ర స్థాయిలో అధికారులు

అప్రమత్తంగా ఉండాలి

• ముంపు ప్రాంతాల్లో పర్యటించిన జీహెచ్ఎంసీ కమిషనర్



మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు 24గంటలపాటు పనిచేస్తున్నాయి : కమిషనర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్నవర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. హిమాయత్ నగర్‌లోని ఆదర్శ్ బస్తీలో ముంపునకు గురైన ప్రాంతంతోపాటు నల్లకుంట పద్మ నగర్, నాగయ్యకుంట,అడిక్ మెట్ ప్రాంతాల్లో వర్షంతో ఇబ్బందికి గురైన ప్రాంతాలతో పాటు నాలా పనులను శుక్రవారం ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠా గోపాల్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు. ముందుగా హిమాయత్ నగర్ స్ట్రీట్ నెం.14లోతట్టుప్రాంతంలో గత రాత్రి నుండి కొన్ని గృహాలలో నాలా పొంగి ప్రవేశించడంతో మాన్సూన్ ఎమర్జెన్సీ టీంతో పాటు డీ.ఆర్.ఎఫ్ టీంలు మోటర్లు పెట్టి నీటిని బయటకు పంపించారు.నాలా పొంగటానికి గల కారణాలను కమిషనర్ లేక్ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. హుస్సేన్ సాగర్ నాలాలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో లోతట్టు ప్రాంతాలకు వరద నీరు వచ్చినట్టు అధికారులు కమిషనర్‌కు వివరించారు. రాత్రి నుండి మోటార్ల ద్వారా నీటిని తరలించడం వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని అధికారులు కమిషనర్‌కు తెలిపారు. కమిషనర్ అధికారులకు పలుసూచనలు, సలహాలను అందించారు.

ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని హిమాయత్ నగర్ స్ట్రీట్ 14లో ఆదర్శ్ బస్తీలో నాలా రిటర్నింగ్ వాల్ నిర్మాణాన్ని రాబోయే రోజుల్లో చేపట్టి వరద నీరు రాకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. నాలుగు రోజుల పాటు కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు మంత్రి కేటీఆర్ సమీక్షిస్తున్నారని కమిషనర్ తెలిపారు. వర్ష ప్రభావం ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా 24 గంటల పాటు 428 మాన్సూన్ ఎమర్జెన్సీ బృం దాలతోపాటు 27డీ.ఆర్.ఎఫ్ బందాలు పని చేస్తున్నాయని కమిషనర్ తెలిపారు. ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి తద్వారా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు క్షేత్ర స్థాయిలో అప్రమత్తం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట ఈవీ డీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, సికింద్రాబాద్ జోనల్ ఎస్.ఈ. అనిల్ రాజ్, డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, జోనల్ కమిషనర్ రవి కిరణ్, లేక్ సీ.ఇ. సురేష్ కుమార్, యస్ ఈ ఆనంద్ తోపాటు తదితర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నాలా స్లాబ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

• కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-అడిక్‌మెట్

వరద ముంపు సమస్య తలెత్తుతున్న నేపథ్యంలో నాలా స్లాబ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ,జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, అధికారులకు సూచించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌తో కలిసి అడిక్‌మెట్ డివిజన్ లోని లోతట్టు ప్రాంతాలైన పద్మ కాలనీలో పర్యటించారు. నాలా స్లాబ్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు నాలలు పొంగి పొర్లుతున్న నేప థ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఆస్తి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశి ంచారు. హైదరాబాద్ నగరం లో ఇంకా రెండు రోజులు బారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.పద్మ కాలనీ నాలా వరద ముప్పు సమస్య తలెత్తే నేపథ్యంలో నాలా స్లాబ్ పనులు యుద్ధ ప్రతిపాదికను పూర్తి చేయాలని అధికారుల ఆదేశించారు. ఎక్కడ పరిశుద్ధ సమస్య తలే తకుండా చూడాలని రోడ్లపై ఉన్న మట్టి కుప్పలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్, డిఈ సన్నీ, ఏఎమ్‌హెచ్‌ఓ మైత్రి బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు జయసింహ, రితీష్, అస్లాం, నేత శీను, మాధవ్, మనోహర్, వల్లాల శ్రీనివాస్ యాదవ్, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన సదస్సు



• చర్చా కర్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వైద్య నిపుణులు, పరిశోధకులు

నవతెలంగాణ-బేగంపేట్

నగరంలోని తలసేమియా అండ్ సికిల్‌సెల్ సొసైటీ (టీఎస్ సీఎస్), మర్హం ఎన్జీఓ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హెూటల్ మారిగోల్డ్ వేదికగా తలసేమియాకు సంబంధించి"వన్‌ఆఫ్‌ఇట్స్‌కైండ్‌సపోర్ట్‌అండ్‌స్క్రీనింగ్' సింపోజియాన్ని నిర్వహించాయి. ప్రపంచ వ్యాప్తంగా అనేక కుటుంబాలను ప్రభావితం చేస్తూ అతి క్లిష్టమైన సమస్యగా మారిన తలసేమియా వ్యాధి పైన అవగాహన పెంచ డంతో పాటు తలసేమియా రహిత భవిష్యత్తును నిర్మించడం కోసం "ప్రినేటల్ డయాగ్నసిస్' (నివారణలో భాగంగా తలసేమియాను ప్రెగ్నెన్సీ సమయంలోనే గుర్తించే ప్రక్రియ) ప్రాముఖ్యతను తెలియజేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తలసేమియా అనేది జన్యు పంమైన రక్త వ్యాధి., ఇది తలసేమియా సంక్రమించిన కుటుంబాలకు పెను సవాళ్లను కలిగిస్తుందని, సరైన సమయంలో స్క్రీనింగ్, ప్రినేటల్ డయాగ్నసిస్‌తో తలసేమియా-బాధిత పిల్లల జననాన్ని నిరోధించి రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిం చవచ్చున్నారు. ఈ సింపోజియంలో భాగంగా తల సేమియా నివారణపై వైద్యరంగంలోనీ ప్రముఖ వైద్యులు, ఆరోగ్య నిపుణులు అమూల్యమైన సమాచారాన్ని పంచుకున్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, కన్సల్టెంట్ ప్రసూతి నిపుణులు అండ్ గైనకాలజిస్ట్ క్లినికల్ డైరెక్టర్, హెచ్‌ఓడీ-కేర్ ఆస్పత్రి డాక్టర్ మంజులా అనగాని, లిటిల్ స్టార్ హాస్పిటల్ పీడియాట్రిక్ హెమటాల జిస్ట్ అండ్ అంకాలజిస్ట్ డా. రమణ దండముడి, షాలినీ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ప్రసూతి వైద్య నిపుణులు, గైనకాలజిస్ట్ డా. బాలంబ, అడిషనల్ ప్రొఫెసర్, నిమ్స్ మెడికల్ జెనెటిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్. ప్రజ్ఞా రంగనాథ్, అంకురా హాస్పిటల్ కన్సల్టెంట్ పీడియాట్రిక్స్ డా. కృష్ణ ఆర్ ఎస్ వీ, యశోద హాస్పిటల్ తదితరులు పాల్గొన్నారు. టీఎస్‌సీఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ మాట్లాడారు.

సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలం

• కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి రామన్‌గౌడ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఆదర్శనగర్ బస్తీలోకి నాలా నీరు చేరుతుందని మూడు నెలల క్రితమే అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్యను పరిష్కరించడంలో అధికారులు వైఫల్యం చెందారని హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి రామన్ గౌడ్ అన్నారు. నాలాలోని వ్యర్థాలను ఇరిగేషన్ అధికారులు తొలగించకపోవడంతోనే బస్తీలోకి నీరు ప్రవహించిందని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు నాలాలోని వ్యర్థాలను తొలగించకుండానే చేసిన పనికి బిల్లులు తీసుకుంటున్నారని వాపోయారు. లోతట్టుగా ఉన్న ఆదర్శ బస్తీలో దాదాపు 50 ఇండ్లు నీట మునిగి ప్రజలు నిరాశ్రయులు అయ్యారని వెల్లడించారు. వర్షం నేటికీ తగ్గుముఖం పట్టకపోవడంతో వీరందరికీ కేశవ మెమోరియల్ స్కూల్ లో పునరావాసం కల్పించేందుకు ఏర్పాట్లు చేశామని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా బస్తీని పరిశీలించేందుకు వచ్చిన జీహెచ్ఎంసి జలమండలి అధికారులను కార్పొరేటర్ తీవ్రంగా ప్రశ్నించారు. ఈ సమయంలో అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. తప్పు మీదుంటే మీదనే వాదించుకున్నారు. చివరగా కార్పొరేటర్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ప్రజలకు అండగా నిలబడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. బస్తీలోని నీటిని డీఆర్ఎఫ్ సిబ్బందితో మోటారు సహాయంతో నాళాలోకి ఎత్తిపోశారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికి రణ్, డిప్యూటీ కమిషనర్ మారుతీ దివాకర్, సీఇ సురేష్, ఎస్ఈ ఆనంద్, ఈఈ శంకర్ రాజు, మున్సిపల్ ఈఈ ప్రే మ్ రాజు, డిఎంహెచ్‌ఓ జ్యోతి బాయ్, జల మండలి డిప్యూటీ మేనేజర్ సన్యాసిరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో మంచినీటి సమస్యకు పరిష్కారం

• ఎమ్మెల్యే ముఠాగోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్ :

ముషీరాబాద్‌లో గత 20 సంవత్సరాలుగా నెలకొన్న మంచినీటి సమస్యను కొత్త మంచినీటి పైపులైన్లు వేసి పరిష్కరించామని స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. శుక్రవారం ముషీరాబాద్‌లో రూ.3.50 లక్షలతో చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, జలమండలి డీజీఎం మోహన్ రాజ్ తో కలిసి ఎమ్మెల్యే ముఠాగోపాల్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న లోప్రెషర్ సమస్య పరిష్కరించేందుకు జలమండలి ఎండీ దానకిషోర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించామన్నారు. త్వరలో డ్రయినేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు టి. సోమన్, ముషీరాబాద్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్ ప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బద్రినారాయణ, కంచి కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్ దయాళ్రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు బల్లా ప్రశాంత్, రాజు, క్రాంతి, గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధరాచారి, మహంకాళి దేవాలయ కమిటీ చైర్మన్ ఎయిర్టెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శుక్రవారం అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గోల్నాక డివిజన్ పరిధిలోని ఖాజాగరిబ్ నగర్, కృష్ణా నగర్, లంక, శాస్త్రీ నగర్, కమలా నగర్ ప్రాంతాల్లో పర్యటించి, రోడ్లపై నీరు నిలిచిన విధులను, కాల్వలు, డ్రయినేజీలు, అక్కడక్కడా కూలీన చెట్లను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డపాక రాము, నర్సింగ్ యాదవ్, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రమాదకరంగా మారిన మోడీ పాలన



• ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రధాని మోడీ పాలనా మహిళలకు ప్రమాదకరంగా మారిందని, బీజేపీ పాలిత మణిపూర్ రాష్ట్రంలో గిరిజన మహిళలపై జరిగిన సామూహిక అత్యాచారం ఇందుకు ఉదాహరణ అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. శుక్రవారం హిమాయత్‌నగర్, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలపై సామూహిక అత్యాచారం చేసి, నగ్నంగా ఊరేగించిన పాశవిక ఘటన, రావణకాష్టంలా రగులుతున్న హింసా కాండకు ప్రధాని మోడీ, హెూం శాఖ మంత్రి అమిత్ షాలు బాధ్యత వహించి, మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అవమానకర ఘటనపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఉద్దేశించి 'మీరు చర్యలు తీసుకో కుంటే, మేం స్పందించాల్సి ఉంటుందన్నారు. సుప్రీం కోర్టు తీవ్రంగా హెచ్చరించడం సిగ్గుచేటన్నారు. బీజేపీ డబల్ ఇంజిన్ సర్కార్‌లు రామ రాజ్యం పాలనా పేరుతో కౌరవరాజ్య పాలనా కొనసాగిస్తూ విభజన, విద్వేష రాజకీయాలను, ప్రతీకార దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడం అత్యాచారాలు, హత్యలతో వంద మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, భారీగా ఆస్తి నష్టం వాటిల్లినప్పటికీ బీజేపీ పరిపాలిస్తున్న రాష్ట్రంపై ప్రధానమంత్రి మోడీ మౌనం వహించి, ఇప్పుడు ఘటన తరువాత స్పందించి మొసలి కన్నీరు కార్చడం దుర్మార్గమన్నారు. 'బేటీ బచావో, బేటీ పడావో' అనే ప్రధాని మోడీ నినాదం 'భేటీ చూపవు, బలాత్కారి బచావో' గా మారిందని, బీజేపీ ప్రభుత్వాల పాలనలో మహిళలకు భద్రత కరువైందని ఆరోపించారు.మణిపూర్ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని, అత్యాచారానికి గురైన బాధితులకు వారి కుటుంబ సభ్యులకు న్యాయం చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు శోభన్ భూక్యా, సోలొమన్ రాజ్, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ రణధీర్ సింగ్ రానా, నేతలు టి.రాకేష్ సింగ్, ఆఫసబేగం, రుద్రాక్ష మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



మణిపూర్‌లో ఆగని మంటలు : కె.ఎస్.శిల్పాచారి

ఓయూ :

దేశంలో మతోన్మాదం రెచ్చిపోయి మానవత్వం మరిచిపోయి సభ్య సమాజం సిగ్గుపడేలాగా మణిపూర్‌లో గత 80 రోజులుగా జరుగుతున్న మారణ హెూమానికి బీజేపీ ప్రభుత్వం కారణమని, వారి పాలనలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని వైయస్ఆర్ తెలంగాణ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కేఎస్ శిల్పాచారి అన్నారు. మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న రాజకీయ రాక్షస క్రీడా దేశ ప్రజలు చూస్తున్నారన్నారని, ఈ దేశంలో మహిళల పట్ల కనీస గౌరవం లేకుండా ఇద్దరు మహిళలను నడిరోడ్డు మీద అఘాయిత్యం చేసి వీడియోలు తీసి సభ్యసమాజం సిగ్గుపడేలా ప్రవర్తిస్తున్న వారిని అరెస్టు చేయకుండా ప్రభుత్వం ఏం చేస్తుందని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా టీఆర్ఎస్, బీజేపీ నాయకులు కళ్ళు తెరిచి ఈ దేశంలో జరుగుతున్న ఈ అరాచకాన్ని వ్యతిరేకిస్తూ ఖండిస్తూ దేశం రాష్ట్రం ఏకమై ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రయత్నాన్ని కొనసాగించాలని కోరారు.



మణిపూర్‌లో ఘర్షణను నిలువరించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలం

• గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్

మణిపూర్ రాష్ట్రంలో విధ్వంస ఖండను ఆపి వెంటనే శాంతిని నెలకొల్పాలని ఓయూ విద్యార్థి సంఘాలు అన్నారు. రాష్ట్రంలో జాతుల మధ్య ఘర్షణను నిలువరించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. శుక్రవారం నరేంద్ర మోడీ ఆకృతి బొమ్మను వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదుట దహనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ. దాదాపు మూడు నెలల నుండి మణిపూర్ రాష్ట్రంలో మైతి, కూకి జాతుల మధ్యలో ఘర్షణ జరుగుతున్నదని ఆ ఘర్షణలను నిలువరించడంలో మణిపూర్ రాష్ట్రంలో అధికారంలో బిజెపి ప్రభుత్వం అదేవిధంగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆ ఘర్షణలను రాజకీయాల కోసం ఉపయోగించుకుంటుందని ఈ సందర్భంగా శరత్ నాయక్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య, డీబీఎస్ఏ రాష్ట్ర కో ఆర్డినేటర్ దర్శన్, ఫిలాసఫీ రీసెర్చ్ స్కాలర్ ఆజాద్,టీఆర్ఎస్వీ ప్రధాన కార్యదర్శి రమేష్ ముదిరాజ్, పీడీఎస్‌యూకార్యదర్శి సుమంత్, ఎస్ఎస్‌యు విద్యార్థి నాయకులు సతీష్, అంస ఓయూ అధ్యక్షులు సైదులు,గిరిజన శక్తి ఓయూ అధ్యక్షులు హన్మంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీల 50శాతం రిజర్వేషన్ కల్పించాలి

• జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య
• ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద భారీ ప్రదర్శన..
• మద్దతు తెలిపిన వివిధ పార్టీల పార్లమెంట్ సభ్యులు



నవతెలంగాణ-అడిక్‌మెట్

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు పార్లమెంట్ సభ్యులు బీఎస్పీ ఫ్లోర్ లీడర్ శ్యామ్ సింగ్, పార్లమెంట్ సభ్యులు బినాయ్ విశ్వాస్, సీపీఐ జాతీయ నాయకులు నారాయణ, మల్లు రవిలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్లు పెట్టాలని, 30 సం.రాలుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ దేశంలో బీసీ లను బిచ్చగాళ్ళను చేశారని విమర్శించారు. బి.సిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండ గొర్రెలు-బర్రెలు పందులు -పెన్షన్లు ఇచ్చి ఓట్లు వేయించుకొని బీసీలను శాశ్వత బిచ్చగాళ్ళను చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ రంగంలో 14 శాతం దాటలేదని కేంద్ర ప్రభుత్వం ఇటీ వల సేకరించిన గణాంకాల ద్వారా తెలిందన్నారు. ఈ మహా ధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ కృష్ణ,ప్రధాన కార్యదర్శి నందగోపాల్ రాజ్ కుమార్ ,గోవింద్, కరివేణుమాధవ్, బాషయ్య , మోడీ రామ్ తదితర నాయకులు పాల్గొన్నారు

బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

• జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం డిమాండ్

నవతెలంగాణ-అంబర్‌పేట

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. బీసీ బడ్జెట్ ను రూ.2 లక్షల కోట్లకు పెంచాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుచేసి రూ.2 లక్షల కోట్లతో ప్రతేక అభివృద్ధి పథకం ప్రకటించాలన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన శుక్రవారం కాచిగూడలోని అభినందన్ హెూటల్లో రాష్ట్ర బీసీ కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు గుజ్జ సత్యం మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని, అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని ధ్వజమేత్తారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యం మాట్లాడుతూ బీసీల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలని, త్వరలో జరగబోయే జనాభా గణనలో కులాల వారి లెక్కలు తీయాలని డిమాండ్ చేసారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ ను తొలగించాలని డిమాండ్ చేసారు. బీసీ సమస్యల పరిష్కారానికి రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో వచ్చే నెల 8న వేలాది మందితో చలోఢిల్లీ పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్ట నున్నట్లు పేర్కొ న్నారు. ఈ సమావేశంలో తెలంగాణ కన్వీనర్ లాల్ కృష్ణ, విద్యార్థి నాయ కుడు అనంతయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌటుపల్లి సురేష్ తెలంగాణ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ జలపల్లి కిరణ్, హైదరాబాద్ గ్రేటర్ ఉపాధ్య క్షులు పండరినాథ్, ములుగు జిల్లా అధ్యక్షుడు మురళి, మట్ట జయంతి బీసీ కోర్ కమిటీ మెంబెర్స్, బీసీ సీనియర్ లీడర్స్, విద్యార్థి నాయకులూ, యువజన విభాగం, మహిళా విభాగం, బీసీ జేఏసీలు తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ సెంట్రల్ లైబ్రరీ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా హనుమాన్, అజీజ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆదేశాల మేరకు జిల్లా వైస్ ప్రెసిడెంట్ కుర్రాడి శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా స్టేట్ సెంట్రల్ లైబ్రరీ(అఫ్జల్ గంజ్) యూనిట్ ఎలక్షన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. యూనిట్ అధ్యక్షుడిగా కేసరి హనుమాన్, ఉపాధ్యక్షులుగా రసూరి రాకేష్, ఎస్. ప్రతాప్, కార్యదర్శిగా సయ్యద్ అబ్దుల్ అజీజ్, సంయుక్త కార్యదర్శిగా ఎం.ఉమామహేశ్వర్ రెడ్డి, కోశాధికారిగా సయ్యది ఇంతియాజుద్దీన్, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎం.ధర్మేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కుమారి ఎమ్.రమ్యశ్రీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్‌గా వి. శ్రీనివాసరావు, కె. విజయచందర్ నియమితు లయ్యారు. అనంతరం యూనిట్ సభ్యులందరూ కలిసి డాక్టర్ ముజీబ్, ఎన్నికల అధికారి కుర్రాడి శ్రీనివాస్, గెజిటెడ్ అధికారి వెంకట్ రెడ్డిని నాంపల్లి గృహకల్ప కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ప్రభుత్వంలో ఉందని, మనందరం కలిసి బంగారు తెలంగాణ సాధనలో కృషిచేసి మరింత అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కట్టుకున్న భర్తే తన భార్యను అతి దారుణంగా కొబ్బరి కాయ లు కొట్టే కత్తితో నరికి హత్య చేసిన ఘటన బోయినపల్లి పరిధిలో చోటు చేసు కుంది.బోయినపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. అమలాపురం కామనగరువు మండలం కరకైపేట గ్రామానికి చెందిన నాగవరపు సత్యనారా యణ అలియాస్ సత్తిబాబు (56) ఆదే గ్రామానికి చెందిన ఝాన్సీరాణి(42)ని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. సత్యనారాయణ పని చేయ కుండా జల్సాలకు అలవాటుపడడమేకాక భార్యపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో తన పిల్లలను న్యూబోయినపల్లి నూతనా కాలనీలో ఉండే తమ్ముడు కిరణ్ వద్ద వదిలిన ఝాన్సీరాణి 2012 నుంచి కువైట్ వెళ్లి ఇండ్లలో పనిచేస్తుంది. అప్పుడప్పుడొచ్చి పిల్లలను చూసుకొని వెళ్లిపోయేది. 8 నెలల క్రితం నగరానికి వచ్చింది. కొద్దినెలల క్రితం నగరానికి వచ్చిన సత్యనారాయణ చిల్కానగర్‌లో నివాసముంటున్నాడు. భర్తను ఝాన్సీరాణి తెలిసినవారి సహాయంతో పటాన్ చెరులోని ఎస్ఎం డీసీలో వాచ్మెన్‌గా పనిలో చేర్పించి తమ్ముడి ఇంటికి వచ్చింది. 14న పని మానేసి న్యూబోయినపల్లికి వచ్చిన భర్తను ఝాన్సీరాణి నిలదీసి పనిచేయకుంటే విడాకులు ఇస్తానని చెప్పడంతో కోపోద్రిక్తుడైన సత్యనారాయణ బయటకు వెళ్లి కొబ్బరికాయలు కొట్టే కొడవలితో నరికి హత్య చేశాడు. అడ్డుపడ్డ భార్య తమ్ముడు కిరణ్ పైనా దాడికి దిగాడు. ఝాన్సీరాణి మృతిచెందిందని నిర్ధారించుకున్నాక అక్కడినుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని బుధవారం అతని స్వగ్రామంలో అదుపులోకి తీసుకుని విచారించి రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుడిపై గతంలో 4 కేసులు నమోదుచేసిన అమలాపురం పోలీసులు అతనిపై రౌడీషీటర్ తెరిచారు. ఆయా కేసుల్లో పలుమార్లు జైలుకెళ్లి వచ్చాడని పోలీసులు వెల్లడించారు.

రజినిసాయిచంద్‌ను కలిసిన మహిళా నాయకులు

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



నాంపల్లిలోని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్ వేద రజనిసాయిచంద్‌ని మహిళా నాయకులు కలిశారు. నాంపల్లి నియోజకవర్గం రెడ్డిహిల్స్ డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలు డి.నందిని, ప్రధాన కార్యదర్శి ఏ.అనిత తదితరులు బొకే అందించిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మురుగు నీటిలోనే ప్రజల జీవితాలు

● మరుగున పడిన రహదారులు
● రహదారులన్నీ గుంతలమయం
● రహదారులన్నీ జలదిగ్బంధంలో అనే నవతెలంగాణ శీర్షికకు స్పందన



నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్రంలో గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కొనసాగుతోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పం జాగుట్ట, అమీర్‌పేట, బోరబండ, కూకట్‌పల్లి, మాదాపూర్, ఫిల్మ్‌నగర్ తదితర ప్రాంతాల్లో లోతట్టు కాల నీలు జలమయం అయ్యాయి. చాలా చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడ టంతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నా రు. వర్షా నికి రహదారులన్నీ గుం తల మయం ఎటు చూసినా మురుగునీ రు మోకాలు లోతు రహదారు లపై బహిరంగంగానే దర్శనమి స్తున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పర్యటిస్తున్న పరిస్థితి ప్రజా సరిపడా సిబ్బంది లేక అన్ని ప్రాంతాల్లో పర్యటి ంచలేని పరిస్థితి నెలకొంది.ప్రజాప్రతినిధు లు, అధికారులు వస్తారని, సమస్యను పరిష్కరిస్తారంటూ సింపుల్‌చెప్పి వెళ్లిపోయారు. దినసరి కూలీలు వివిధ రకాల పనిచేసే కార్మికులు ప్రయివేటు టీచర్లు చాలీచాలని వేతనాలతో పనిచేసే ప్రయివేటు ఉద్యోగులు భగభగమం టున్నా నిత్యావసర సరుకుల ధరలు చూసి కూడు తినే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. ఉపాధికి వరుణ దేవుడు అడ్డొవచ్చి ప్రభుత్వం సెలవు ప్రకటించి తాము బ్రతికేది ఎట్లా అంటూ ఆవేదనను వ్యక్తపరిచారు.




వాహన చోదకులు పట్టపగలు చుక్కలే

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షా లకు రోడ్లు, రహదారులన్నీ గుంతల మ యంగా మారాయి.ట్రాఫిక్‌లో ఏ గుంతలో ఎప్పుడు పడతామన్న భ యంతో వాహనదారులు ఇబ్బం దులకు గురవు తున్నారు. కొన్ని చోట్ల అర్ధరాత్రి మ్యాన్ హెూల్ ఓపెన్ చేసి పెట్టడం వల్ల కొంత పలువురు ప్రమాదాలకు గురవు తున్నారు. అధికా రులు పాలకులు బయ టికి రావద్దని చెప్తున్న ఉద్యోగాలరీత్యా, బయట అవస రాల నిమిత్తం బయటకు రాక తప్పడం లేదని పలువురు తెలుపుతున్నారు. తిరగడానికి మార్గా లున్న తిరగలేని పరిస్థితి ఏర్పడడం వలన కొందరు నాయ కులు ప్రజాప్రతినిధులు స్థానిక బస్తీ లీడర్లు చొరవ చూపడంలో బస్తీ ప్రజలకు నిరాశ మిగిలించింది. అత్యవ సర పరిస్థితులు ఏర్పడితే పాలకులు ప్రకటనలకే పరిమి తం కాకుండా ప్రత్యక్షంగా పర్యటించి పరిస్థితులను గమ నించి అధికారులు తమ సమస్యలను పరిష్కరిస్తే సకాలం లో పనులు పూర్తిచేస్తే ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావని విశ్లేషకులు నిపుణులు, ప్రతి పక్ష నాయకులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. నవతెలంగాణ కథనా నికి స్పందించి రహదారిపై ఏర్పడ్డ గుంతను స్థానికులే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలు ఆ వైపున వెళ్లకుండా సూచనలు చేశారు.

అబద్ధాలు చెప్పి.. నిందలు వేసి...

దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఏండ్లు గడుస్తున్నా మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. సమాజంలో, కుటుంబంలో ఎలాంటి తప్పు జరిగినా దానికి మహిళలనే కారణం చేస్తున్నారు. అదే మంచి జరిగితే మాత్రం ఏ ఒక్కరూ ఆమెను ప్రశంసించరు. ఇక ఇంట్లో ఆరోగ్య సమస్యలు వచ్చినా, ఆర్థిక సమస్యలు వచ్చినా కొత్తగా ఇంట్లోకి అడుగు పెట్టిన కోడలిపైనే నెట్టేస్తారు. ఎందుకంటే మహిళలంటే అంత చిన్నచూపు. ఇక అబద్ధాలు చెప్పి పెండ్లి చేసుకుని నిందలు వేసే వారు కూడా ఎందరో ఉన్నారు. అలాంటి ఓ సమస్యతో ఐద్వా అదాలత్‌కు వచ్చింది తబుసుం. అసలు ఆమె సమస్య ఏంటో, అది పరిష్కారం అయ్యిందో లేదో తెలుసుకుందాం...



తబుసుంకు 24 ఏండ్లు ఉంటాయి. సోహిల్‌తో పెండ్లి జరిగి ఏడాది అవుతుంది. అప్పుడే సమస్యలేంటి అని ఆశ్చర్యపోతున్నారా..? ఆ విషయానికే వస్తున్నాను. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో పెండ్లి అనే బంధంలో అడుగుపెట్టింది తబుసుం. అయితే పెండ్లి అయిన రోజు నుండే భర్త ఏవో మాత్రలు తీసుకోవడం గమనించింది. 'ఈ మాత్రలు ఎందుకు వేసుకుంటున్నారు? ఆరోగ్యం బాగోలేదా' అని అడిగింది. దానికి అతను 'అవును పెండ్లిలో అటూ ఇటూ తిరగడం, ఆ నీరూ ఈ నీరూ తాగడం వల్ల స్కిన్ ప్రాబ్లెమ్స్ వచ్చాయి. అందుకే ఈ మందులు వేసుకుంటున్నాను' అని చెప్పాడు. ఆమె కూడా భర్త మాటలు నమ్మేసింది.

ఎన్ని రోజులు గడిచినా ఆ మాత్రలు అతను రోజూ వాడుతూనే ఉన్నాడు. రెండు నెలల తర్వాత ఆమెకు కూడా చర్మ సమస్యలు వచ్చాయి. డాక్టర్ దగ్గరకు వెళ్ళింది. అయితే ఆమెకు ఇచ్చిన మాత్రలు వేరుగా ఉన్నాయి. వాటిని వాడినా ఆమె సమస్య తగ్గలేదు. దాంతో ఆమెను పుట్టింటికి పంపించారు. నెల తర్వాత సమస్య తగ్గడంతో అత్తింటికి తిరిగి వచ్చింది. అయితే ఇక్కడికి వచ్చిన తర్వాత సమస్య తిరిగి మొదలైంది. అత్త, ఆడపడుచులు, బావలు అందరూ కలిసి 'రోగిస్టు అమ్మాయిని ఇచ్చి పెండ్లి చేశారు' అంటూ గొడవ చేసి ఆమెను కొట్టి పంపించారు. తబుసుం తిరిగి డాక్టర్ దగ్గరకు వెళ్ళింది. మూడో నెల అని చెప్పింది డాక్టర్. అలాగే 'ఈ స్కిన్ ప్రాబ్లమ్ నీకు ఎందుకు వస్తుంది. ఎన్ని మందులు వాడినా మళ్ళీ వస్తుంది. పైగా ఇప్పుడు నువ్వు గర్భవతివి కాబట్టి నీ కడుపులోని బిడ్డకు ఇబ్బంది లేకుండా మందులు వాడాలి' అంటూ కొన్ని టెస్టులు చేశారు. అందులో ఆమెకు ఏ సమస్యా లేదు అని వచ్చింది.

'నీ భర్తను పిలిస్తే నేను ఆయనతో మాట్లాడి ఆయనకు కూడా కొన్ని టెస్టులు చేయిస్తాను' అని చెప్పింది డాక్టర్. ఇదే విషయం అతనికి చెబితే వినిపించుకోలేదు. 'నాకు ఎలాంటి సమస్యా లేదు. నేను ఎందుకు పరీక్షలు చేయించుకోవాలి' అంటూ వెళ్ళిపోయాడు. 'ప్రతి నెలా వచ్చి రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవాలి' అని డాక్టర్ తబుసుంకు చెప్పింది. అయితే ఆమెకు తర్వాత కాలంలో వేరే ఆరోగ్య సమస్యలు రావడంతో డాక్టర్ హెచ్‌ఐవీ పరీక్ష చేసింది. అందులో పాజిటివ్ వచ్చింది. ఈ విషయం తబుసుంకు చెప్పి 'మీ ఆయనకు కూడా తప్పకుండా పరీక్ష నిర్వహించాలి, కాబట్టి ఆయనను తప్పకుండా తీసుకురండి' అన్నది డాక్టర్. కానీ సోహిల్ రాలేదు. 'నాకు ఎలాంటి జబ్బు లేదు. నేను రాను' అంటూ పాత పాటే పాడాడు. అయినా డాక్టరు చేయించుకోవల్సిందే అని హెచ్‌ఐవీ పరీక్ష చేశారు. అతనికీ పాజిటివ్ వచ్చింది. దాంతో 'నేను వేరే దగ్గర టెస్ట్ చేయించుకుంటాను' అని వెళ్ళిపోయాడు.

డాక్టర్ తబుసుంతో 'ఇద్దరికీ పాజిటివ్ వచ్చింది కాబట్టి పుట్టబోయే బిడ్డకు కూడా వచ్చే అవకాశం ఉంది. నీకు ఇప్పుడు ఐదవ నెలనే కాబట్టి ఆలోచించుకోండి' అని చెప్పింది. సోహిల్ కుటుంబ సభ్యులు 'తబసుం మాకు వద్దు. ఆమె వల్ల మాకు కూడా ఆ వ్యాధి వస్తుంది' అన్నారు. తబుసుం కుటుంబ సభ్యులు ఆమెకు అబార్షన్ చేయించారు. తర్వాత తన పరిస్థితి ఏంటో ఆమెకు అర్థం కాలేదు. సలహా కోసం ఐద్వా అదాలత్‌కు వచ్చింది.

మేము సోహిల్‌కు వాళ్ళ అమ్మకు ఫోన్ చేసి పిలిచి మాట్లాడాము. 'ఆమె వల్ల మా అబ్బాయికి ఈ రోగం వచ్చింది. అలాంటి అమ్మాయి మాకు వద్దు. ఆమెకు విడాకులు ఇస్తాం. ఆమె మాతో ఉంటే మా కుటుంబ సభ్యులందరికీ ఆ వ్యాధి వస్తుంది' అంది సోహిల్ తల్లి. అమె అలా అనడంతో మేము సోహిల్‌ని ఒక్కడినే పిలిచి మాట్లాడితే అసలు విషయం తెలిసింది. అతనికి పెండ్లికి ముందు నుంచే హెచ్‌ఐవీ ఉంది. దాని కోసమే అతను ప్రతి రోజూ మాత్రలు వాడుతున్నాడు. ఆ విషయం తబుసుంకు తప్ప ఇంట్లో అందరికీ తెలుసు.



మేము అతని తల్లిని పిలిచి 'మాత్రల గురించి తబుసుం అడిగితే నీ కొడుకు అబద్ధాలు చెప్పాడు. ఇప్పుడు ఆమె వల్లే రోగం వచ్చిందని విడాకులు ఇస్తాం అంటున్నారు. ఇప్పుడు మళ్ళీ టెస్టులు చేయించి అసలు ఈ రోగం ఎవరి నుండి ఎవరికి వచ్చిందో తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. కచ్చితంగా నీ కొడుకు వల్లే తబుసుంకు హెచ్‌ఐవీ వచ్చిందని నీకూ తెలుసు. నువ్వు ఒప్పుకోకపోతే మేమే టెస్టులు చేయిస్తాం. అబద్ధాలు చెప్పి పెండ్లి చేసుకున్నందుకు, ఆమె జీవితం నాశనం చేసినందుకు జైలుకు వెళ్ళాల్సి వస్తుంది' అన్నారు.

'సరే మేడం, ఇప్పుడు మమ్మల్ని ఏం చేయమంటారు' అంది. ఇద్దరికీ పాజిటివ్ వచ్చింది కాబట్టి ఇద్దరూ కలిసి ఉంటేనే మంచిది. పాజిటివ్ వచ్చిన తర్వాత ఆమె మరో పెండ్లి చేసుకునే అవకాశం కూడా లేదు' అన్నారు. కానీ వాళ్ళు మాత్రం విడాకులు తీసుకుంటామన్నారు. మా దగ్గర కాకపోతే వాళ్ళ కమ్యూనిటీ దగ్గరకు వెళ్ళైనా విడాకులు తీసుకుంటాం' అని కచ్చితంగా చెప్పారు. ఎంత చెప్పినా వాళ్ళు వినకపోయే సరికి తబుసుం కూడా 'అలాంటి వ్యక్తితో నేను ఉండలేను మేడం, నా అరోగ్యాన్ని కాపాడుకుంటూ బతుకుతాను' అంది. దాంతో ఆమె పెండ్లి సమయంలో ఇచ్చిన బంగారంతో నష్టపరిహారంగా రూ.5 లక్షలు ఇచ్చి విడాకులు తీసుకోమన్నాం. దానికి వాళ్ళు అంగీకరించారు.

'ఆమె వల్ల మా అబ్బాయికి ఈ రోగం వచ్చింది. అలాంటి అమ్మాయి మాకు వద్దు. ఆమెకు విడాకులు ఇస్తాం. ఆమె మాతో ఉంటే మా కుటుంబ సభ్యులందరికీ ఆ వ్యాధి వస్తుంది' అంది సోహిల్ తల్లి. అమె అలా అనడంతో మేము సోహిల్‌ని ఒక్కడినే పిలిచి మాట్లాడితే అసలు విషయం తెలిసింది. అతనికి పెండ్లికి ముందు నుంచే హెచ్‌ఐవీ ఉంది. దాని కోసమే అతను ప్రతి రోజూ మాత్రలు వాడుతున్నాడు. ఆ విషయం తబుసుంకు తప్ప ఇంట్లో అందరికీ తెలుసు.

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

– వై. వరలక్ష్మి,
9948794051

జుట్టు రాలిపోతుంటే..?



జుట్టు రాలిపోవడం ఈ రోజుల్లో సర్వసాధారణమైన విషయం.. ఎందుకంటే ఒకప్పుడు ఎక్కువ శాతం తలకు నూనె పెట్టుకునేవారు. ఈ రోజుల్లో చాలా మంది తలకు నూనె పెట్టడానికి ఇష్టపడటంలేదు. అయితే ఇలా చేయడం ఎంత పెద్ద సమస్యో జుట్టు రాలిపోయాక కానీ అర్థం కాదు. అందుకే తప్పనిసరిగా నచ్చిన ఏదో ఒక నూనెను రాయడం జుట్టుకు చాలా అవసరం. ఇలా చేస్తే బ్లడ్ సర్కులేషన్ పెరిగి జుట్టు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. గోరువెచ్చని నూనెతో మసాజ్ చేస్తే చాలా మంచిది. మసాజ్ చేశాక ఓ వెచ్చని టవల్ కొన్ని నిమిషాల పాటు తలకు చుట్టుకోండి. దీని వల్ల జుట్టుకు మంచి కండిషనింగ్ వస్తుంది. దీనితో పాటు...

❑ జుట్టు రాలకుండా ఉండేందుకు కలబంద చక్కని ఔషధం. ఇది మీ తలలో తేమను, పోషకాలను పెంచేలా చేసి జుట్టు పెరిగేలా చేస్తుంది. అలోవెరాను రాసి ఓ గంటపాటు వదిలేశాక తలస్నానం చేయండి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

❑ కొందరు తలస్నానం చేయకుండా బయటికి కాలు పెట్టరు. కానీ రోజూ తలస్నానం చేస్తే జుట్టు త్వరగా పాడైపోతుంది. అది కూడా నూనె రాయకుండా తలస్నానం అస్సలు చేయద్దు. ఇక షాంపుల్లోని రసాయనాల వల్ల కురులకు ప్రమాదం ఎక్కువ. అందుకే రోజూ షాంపుతో తలస్నానం చేయకండి.

❑ అన్ని రకాల జుట్టు సమస్యలకు ఉసిరి చక్కని విరుగుడు. పరగడపున రోజూ ఉసిరి తినవచ్చు. ఎండబెట్టిన ఉసిరి ముక్కలు, మురబ్బా వంటివి నిల్వచేసుకుని క్రమం తప్పకుండా తినవచ్చు. ఉసిరి ఊరగాయ కూడా మంచిదే. సీ విటమిన్ పుష్కలంగా లభించే ఉసిరిలో పొటాషియం, సోడియం, మ్యాంగనీస్, ఐరన్ పుష్కలంగా ఉంటాయి.

❑ సమతులమైన ఆహారం తీసుకోవటం ద్వారా జుట్టు ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు. కంటి నిండా నిద్రపోవటం, పోషకాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తినటంతో ఈ సమస్యను అధిగమించవచ్చు. ప్రొటీన్లున్న ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వండి. నూనె పదార్థాలు, కొవ్వు అధికంగా ఉన్న ఫ్యాటీ ఫుడ్స్‌ను తగ్గించి నీరు ఎక్కువగా తాగండి.

మెటాబాలిజం మెరుగవ్వాలంటే...



జీవక్రియలను మెటబాలిజం అంటారు. అంటే శరీరంలో క్యాలరీలు ఖర్చయ్యే రేటన్నమాట. మెటబాలిజం తగ్గితే అనారోగ్యం పాలవుతారు. లావెక్కుతారు. ఏం చేసినా సన్నబడరు. క్యాలరీలు ఖర్చు కాక గుండె జబ్బులు, డయాబెటీస్, బీపీ వంటివి వస్తాయి. మెటబాలిజం అనేది అందరిలో ఒకేలా ఉండదు. ఇది ఒక్కో వ్యక్తిలో ఒక్కోలా ఉంటుంది. మెటబాలిజం పెంచాలంటే క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజులు చేయాలి. నీరు ఎక్కువ తాగాలి. దీని పెరుగుదల మనం తీసుకునే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. ఇది పెరగడానికి ఈ కింది ఆహారాన్ని తీసుకోవాలి...

గ్రీన్ టీ : టీలోని కెఫిన్ మెటబాలిజం పెరిగేందుకు సాయం చేస్తుంది. గ్రీన్ టీలో ఉన్న సుగుణాలు సమర్థవంతంగా కెలరీలను కరిగిస్తుంది.

కందిపప్పు : ఐరన్ పుష్కలంగా ఉన్న కందిపప్పు ఒంట్లో ఆక్సిజన్ సరఫరాను పెంచుతుంది. మెటబాలిజం రేటు బాగా పెరిగి శక్తి వస్తుంది.

నట్స్ : బాదం, పిస్తా వంటి నట్స్‌లో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. ప్రొటీన్లు అరగాలంటే వాటికి ఎక్కువ శక్తి అవసరమవుతుంది. ఇలా నట్స్‌ను అరిగించేందుకు ఎక్కువ శక్తి ఖర్చు చేసే క్రమంలో మీ శరీరంలో మెటబాలిజం రేటు పెరుగుతుంది. కనుక రోజూ గుప్పెడు బాదం, పిస్తా వంటివి తీసుకోవచ్చు. అయితే అతిగా తింటే శరీరంలో కొవ్వు నిల్వలు పెరిగి అనారోగ్య సమస్యలు రావచ్చు.

కారం : కారం బాగా తింటే మెటబాలిజం వృద్ధి చెందుతుంది. దీంతో కెలరీలు బాగా ఖర్చు అయ్యి, ఒంట్లో కొవ్వు తగ్గుతుంది.

చేపలు : చేపలు తినటం వల్ల మెటబాలిజం బాగా పెరుగుతుంది. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న చేపలు ఒంట్లో కొవ్వును బాగా కరిగిస్తాయి.

వీటికి దూరంగా : జీర్ణశక్తి మందగించే ఆహారానికి దూరంగా ఉండాలి. ముఖ్యంగా జంక్ ఫుడ్స్, ప్రాసెస్‌డ్ ఫుడ్, ఇన్‌స్టంట్ ఫుడ్స్ జోలికి వెళ్ళవద్దు. జంక్ ఫుడ్స్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఇలాంటి ఆహారం వల్ల శరీరంలో ఫ్రీ ర్యాడికల్స్ పెరిగి మెటబాలిజం కుంటుపడుతుంది. కాబట్టి తేలికగా అరుగుతూ, స్వల్ప పరిమాణాల్లో గ్లూకోజ్‌ను రక్తంలోకి విడుదల చేసే ఆహారానికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలి. కాబట్టి వీలైనంత వరకు ఇంట్లో వండిన ఆహారాన్నే తీసుకుంటే బాడీ మెటబాలిజాన్ని బాగా పెంచుకునే అవకాశం ఉంటుంది.

భరోసా ఇచ్చేదాకా పోరు

(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదు.. అటు కార్మికులపై కనికరం చూపడం లేదు.. చర్చలకు దిగిరావడం లేదు. మరోవైపు కార్మికులను నయానో భయానో బెదిరించి సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు, పలువురు సర్పంచులు యత్నిస్తున్నారు. అయినా వెనక్కి తగ్గని జీపీ కార్మికులు తమ బతుకులకు భరోసా ఇచ్చే వరకు తగ్గేది లేదంటూ సమ్మె కొనసాగిస్తున్నారు.

హయత్‌నగర్‌లోని మండల కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగింది. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు, సర్పంచ్‌లు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ పని విధానంలో అవగాహన లేని పనులు చేసే సమయంలో కార్మికులకు ఏమైనా ప్రమాదం జరిగితే మాదే బాధ్యత అని అధికారులు, సర్పంచ్‌లు రాసిస్తారా అని ప్రశ్నించారు. కార్మిక సంఘాల నేతలతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మె 16వ రోజుకు చేరుకుంది. ఎంపీడీఓ ఆఫీస్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. యాదగిరిగుట్ట మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల సమ్మెకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య మద్దతు తెలిపి, ఆర్థిక సహాయం అందజేశారు. రామన్నపేటలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి ప్రదర్శిని సంఘీభావం తెలిపారు. బొమ్మలరామారంలో రాస్తారోకో చేశారు. నల్లగొండ జిల్లా తిప్పర్తిలో గ్రామపంచాయతీ కార్మికుల పట్ల కార్యదర్శుల వేధింపుల అరికట్టాలని డిమాండ్ చేశారు. తిప్పర్తి కార్యదర్శి వైఖరిని నిరసిస్తూ మార్కెట్ యార్డ్ నుంచి గ్రామపంచాయతీ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నల్లగొండ నియోజకవర్గం గ్రామ పంచాయతీ కార్మికులంతా ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతెపాక వినోద్‌కుమార్ పాల్గొన్నారు. చండూర్‌లో భిక్షాటన చేశారు. పెద్దవూరలో జీపీ కార్మికుల సమ్మెకు మహాజన సోషలిస్టు పార్టీ మద్దతు తెలిపింది.

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిరసన ప్రదర్శన చేశారు. ఎడపల్లిలో డప్పు చప్పులతో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గార్లలో ద్విచక్ర వాహనాల ర్యాలీ తీశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేటలో జేఏసీ నాయకులు దున్నపోతుకు వినతిపత్రం అందజశారు. రంగారెడ్డి జిల్లా మంచాలలో పంచాయతీ కార్మికులు ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలి పారు. వీరికి సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ మద్దతు తెలిపారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట పంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టారు.

దేశాన్ని రక్షించాను..నా భార్యను కాపాడుకోలేకపోయా..

(మొదటిపేజీ తరువాయి)

ఒకరు దేశాన్ని రక్షించే సైనికుడి భార్య అన్న విషయం కూడా అంతే ఆవేదన కలిగిస్తోంది. కార్గిల్ యుద్ధంలో పాల్గొని దేశాన్ని రక్షించుకోగలిగాను కానీ.. అవమాన భారం నుంచి తన భార్యను రక్షించుకోలేకపోయానని ఆ సైనికుడు ఆక్రందన వ్యక్తం చేస్తున్నారు. సుమారు మూడు గంటల పాటు ఈ నరకయాతన కొనసాగిందని, తన భార్య ప్రాణాలతో భయటపడినా.. తీవ్ర మానసిక క్షోభ, భయాందోళనలను ఇప్పటికీ అనుభవిస్తోందని తెలిపారు. 'కార్గిల్ యుద్ధ సమయంలో ముందు వరసలో ఉండి పోరాటం చేశాను. ఇప్పుడు యుద్ధభూమి కంటే నా స్వగ్రామాన్ని భయంకరంగా భావిస్తున్నాను' అని మీడియాతో ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ తరువాత తను భార్యను, గ్రామాన్ని, ఇంటిని, తోటి గ్రామస్తులను రక్షించుకోలేకపోయానని తెలిపారు. ప్రస్తుతం ఈ దంపతులు ఒక సహాయక శిబిరంలో తలదాచుకుంటున్నారు. ఆ రోజున తుపాకులు తమ తలపై గురిపెట్టి బలవంతంగా దుస్తులు తొలగించారని, గుంపు ముందు నృత్యం చేయించారని బాధిత మహిళ తెలిపింది.

రాహుల్ పరువునష్టం కేసు విచారణ..ఆగస్టు 4కి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

నోటీసులు జారీ చేసింది. సూరత్ కోర్టు తీర్పును సమర్థిస్తూ గుజరాత్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం విచారణ జరిపింది. పరువు నష్టం కేసు దాఖలు చేసిన పూర్ణేశ్ మోడీకి, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఆగస్టు 4న జరుగుతుందని తెలిపింది.

విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ, తన తండ్రికి, సోదరునికి కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉందని, తాను ఈ విచారణ నుంచి తప్పుకుంటానని అన్నారు. తన తండ్రి కాంగ్రెస్ సభ్యుడు కాకపోయినప్పటికీ, ఆ పార్టీతో ఆయనకు అనుబంధం ఉందన్నారు. సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్విని ఉద్దేశించి మాట్లాడుతూ "సింఘ్వి మీకు కాంగ్రెస్‌తో నలభయ్యేండ్లకుపైగా అనుబంధం ఉంది. మా సోదరుడు ఇంకా రాజకీయాల్లో ఉన్నారు. ఆయన కాంగ్రెస్‌లో ఉన్నారు. నేను ఈ పిటిషన్‌పై విచారణ జరపాలని కోరుకుంటున్నారా? నిర్ణయం తీసుకోండి" అన్నారు. రాహుల్ గాంధీ తరఫున వాదనలు వినిపిస్తున్న అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ, ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ప్రతివాదుల తరఫు సీనియర్ న్యాయవాది మహేష్ జఠ్మలానీ కూడా తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. దీంతో విచారణ ప్రారంభం అయింది. సింఘ్వి వాదనలు వినిపిస్తూ రాహుల్ గాంధీ 111 రోజుల నుంచి బాధపడుతున్నారని, ఓ పార్లమెంటు సెషన్‌ను కోల్పోయారని, మరో సెషన్‌ను కోల్పోబోతున్నారని ధర్మాసనానికి తెలిపారు. వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయని చెప్పారు. లోక్‌సభ సభ్యత్వానికి రాహుల్ గాంధీని అనర్హుడిని చేయడాన్ని తాత్కాలికంగా నిలిపేయాలని కోరారు. దీనిపై సుప్రీంకోర్టు స్పందిస్తూ, ప్రతివాదుల వాదనలను కూడా తాము వింటామని, తాత్కాలిక ఉపశమనాన్ని మంజూరు చేయలేమని తెలిపింది. రాహుల్ అభ్యర్థనను నిరాకరిస్తూ గుజరాత్ హైకోర్టు సుదీర్ఘమైన తీర్పును ఇచ్చిందని వ్యాఖ్యానించింది. 100 పేజీలకుపైగా సుదీర్ఘంగా తీర్పు ఉందని, ఇలాంటివి గుజరాత్ కోర్టుల్లోనే ప్రత్యేకంగా చూస్తున్నామని ధర్మాసనం పేర్కొంది.

మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన చేసింది. మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను వివస్త్రలను చేసి, ఊరేగించిన ఘటనతో దేశం యావత్తు రగిలిపోయింది. పైగా వారిలో ఒక మహిళపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు, ఆమెను కాపాడేందుకు వెళ్లిన ఆమె కుటుంబ సభ్యులు ఇద్దరిని హత్య చేశారు. సంఘటన జరిగిన రెండు వారాల్లోపే బాధిత కుటుంబాలు అత్యంత ధైర్యసాహసాలతో ఫిర్యాదు చేసినప్పటికీ, ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ పోలీసులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అంటే ఈ ఘాతుకానికి పాల్పడిన నేరస్తులకు రక్షణ కల్పించడానికి మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వం ప్రత్యక్షంగా సాయపడుతోందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. రెండున్నర మాసాలుగా రాష్ట్రం మండుతోంది. అయినా ముఖ్యమంత్రిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ అగ్ర నాయకత్వం సమర్థిస్తూ వస్తోంది. నెలల తరబడి మౌనం పాటిస్తూ వచ్చిన ప్రధాని చిట్టచివరకు చేసిన ప్రకటన జరిగిన సంఘటనను, మణిపూర్‌లో సుదీర్ఘంగా చెలరేగుతున్న హింసాకాండను, పైగా ముఖ్యమంత్రి పక్షపాత పాత్రను ఆయన తేలిగ్గా తీసుకున్నారని తెలియజేస్తున్నదని పొలిట్‌బ్యూరో విమర్శించింది. డబుల్ ఇంజన్ ప్రభుత్వం జవాబుదారీతనం అనే సూత్రాన్ని తుదికంటా సమాధి చేసిందని ఆ ప్రకటన విమర్శించింది. బీజేపీ చేస్తున్న సుపరిపాలన వాదనపై ఇది అత్యంత గ్రాఫిక్ వ్యాఖ్యానమని పేర్కొంది.

మోడీ బాధ నిజమే అయితే...

(మొదటిపేజీ తరువాయి)

ఉండేవారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై తప్పుడు ఆరోపణలు చేయడం మాని ముందు మణిపూర్ సీఎంను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనపై ప్రధాని నేడు పార్లమెంటులో ప్రకటన చేస్తారని దేశం ఎదురుచూస్తోందన్నారు. 80 రోజులుగా మణిపూర్ మండిపోతున్నా ప్రభుత్వం నోరు మెదపలేదని, పూర్తి నిస్సహాయంగా ఉండిపోయిందని, ఎలాంటి పశ్చాత్తాపం చెందలేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో నేడు పార్లమెంటులో ప్రధాని మోడీ ఈ ఘటనపై ప్రకటన చేస్తారని దేశం మొత్తం ఆశిస్తోందని ట్వీట్ చేశారు.

పార్లమెంట్‌లో మణిపూర్ సెగలు

(మొదటిపేజీ తరువాయి)

తక్షణం రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ హింసపై చర్చకు తాము రూల్ 267 ప్రకారం నోటీసు ఇచ్చామన్నారు. దీనిపై కేవలం ఓ అరగంట చర్చిస్తే సరిపోదన్నారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలు ఈ అంశంపై వెనక్కి తగ్గకపోవడంతో రాజ్యసభను మధ్యాహ్నం 2.30 గంటలకు వాయిదా పడింది. ఆ తర్వాత కూడా సభలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో సభను సోమవారానికి వాయిదా వేశారు.

అధునాతన రైసు మిల్లుల పై ప్రత్యేక కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

నివేదిక అందజేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకరరావు, సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సటాకే ఇండియా డైరెక్టర్ ఆర్‌కే బజాజ్‌తోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముంపు పరిస్థితిపై సీఎం ఆరా...

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరదలు, భద్రాచలం వద్ద ముంపు పరిస్థితిపై సీఎం కేసీఆర్ ఆరా తీశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన... ప్రాణహిత తదితర నదుల ద్వారా కాళేశ్వరంతోపాటు ఇతర ప్రాజెక్టుల్లో చేరుతున్న వరద గురించి అడిగి తెలుసుకున్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని సీఎస్ శాంతి కుమారి ఈ సందర్భంగా సీఎంకు తెలిపారు. భద్రాచలం వద్ద వరద పరిస్థితిని అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం... సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉందని వివరించారు. శని, ఆదివారాల్లో కూడా భారీ వర్షాలున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలంటూ ముఖ్యమంత్రి సూచించారు.

ఆర్కే భార్య అరెస్టు

- విజయవాడలో దుడ్డు ప్రభాకర్..
- రాష్ట్రంలో ఎన్ఐఎ సోదాలు

టంగుటూరు : రాష్ట్రంలో ఎన్ఐఎ అధికారుల బృందం శుక్రవారం సోదాలు చేపట్టింది. ప్రకాశం జిల్లాలో మావోయిస్టు అగ్రనేత ఆర్కే భార్య శిరీషను, విజయవాడలో కుల నిర్మూల నా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్‌ను అరెస్టు చేసింది. గత ఏడాది జులై 19న శిరీష స్వగ్రామం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరపాడు గ్రామానికి ఎన్ఐఎ బృందం వచ్చింది. ఆ సమయంలో ఆమె ఇంట్లో లేకపోవడంతో వెనుదిరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత మళ్ళీ ఎన్ఐఎ అధికారులు వచ్చారు. నేరుగా శిరీష ఇంటి వద్దకు వెళ్లి ఆమెను అరెస్టుచేసి జీపులోకి ఎక్కించారు. అక్కడి నుంచి నేరుగా టంగుటూరు పోలీస్ స్టేషన్ వద్ద వాహనాలను ఆపినట్లే ఆపి జాతీయ రహదారిపైకి మళ్లించారు. ఈ అరెస్టుపై తమకు ఎలాంటి సమాచారమూ లేదని టంగుటూరు పోలీసులు తెలిపారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్ ను ఎన్ఐఎ అధికారులు అరెస్టు చేశారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండానే ఆయనను అరెస్టు చేసి నెంబర్ లేని వాహనాల్లో తరలించారు. అక్రమ అరెస్టులను విప్లవ రచయితల సంఘం నేత, ఆర్కే తోడల్లుడు జి.కల్యాణ్‌రావు, పౌర హక్కుల సంఘం ఐఎఫ్‌టియు నేతలు తదితరులు ఖండించారు.



హింసను నియంత్రించండి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నెలల తరబడి అల్లర్లు చెలరేగుతున్న మణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వం తక్షణమే శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ, కూకి మహిళలను అమానుషంగా హింసించడాన్ని నిరసిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థి, యువజన సంఘాలు ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆందోళనలో మణిపూర్ స్థానికులు కూడా పాల్గొన్నారు. డీవైఎఫ్ఐ ఆలిండియా అధ్యక్షులు, రాజ్యసభ ఎంపీ ఎఎ రహీమ్ మాట్లాడుతూ మోడీ పాలనలో ఏ మహిళకు భద్రత లేదని, మణిపూర్ ప్రజలకు భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు ప్రధాని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూఖ్ బిస్వాస్, జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్షురాలు ఐషీ ఘోష్ తదితరులు మాట్లాడారు.

జ్ఞానవాపి మసీదు ఆవరణలో శాస్త్రీయ సర్వే

(మొదటిపేజీ తరువాయి)

వున్నట్టు కనుగొనడంతో మసీదు ఆవరణలో ఆ స్థలాన్ని మూసివేయాలని కోర్టు గతంలో జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ ఏడాది మేలో ఐదుగురు మహిళలు వేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం తన తీర్పును వెలువరించింది. అంతకుముందు ఈ మహిళలే మసీదు ఆవరణలోని శృంగార గౌరి స్థల్ వద్ద ప్రార్థనలు చేసుకోవడానికి అనుమతించాలని కోర్టును కోరారు. ఆ పిటిషన్‌పై స్పందించిన వారణాసి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వీడియో సర్వే చేయాలని ఆదేశించారు. అది గతేడాది మే 16తో పూర్తయింది.

ఆరోపణలు రుజువు చేయ్..

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఎంపీ అరవింద్ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. తన నాన్నను, అన్నను అన్నా వదిలేశామని, అసలు రాజకీయాలతో సంబంధం లేని తనభర్త పేరును ఎందుకు తీసుకొస్తున్నారని ప్రశ్నించారు. చౌకబారు రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. అరవింద్ ఎక్కడపోటీ చేసినా అక్కడికి వెళ్లి ఆయన్ని ఓడించి తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తామని స్పష్టం చేశారు. మణిపూర్ అల్లర్లపై, నిరుద్యోగంపై బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అన్ని విషయాలపై నిలదీస్తామన్నారు. కేంద్రం నుంచి అరవింద్ ఏం తెచ్చారని నిలదీశారు. అబద్ధాల మీద సమాజం నడవదని చెప్పారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా అక్కడికి వెళ్లి తప్పుడు హామీలు ఇచ్చి ఓట్లు దండుకోవడమే బీజేపీ ఎజెండా అని ధ్వజమెత్తారు. రైతులు బీఆర్ఎస్ పార్టీకి దగ్గరయ్యారనే కాంగ్రెస్ నాయకులు అక్కసు వెళ్లగక్కుతున్నారని అన్నారు. రైతులకు మూడు గంటల కరెంట్ చాలని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు.. వ్యాపారవేత్తలకు కూడా మూడు గంటలే సరిపోతుందని చెప్పగలరా అని ప్రశ్నించారు. పైసలు ఉన్న వారి పక్షాన బీజేపీ, కాంగ్రెస్ నిలబడతాయని అన్నారు. సోనియా గాంధీ దయ్యమని, పావురాల గుట్టలో పావురంలా వైఎస్ఆర్ మాయమైపోయిండని విమర్శించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు కాంగ్రెస్‌పార్టే ఉచిత కరెంట్ ఇచ్చిందని చెబుతున్నారని ఎద్దేవా చేశారు.

ఓఎస్డీ శ్రీధర్‌కు ఘన నివాళి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇంధనశాఖ కార్యదర్శి ఓఎస్డీగా పనిచేస్తూ, ఈనెల 15న గుండెపోటుతో మరణించిన ఇంజినీర్ శ్రీధర్‌కు ఆ శాఖ ఉద్యోగులు ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ) ఆధ్వర్యంలో శుక్రవారంనాడిక్కడి విద్యుత్ ఇంజనీర్స్ భవన్‌లో శ్రీధర్ సంతాప సభ జరిగింది. ట్రాన్స్‌కో ఉద్యోగి అయిన శ్రీధర్ డిప్యూటేషన్‌పై ఇంధనశాఖ కార్యదర్శి ఓఎస్డీగా పనిచేస్తున్నారు. ఆయన మరణానికి సంతాపంగా సభలో మౌనం పాటించి, నివాళులు అర్పించారు.

పసిడి ముంగిట ధరణి, మల్లేశ్



- ముందంజలో నిలిచిన దీక్షిత
- 14వ మాన్‌సూన్ రెగట్టా పోటీలు

నవతెలంగాణ, హైదరాబాద్

హుస్సేన్‌సాగర్‌లో జరుగుతున్న 14వ మాన్‌సూన్ రెగట్టా జాతీయ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ సెయిలర్లు అలలపై అదరగొడుతున్నారు. తుది ఫలితాలపై స్పష్టత వచ్చేందుకు మరో మూడు రేసులే మిగిలి ఉండగా.. తెలంగాణ సెయిలర్లు పసిడి రేసులో ముందంజలో కొనసాగుతున్నారు. అండర్-19 ఇంటర్నేషనల్ క్లాస్ విభాగంలో ధరణి లావేటి, వడ్ల మల్లేశ్ జోడీ పసిడి పతకం దిశగా సాగుతుంది. శుక్రవారం నాటి పోటీల్లో ఏకంగా మూడు రేసుల్లో విజయాలు సాధించిన హ్యాట్రిక్ కొట్టిన ధరణి, మల్లేశ్ జోడీ.. శనివారం జరిగిన రెండు రేసుల్లోనూ దుమ్మురేపారు. పసిడి పతకం రేసులో ధరణి లావేటి, వడ్ల మల్లేశ్ జంట 10 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మధ్యప్రదేశ్‌కు చెందిన సెయిలర్లు నాన్సీ రాయ్, అనిరాజ్ సెంధవ్ జోడీ 14 పాయింట్లు, విద్యాన్షి మిశ్రా, మనీశ్ శర్మ జంట 27 పాయింట్లతో టాప్-3లో కొనసాగుతున్నారు. చివరి మూడు రేసుల్లోనూ అంచనాల మేరకు మెరిస్తే ధరణి, మల్లేశ్ జోడీకి పసిడి పతకం ఖాయం. ఇక అండర్-15 ఆప్టిమిస్టిక్ క్లాస్ (బాలికలు) విభాగంలో తెలంగాణ యువ సెయిలర్ దీక్షిత కోమరవెల్లి ముందంజ వేసింది. శుక్రవారం రేసులు ముగిసే సమయానికి దీక్షిత కోమరవెల్లి 40 పాయింట్లతో అగ్రస్థానం నిలుపుకుంది. షాగున్ ఝా (మధ్యప్రదేశ్), శ్రేయ కృష్ణ (తమిళనాడు) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. అండర్-15 ఆప్టిమిస్టిక్ క్లాస్ బాయ్స్ విభాగంలో ఏకలవ్య (మధ్యప్రదేశ్), అజయ్ (గోవా), శరణ్య యాదవ్ (గోవా) టాప్-3 స్థానాల్లో కొనసాగుతున్నారు. నాలుగేండ్ల విరామం అనంతరం జరుగుతున్న మాన్‌సూన్ రెగట్టా పోటీలు ఆదివారం ఫైనల్స్‌తో ముగియనున్నాయి.

ఆగస్టు 12న డబ్ల్యూఎఫ్‌ఐ ఎన్నికలు

- సుప్రీం తీర్పుతో ఎన్నికలకు లైన్ క్లియర్
- మహారాష్ట్రకు దక్కని ఓటు హక్కు

న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) ఎన్నికలకు ఎట్టకేలకు మార్గం సుగమం. అస్సాం హైకోర్టు ఇటీవల రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలపై ఇచ్చిన స్టే ఆర్డర్‌ను అత్యున్నత న్యాయస్థానం నిలుపుదల చేసిన సంగతి తెలిసిందే. తీవ్ర జాప్యంతో సరికొత్త వివాదాలకు కేంద్రంగా నిలుస్తున్న భారత రెజ్లింగ్ సమాఖ్య.. ఆగస్టు 12న నూతన పాలక వర్గాన్ని ఎన్నుకోనుంది. ఈ మేరకు డబ్ల్యూఎఫ్‌ఐ రిటర్నింగ్ ఆఫీసర్ జస్టిస్ ఎంఎం కుమార్ శుక్రవారం వెల్లడించారు.

మహారాష్ట్రకు నో : ఆఫీస్ బేరర్లను ఎన్నుకునే ప్రక్రియలో డబ్ల్యూఎఫ్‌ఐ 24 అనుబంధ రాష్ట్ర సంఘాలు భాగస్వామ్యం కానున్నాయి. తొలుత జులై 6న ఎన్నికలకు షెడ్యూల్ ఖరారు చేయగా.. తెలంగాణ, హర్యానా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్ర రెజ్లింగ్ సంఘాలను ఎలక్టోరల్ కాలేజ్ నుంచి తొలగించారు. ఈ నిర్ణయాన్ని ఈ రాష్ట్ర సంఘాలు సవాల్ చేయటంతో అప్పట్లో ఎన్నికలను జులై 11కు మార్పు చేశారు. ఆ తర్వాత అస్సాం రాష్ట్ర రెజ్లింగ్ సంఘం గుర్తింపు కోసం కోర్టుకెక్కటంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. తాజాగా ఆగస్టు 12న నిర్వహించనున్న ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి ఓటు హక్కు కోరుతున్న రెండు సంఘాలకూ అనుబంధ గుర్తింపు అర్హత లేదని రిటర్నింగ్ ఆఫీసర్ తేల్చారు. దీంతో 24 రాష్ట్ర సంఘాల నుంచి 48 మంది ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.





అదే సస్పెన్స్ : బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా 12 ఏండ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. జాతీయ స్పోర్ట్స్ కోడ్ ప్రకారం మరోసారి పోటీచేసేందుకు బ్రిజ్‌భూషణ్ అనర్హుడు. కానీ ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా కొనసాగుతున్న బ్రిజ్‌భూషణ్ తనయుడు కరన్ భూషణ్ సింగ్ ఎన్నికల్లో పోటీచేసేందుకు అర్హుడు. కానీ ఆందోళనకు దిగిన రెజ్లర్లతో చర్చల్లో భాగంగా క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఓ హామీ ఇచ్చారు. బ్రిజ్ భూషణ్ కుటుంబ సభ్యులు, అనుచరులు ఎవరూ రానున్న డబ్ల్యూఎఫ్‌ఐ ఎన్నికల్లో పోటీ చేయరని తెలిపారు.

బ్రిజ్‌భూషణ్ ఇద్దరు అల్లుళ్లు విశాల్ సింగ్, ఆదిత్య ప్రతాప్ సింగ్ సైతం ఎన్నికల్లో పోటీకి అర్హత కలిగి ఉన్నారు. మాజీ ఒలింపియన్, ఢిల్లీ రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడు జై ప్రకాశ్, ఉత్తరాఖాండ్ రెజ్లింగ్ సంఘం కార్యదర్శి సత్యపాల్ సింగ్ దేశ్వాల్‌లు బ్రిజ్‌భూషణ్‌కు అత్యంత సన్నిహితులు. బ్రిజ్‌భూషణ్ కుమారుడు ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చు.కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులైన వ్యక్తులనైనా డబ్లూఎఫ్‌ఐ అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టేందుకు బ్రిజ్‌భూషణ్‌కు తగిన మద్దతు ఉంది. ఆగస్టు 12న జరిగే ఎన్నికల్లో 48 మంది సభ్యులు ఓటు హక్కు కలిగి ఉండగా.. కనీసం 46 మంది సభ్యుల మద్దతు బ్రిజ్‌భూషణ్‌కు ఉండటం గమనార్హం.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

- క్వార్టర్స్‌లో జపాన్ జంటపై గెలుపు
- కొరియా ఓపెన్ బ్యాడ్మింటన్



యోషు (దక్షిణ కొరియా) : ఆసియా చాంపియన్స్, భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలు కొరియా ఓపెన్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్, చిరాగ్ జోడీ 21-14, 21-17తో వరుస గేముల్లో గెలుపొందారు. ఐదో సీడ్ జపాన్ షట్లర్లు టకురో హోకి, యుగో కొబొహసిలు 40 నిమిషాల్లోనే భారత జోడీకి సెమీస్ బెర్త్ అప్పగించారు. తొలి గేమ్‌లో సాత్విక్, చిరాగ్ ఏకపక్ష విజయం సాధించగా.. రెండో గేమ్‌లో జపాన్ జోడీ ప్రతిఘటించింది. 11-9తో విరామ సమయానికి ముందంజలో నిలిచిన సాత్విక్, చిరాగ్‌లను..16-16తో స్కోరు సమం చేసిన జపాన్ జోడీ ఉత్కంఠ రేపారు. చివర్లో వరుస పాయింట్లు సాధించిన సాత్విక్, చిరాగ్ సెమీస్‌లోకి అడుగుపెట్టారు. నేడు ఫైనల్లో చోటు కోసం రెండో సీడ్ చైనా జోడీ వీ కెంగ్, వాంగ్ చాంగ్‌లతో పోటీపడనున్నారు.

ఆ ముగ్గురు జోరుగా..!

- బుమ్రా, రాహుల్, అయ్యర్ ఫిట్‌నెస్‌పై బీసీసీఐ



బెంగళూర్ : గాయాలు, శస్త్రచికిత్సలు, రిహాబిలిటేషన్ నుంచి ముమ్మర సాధన దశకు వచ్చారంటూ.. జశ్‌ప్రీత్ బుమ్రా, కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్‌లపై బీసీసీఐ అప్‌డేట్ ఇచ్చింది. ప్రస్తుతం బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఉన్న ఈ ముగ్గురు క్రికెటర్లు పూర్తి స్థాయిలో సాధన చేస్తున్నారని బీసీసీఐ తెలిపింది. ఎన్‌సీఏ నిర్వహించే అంతర్గత మ్యాచుల్లో బుమ్రాతో పాటు మరో పేసర్ ప్రసిద్ కృష్ణ సైతం బౌలింగ్ చేస్తారని వెల్లడించింది. శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్‌లు నెట్స్‌లో కఠోరంగా సాధన చేస్తున్నారని.. రానున్న రోజుల్లో బ్యాటింగ్ సాధన, స్ట్రెంగ్త్ అండ్ కండీషనింగ్ కసరత్తులు మరింత దీటుగా ప్రణాళికలో చేర్చుతామని తెలిపింది. ఇక రోడ్డు ప్రమాదం నుంచి కోలుకుంటున్న రిషబ్ పంత్ సైతం నెట్స్‌లో బ్యాటింగ్ సాధనతో పాటు వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ సైతం చేస్తున్నాడని బీసీసీఐ పేర్కొంది. బుమ్రా, రాహుల్, శ్రేయస్‌లు ఆసియా కప్ కోసం సన్నద్ధమవుతుండగా.. రిషబ్ పంత్‌ను ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని

విరాట్ కోహ్లి ప్రత్యేక ప్రదర్శన. కెరీర్ 500వ మ్యాచ్‌లో శతకంతో చెలరేగిన విరాట్ కోహ్లి (121) మైలురాయి మ్యాచ్‌ను మరింత మధురం చేసుకున్నాడు. కరీబియన్ పిచ్‌లపై అనూహ్య ఉపఖండ తరహా పరిస్థితుల్లో అలవోకగా పరుగులు పిండుకున్న విరాట్ కోహ్లి 29వ టెస్టు సెంచరీతో చెలరేగాడు. రవీంద్ర జడేజా (61)తో కలిసి 159 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన కోహ్లి.. భారత్‌ను తొలి ఇన్నింగ్స్‌లో పటిష్ట స్థితిలో నిలిపాడు.

విరాట్ శతక స్పెషల్



- 500వ మ్యాచ్‌లో కోహ్లి 121 రన్స్
- అర్థ సెంచరీతో మెరిసిన జడేజా
- భారత్ తొలి ఇన్నింగ్స్ 373/6
- విండీస్‌తో రెండో టెస్టు రెండో రోజు

నవతెలంగాణ-పోర్ట్ ఆఫ్ స్పెయిన్

విరాట్ కోహ్లి (121, 206 బంతుల్లో 11 ఫోర్లు) శతక గర్జన. కెరీర్ 500వ మ్యాచ్ ఆడుతున్న స్టార్ బ్యాటర్ క్వీన్స్‌పార్క్‌లో ఖతర్నాక్ ఇన్నింగ్స్ నమోదు చేశాడు. కెరీర్ 29వ టెస్టు సెంచరీ సాధించిన విరాట్ కోహ్లి.. రవీంద్ర జడేజా (61, 152 బంతుల్లో 5 ఫోర్లు)తో కలిసి ఐదో వికెట్‌కు 159 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పాడు. విరాట్ కోహ్లి స్పెషల్ శతకం, రవీంద్ర జడేజా అర్థ సెంచరీతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా సాగుతోంది. శుభ్‌మన్ గిల్ (10), అజింక్య రహానె (8) నిరాశపరిచారు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (57), రోహిత్ శర్మ (80) అర్ధ సెంచరీలతో తొలి వికెట్‌కు 139 పరుగులు జోడించిన సంగతి తెలిసిందే. రెండో రోజు ఆటలో లంచ్ విరామ సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 373/6తో కొనసాగుతుంది.

విరాట్ శతక గర్జన : కెరీర్ స్పెషల్ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి అంతే స్పెషల్ ఇన్నింగ్స్ ఆడాడు. కరీబియన్ పేసర్లలో కీమర్ రోచ్, వారికన్ నిలకడగా పరీక్షగా నిలిచినా.. ఐదు రోజుల ఆటలో సంప్రదాయ ఇన్నింగ్స్‌తో అలరించాడు. జడేజాతో కలిసి తొలి రోజే బ్యాటింగ్‌కు వచ్చిన విరాట్ కోహ్లి.. రెండో రోజు తొలి సెషన్ వరకు మెరిశాడు. ఆరు ఫోర్లతో 97 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన విరాట్ కోహ్లి.. రెండో రోజు ఉదయం సెంచరీ సాధించాడు. పది బౌండరీలతో 180 బంతుల్లో విరాట్ కోహ్లి 29వ టెస్టు సెంచరీ నమోదు చేశాడు. మరో ఎండ్‌లో రవీంద్ర జడేజా సైతం రాణించాడు. సహజశైలిలో ధనాధన్ విధ్వంసం లేకపోయినా.. జడేజా పరిస్థితులకు అనుగుణంగా ఆడాడు. నాలుగు ఫోర్లతో 105 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసిన జడేజా.. ఆ తర్వాత క్రీజులో ఎంతోసేపు నిలువలేదు. తొలుత జడేజాతో సమన్వయ లోపంతో విరాట్ కోహ్లి రనౌట్‌గా నిష్క్రమించగా.. ఆ తర్వాత జడేజా సైతం వికెట్ చేజార్చుకుని పెవిలియన్‌కు చేరుకున్నాడు. లంచ్ విరామ సమయానికి ఇషాన్ కిషన్ (18 బ్యాటింగ్, 21 బంతుల్లో 3 ఫోర్లు), రవిచంద్రన్ అశ్విన్ (6 బ్యాటింగ్, 11 బంతుల్లో 1 ఫోర్) అజేయంగా ఆడుతున్నారు. వెస్టిండీస్ బౌలర్లలో కీమర్ రోచ్ (2/86) రెండు వికెట్ల ప్రదర్శన చేయగా.. షానన్ గాబ్రియల్, జోమెల్ వారికన్, జేసన్ హోల్డర్‌లు తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : జైస్వాల్ (సి) మెకెంజి (బి) హోల్డర్ 57, రోహిత్ (బి) వారికన్ 80, గిల్ (సి) డిసిల్వ (బి) రోచ్ 10, కోహ్లి రనౌట్ 121, రహానె (బి) గాబ్రియల్ 8, జడేజా (సి) డిసిల్వ (బి) రోచ్ 61, కిషన్ నాటౌట్ 18, అశ్విన్ నాటౌట్ 6, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం : (108 ఓవర్లలో 6 వికెట్లకు) 373.**

వికెట్ల పతనం : 1-139, 2-153, 3-155, 4-182, 5-341, 6-360.

బౌలింగ్ : కీమర్ రోచ్ 19-2-86-2, అల్జారీ జోసెఫ్ 19-0-92-0, గాబ్రియల్ 16-0-63-0, జోమెల్ వారికన్ 31-6-70-1, అలిక్ అతానెజ్ 4-0-12-0, బ్రాత్‌వేట్ 2-1-1-0.

నవచిత్రం



బేబీలాంటి కథలకు మన జీవితాలే స్ఫూర్తి

'బేబీ' మూవీ కల్ట్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్‌లో అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా పాల్గొని చిత్ర బృందానికి కంగ్రాట్స్ చెప్పారు. 'నేను అనుకోకుండా నటుడిని అయ్యా. అయితే సినిమాలో మన క్యారెక్టర్ బాగా చేస్తే నటుడిగా గుర్తింపు వస్తుందని ఈ సినిమాతో ప్రూవ్ అయ్యింది' అని హీరో ఆనంద్ దేవరకొండ చెప్పారు.

దర్శకుడు సాయి రాజేశ్ మాట్లాడుతూ, 'బేబీ సినిమా చూసి ఐకాన్ స్టార్ ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తో మేము ఫుల్ జోష్‌లోకి వెళ్లిపోయాం. ఆయన ఒక కామన్ మాస్ ఆడియన్ ఎలా రియాక్ట్ అవుతాడో అలా రివ్యూ చెప్పారు. ఆయన చెప్పింది పదే పదే గుర్తుచేసుకుంటూ మా హీరో, హీరోయిన్స్‌కి ఆ విషయాలన్నీ షేర్ చేసుకున్నా. ఆయన చెప్పింది వింటుంటే ఒక రాజమౌళి మూవీ చూసిన ఫీలింగ్ కలిగింది. మేము మీకు రుణపడి ఉంటాం అల్లు అర్జున్ అన్నా. మీరు ఇచ్చిన సపోర్ట్‌తో 'బేబీ' రేపటి నుంచి థియేటర్లలో మరింత హౌస్‌ఫుల్ అవుతుంది' అని చెప్పారు.

> 7జీ బృందావన్ కాలనీ, అర్జున్ రెడ్డి లాంటి కొన్ని సినిమాలే ప్రేమలోని బాధను తెలియజేస్తాయి. అలాంటి సినిమాలు తీయడం కష్టం. ఎందుకంటే అలాంటి లవ్ పెయిన్ చూపించే కథలు సులువుగా రావు. మన జీవితంలో చూస్తేనే, అనుభూతి చెందితేనే వస్తాయి. లైఫ్ నుంచి స్ఫూర్తి పొందితేనే బేబీ లాంటి సినిమా తీయగలం. కథ రాసిన విధానం, తెరకెక్కించిన విధానం, ఆర్టిస్టుల నటనా తీరు ఇలా ప్రతీది ఆకట్టుకుంది. వీళ్ల నటనలో ఎంతో జెన్యూనిటీ ఉంది. చిన్న సినిమాలను థియేటర్లలో ప్రేక్షకులు చూడటం లేదు అనేది అబద్ధం. సినిమా బాగుంటే మీడియా, ప్రేక్షకులు నిజాయితీగా మద్దతు, ప్రేమ ఇస్తారు. అందుకు బేబీ సక్సెస్ నిదర్శనం. దర్శకుడు సాయిరాజేష్ ఈ సినిమా కోసం బాగా కష్టపడ్డాడు.
>
> - అల్లు అర్జున్

'ఈ సినిమాకు థియేటర్‌లో వస్తున్న రెస్పాన్స్ చూసి నమ్మలేకపోయాం. మేము నటిస్తుంటే జనాలు ఇంతగా రియాక్ట్ అవుతారని ఊహించలేదు' అని హీరో విరాజ్ అశ్విన్ అన్నారు.

హీరోయిన్ వైష్ణవి చైతన్య మాట్లాడుతూ, 'అల్లు అర్జున్ నటన అంటే ఇష్టం. ఆయన నాకొక ఇన్స్పిరేషన్. నేను ఇవాళ బాగా నటించానని పేరొచ్చిందంటే అందులో ఆయన ఇచ్చిన స్ఫూర్తి కూడా ఉంటుంది. తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రావనే పేరును బేబీ మార్చేసింది' అని తెలిపారు. నిర్మాత ఎస్కేఎన్ మాట్లాడుతూ, 'మా బన్నీనే మాకు అన్నీ. నాకే కాదు మా టీమ్‌లోని చాలా మందికి లైఫ్ ఇచ్చింది' అని అన్నారు.

మిల్కీ బ్యూటీతో చిరు స్టెప్పులు



చిరంజీవి, తమన్నా

చిరంజీవి నటిస్తున్న తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌తో పాటు భోళా మానియా, జామ్ జామ్ జజ్జనక పాటలకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం థర్డ్ సింగిల్ 'మిల్కీ బ్యూటీ' పాటని సంగీత దర్శకుడు తమన్ లాంచ్ చేశారు. మహతి స్వర సాగర్ ఈ పాటని లైవ్లీ మెలోడీగా స్వరపరిచారు. విజయ్ ప్రకాష్, సంజన కల్మంజే కలసి మహతి స్వర సాగర్ ఈ పాటని గ్రేస్ ఫుల్‌గా ఆలపించారు. సరస్వతి పుత్ర రామజోగయ్య శాస్త్రి అందించిన సాహిత్యం అందర్నీ ఆకట్టుకుంటోంది. ఈ పాటలో చిరంజీవి డాన్స్, స్వాగ్ మెస్మరైజింగ్‌గా ఉన్నాయి. ఆయనతో తమన్నా చేసిన డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. ఈ పాటలో వారి కెమిస్ట్రీ బ్యూటీఫుల్‌గా ఉంది. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. డడ్లీ డీవోపీగా పని చేస్తున్నారు. సత్యానంద్ కథ పర్యవేక్షణ చేయగా, తిరుపతి మామిడాల డైలాగ్స్ అందిస్తున్నారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్‌గా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది.

కీర్తి సురేష్, సుశాంత్, రఘుబాబు, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, సురేఖా వాణీ, శ్రీ ముఖి, హైపర్ ఆది, వైవా హర్ష, ప్రదీప్, అనీ, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, వేణు టిల్లు, తాగుబోతు రమేష్, రష్మీ గౌతమ్, ఉత్తేజ్, వీర్, షావర్ అలీ, తరుణ్ అరోరా తదితరులు ఇతర ముఖ్యతారాగణం.



'కల్కి 2898 ఎడి'లో ప్రభాస్

రెండు అద్భుత ప్రపంచాల కలయిక



ప్రభాస్, నాగ్ అశ్విన్, కమల్‌హాసన్

> ఇంత మంది నటీనటులతో సినిమా చేయటం ఆనందంగా ఉంది. ఒక అద్భుతమైన కథ చెప్పాలనే వారి ప్రేమ మా అందరినీ ఒకచోట చేర్చింది. నేను సైన్స్ ఫిక్షన్, పురాణాలను ఇష్టపడతాను. మహాభారతం, స్టార్ వార్స్ రెండింటి చూస్తూ, వింటూ పెరిగాను. ఈ రెండు ప్రపంచాలను కలిపే ఒక సినిమా చేయడం గొప్పగా అనిపించింది, అలా 'కల్కి 2898 ఎడి' పుట్టింది.
>
> - దర్శకుడు నాగ్ అశ్విన్

వైజయంతీ మూవీస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'ప్రాజెక్ట్ కె' చిత్రానికి అధికారికంగా 'కల్కి 2898 ఎడి' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. సి.అశ్వని దత్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటాని వంటి హేమాహేమీలు నటిస్తున్నారు. ప్రతిష్టాత్మక శాన్ డియాగో కామిక్-కాన్‌లో ఈ చిత్ర గ్లింప్స్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. సినిమా విజన్ కాన్సెప్ట్, స్పెల్ బౌండింగ్ విజువల్స్‌తో ప్రేక్షకులను ఆకర్షించింది.

అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా ఒక అసాధారణమైన, అద్భుతమైన అనుభవం. దీని వెనుక గొప్ప పరిశోధన ఉంది' అని తెలిపారు. 'ఈ సినిమాకి పెద్ద విజన్ ఉంది' అని కమల్ హాసన్ అన్నారు. 'అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, నా స్నేహితుడు ప్రభాస్‌ని చేరుకోవడానికి 50 సంవత్సరాలు కష్టపడ్డాను. ఇది మాకు చాలా గర్వకారణం' అని నిర్మాత అశ్వని దత్ అన్నారు. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 12న ఈ సినిమా విడుదల కానుంది.

తెలుగులో రిలీజ్‌కి రెడీ

ఎమ్ మోహన శివకుమార్ సమర్పణలో సిఎమ్‌బి ప్రొడక్షన్స్ పతాకంపై కిచ్చా సుదీప్, అమలాపాల్ జంటగా ఎస్.కృష్ణ దర్శకత్వంలో సి.సుబ్రహ్మణ్యం నిర్మించిన కమర్షియల్ యాక్షన్ థ్రిల్లర్ 'హెబ్బులి'. ఈ చిత్రం కన్నడలో విడుదలై విమర్శకుల నుండి మంచి సమీక్షలను అందుకోవడమే కాకుండా బాక్సాఫీసు వద్ద విజయం సాధించింది.



అమలాపాల్, కిచ్చా సుదీప్

ఈ సినిమాలో శంకర్, రవి కిషన్, సంపత్ రాజ్ నెగిటివ్ రోల్స్‌లో కనిపిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఆగస్ట్ 4న గ్రాండ్‌గా తెలుగులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఈ సందర్భంగా నిర్మాత సి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, 'ఇందులో ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు, రొమాంటిక్ యాంగిల్‌తో కూడిన మంచి కమర్షియల్ ఓరియంటెడ్ కంటెంట్ ఉంది. కన్నడలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద 100 కోట్లు సాధించిన తొలి పక్కా కమర్షియల్ ఇది. అందుకే దీన్ని తెలుగులో ఆగస్ట్ 4న గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం. ఈ సినిమా చూసిన వారందరికీ కచ్చితంగా నచ్చుతుంది' అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : ఎ.కరుణాకర్, మ్యూజిక్ : అర్జున్ జన్య.

సరికొత్త ఎంటర్‌టైనర్



విశ్వక్‌సేన్

హీరో విశ్వక్ సేన్ ప్రస్తుతం నూతన దర్శకుడు రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో ఓ కొత్త చిత్రాన్ని చేస్తున్నారు. నిర్మాత రామ్ తాళ్లూరి ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విశ్వక్ సేన్‌కు జోడిగా మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తోంది. తాజాగా ఈ సినిమా మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తయింది. చిత్ర ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొన్నారు. త్వరలో తదుపరి షెడ్యూల్‌ను యూనిట్ ప్రారంభించనుంది.

మరికొద్ది రోజుల్లో ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ సింగిల్ లిరికల్ వీడియో కూడా త్వరలో రివీల్ కానుంది. ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఫన్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో విశ్వక్‌సేన్ పాత్ర సరికొత్తగా ఉంటూ ప్రేక్షకులను అలరించనుంది. ఈ చిత్రానికి దర్శకత్వం: రవితేజ ముళ్లపూడి, సంగీతం: జేక్స్ బిజోయ్, డీవోపీ: మనోజ్ కాటసాని, ప్రొడక్షన్ డిజైనర్: క్రాంతి ప్రియం, ఎడిటర్: అన్వర్ అలీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: సత్యం రాజేష్, విద్యాసాగర్ జె.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

వరద సహాయక చర్యల్లో పాల్గొనండి

- కాంగ్రెస్ శ్రేణులకు రేవంత్ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలో గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని వాగులు, వంకలు, నదులు పొంగి పొర్లుతున్నాయని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమయంలో ప్రజలు పడుతున్న వరద కష్టాల్లో నాయకులు, కార్యకర్తలు పాలుపంచుకోవాలని ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. భారీ వర్షాల కారణంగా హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు అన్ని జలమయమయ్యాయని తెలిపారు. ప్రజలు వరద నీటితో చాలా కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదలతో ముంపునకు గురై ప్రజలు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేక, పిల్లలకు పాలు, ఆహార పదార్థాలు కూడా ఇవ్వలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి అండగా ఉండి వారి ఇబ్బందులను పరిష్కరించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు వెంట వెంటనే స్పందించి సహాయ చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు.

ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ మెట్రోను పొగించండి

సీఎం కేసీఆర్‌కు ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి లేఖ

ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రోను పొడిగించాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్నికోరారు. ఈమేరకుశుక్రవారం సీఎంకేసీఆర్‌కు కోమటిరెడ్డి లేఖ రాశారు. హయత్‌నగర్(అబ్దుల్లాపూర్‌మెట్) వరకు హైదరాబాద్ నగరం ఆ వైపు వేగంగా విస్తరిస్తున్నదని తెలిపారు. ఎంతోమంది ప్రజలు హయత్‌నగర్ నుంచి ఎల్బీనగర్ వరకు వెళ్లి అక్కడి నుంచి మెట్రోకు వెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ లైన్‌ను పొడిగించే యోచన ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపేందుకు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. రోజు రోజూకు వాహనాల రద్దీ పెరగడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ మార్గంలో జాతీయ రహదారిని 6 లేన్లుగా మారుస్తున్నదని గుర్తు చేశారు. కేంద్రం రానున్న రోజుల్లో వాహనాల రద్దీ మరింత పెరుగుతున్నదని తెలిపారు. మెట్రో విస్తరణ జరిగితే ప్రయాణికులు సొంత వాహనాల వాడకం తగ్గించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు.

కిసాన్ కాంగ్రెస్ రైతు భరోసా యాత్రకు తాత్కాలిక విరామం

కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో కిసాన్ కాంగ్రెస్ రైతు భరోసా యాత్రకు తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నట్టు కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎడతెరిపిలేని వర్షాలతో రాష్ట్ర ప్రజలు, రైతన్నలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని పేర్కొన్నారు. రైతులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. వానలు తగ్గిన తర్వాత యాత్ర కొనసాగుతుందని తెలిపారు.

మణిపూర్ ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేసింది

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను వివస్త్రలను చేసి, ఊరేగించిన దుర్ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్ఘటనతో యావత్ భారతావణి సిగ్గుతో తలదించుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా కేంద్రం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మానవత్వానికే ఇదొక మాయని మచ్చగా మిగిలపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

- తెలంగాణ గిరిజన సంఘం

మణిపూర్‌లో గిరిజన మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మణిపూర్ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన పట్ల నైతిక బాధ్యత వహించి ఆ రాష్ట్ర సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగిక దాడి చేయటమనేది యావత్ భారతావని సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయమని తెలిపారు. గత కొన్ని నెలలుగా జరుగుతున్న వరస సంఘటనల నేపథ్యంలో రాష్ట్రపతి స్పందించాలని డిమాండ్ చేశారు.

ఇక్కడి విధానాలను అక్కడ అమలు చేస్తాం

- నా పర్యటన తమిళనాడు ప్రజలకు ఉపయోగం
- ఆ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పీటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐటీ రంగంలో తెలంగాణ రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలను, ఐటీ, ఐటీ అనుబంధ కార్యక్రమాలను తమ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు కషి చేస్తామని తమిళనాడు రాష్ట్ర రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పలనివేల్ త్యాగరాజన్(పీటీఆర్) అన్నారు. తెలంగాణ రాష్ట్ర విధానాలు, కార్యక్రమాలను పరిశీలించేందుకు పీటీఆర్ ఆధ్వర్యంలోని ఒక బందం రాష్ట్రంలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. రెండో రోజు పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ వర్క్స్, టీ హబ్, వీ హబ్, గచ్చిబౌలిలోని టీ-ఫైబర్ కార్యాలయాన్ని శుక్రవారం వారు సందర్శించారు. అనంతరం హైదరాబాద్‌లోని టెక్ మహీంద్రా కార్యాలయంలో పలువురు ఐటి పరిశ్రమ భాగస్వాములతో సమావేశమయ్యారు. ఐటీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, విధానాలను ఐటీ శాఖ అధికారులు త్యాగరాజన్‌కు వివరించారు. సుదీర్ఘ అనుభవం ఉన్న కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేండ్లలో తెలంగాణ ఎంతో అభివద్ధి చెందిందనీ, ఐటీ రంగంలో బెంగళూరు తర్వాత హైదరాబాద్ గణనీయమైన వృద్ధి సాధించిందన్నారు. ఈ రెండు నగరాలకు తోడుగా ఉండాల్సిన తమిళనాడు గత పాలకుల వల్ల ఐటీలో వృద్ధి సాధించలేకపోయిందని వాపోయారు. తాను ఐటీ బాధ్యతలు చేపట్టాక తమిళనాడులో ఎలాంటి విధానాలు పాటిస్తే ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో హైదరాబాద్‌ను సందర్శించినట్టు పీటీఆర్ వెల్లడించారు. తన పర్యటన తప్పకుండా అక్కడి ప్రజలకు మేలు చేకూర్చేలా ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. హైదరాబాద్ కేంద్రంగా ఐటీ పరిశ్రమ తొమ్మిదేండ్లల్లో అద్భుతంగా ముందుకెళ్లిందన్నారు. ఈ విధానాలను అడాప్ట్ చేసుకుంటామని చెప్పారు. ఇక్కడి ఆదర్శ విధానాలను తమిళనాడులో అమలు చేస్తామన్నారు.

వైసీపీ పాలనలో దౌర్జన్యకాండ

బీఆర్ఎస్ ఏపీ చీఫ్ తోట


- బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ మైనార్టీ మోర్చా నేత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వైసీపీ ప్రభుత్వ అసమర్థ పాలనలో దౌర్జన్యాలు పెరిగి సామాన్యులు స్వేచ్ఛగా బతకలేని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గుంటూరు జిల్లా బీజేపీ మైనారిటీ మోర్చా జోనల్ ఇంచార్జీ నాగుల్ మీరా, షేక్ రబ్బాని సహా పలు జిల్లాలకు చెందిన నాయకులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ మతతత్వ రాజకీయాలను ప్రోత్సహించే బీజేపీని దేశవ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు.

56 అంగులాల మందం వున్న చర్మానికి బాధ, అవమానం తెలియడానికి 79 రోజులు పట్టింది

- ది టెలిగ్రాఫ్ సౌజన్యంతో...





మోడీజీ.. మణిపూర్ ఘటన గురించి ఇప్పుడు తెలిసిందా?: ప్రియాంక

గ్వాలియర్ : మధ్యప్రదేశ్‌లో అధికార మార్పిడి తథ్యమని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. భాజపాను ఇంటికి పంపేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ ఏడాది చివరిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర మంత్రి, కాంగ్రెస్ మాజీ నేత జ్యోతిరాదిత్య సింధియా సొంతనియోజక వర్గం గ్వాలియర్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధురాలు రాణి లక్ష్మీభాయ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రియాంక మాట్లాడారు. కేంద్రంపై సమరానికి సిద్ధమవుతున్న విపక్ష పార్టీల సీనియర్ నేతలను ప్రధాని మోదీ



దొంగలుగా పేర్కొన్నారని ప్రియాంక ఆరోపించారు. తోటి రాజకీయ నేతలపై కనీస గౌరవం లేకుండా మాట్లాడటం ఎంత వరకు సమంజసమో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన మే 4న జరిగితే.. 77 రోజుల తర్వాత ప్రధాని స్పందించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆ దారుణం గురించి ఇప్పటి వరకు తెలియలేదా?అని ఆమె ప్రశ్నించారు. ప్రియాంక గాంధీ గత 40 రోజుల వ్యవధిలో మధ్యప్రదేశ్‌లో పర్యటించడం ఇది రెండో సారి. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తొలిసారిగా జూన్ 12న జబల్‌పూర్‌లో ఆమె ప్రచారం మొదలుపెట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తే.. ప్రతి మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తోపాటు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించారు.

డోర్నకల్- మిర్యాలగూడ రైల్వేలైన్ అలైన్మెంట్ మార్చండి

- రైల్వే మంత్రికి నామ వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ఖమ్మం జిల్లాతో సంబంధం లేకుండా ప్రత్యామ్నాయ మార్గంలో 'డోర్నకల్ - మిర్యాలగూడ" రైల్వే లైన్ 'అలైన్మెంట్' ను మార్చాలని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఈమేరకు ఆయన వినతిపత్రాన్ని సమర్పించారు.ప్రస్తుతం అలైనెంట్‌తో ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో చాలా మంది రైతులు తమ భూములను కోల్పోతారని వివరించారు. నాలుగు హైవేల వల్ల, నాగార్జున సాగర్ కాలువ కింద ఇప్పటికే రైతులు ఆయా మండలాల్లో వందలాది ఎకరాల వ్యవసాయ భూముల కోల్పోయారని గుర్తు చేశారు. ప్రతిపాదిత రైలు మార్గంతో ఆ జిల్లాకు ఒనగూడే ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. ఖమ్మం పట్టణానికి దగ్గరలో ఉన్న పలు గ్రామాల్లో రైల్వే లైన్ కింద పోయే వ్యవసాయ భూములు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. దీనిపై రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించినట్టు నామా పేర్కొన్నారు.

మణిపూర్‌పై ప్రజలకు వాస్తవాలు చెప్పండి

మణిపూర్ అల్లర్లపై ప్రజలకు వాస్తవాలు చెప్పాలంటూ నామా డిమాండ్ చేశారు. 80 రోజులుగా మణిపూర్ లో జరుగుతున్న హింసపై చర్చించి, ప్రధాని మోడీ నోరు విప్పాలని కోరారు. శుక్రవారం లోక్‌సభలో ఇదే అంశంపై వాయిదా తీర్మానం ఇచ్చారు. దానిపై చర్చ జరపకుండా ప్రభుత్వం సభను వాయిదా వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ అంశంపై చర్చకు అనుమతించకుండా ఎందుకు కేంద్ర ప్రభుత్వం వెనక్కిపోతుందని విమర్శించారు. ఇందుకు సంబంధించి ఎక్కడ వాస్తవాలు చెప్పాల్సి వస్తుందోననే భయంతోనే కేంద్రం చర్చకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. కేవలం బిల్లుల ఆమోదం కోసం కాకుండా సత్వరమే ఈ అంశంపై సభలో చర్చించాలని డిమాండ్ చేశారు.

కోవిడ్ తర్వాత పెరిగిన గుండెపోటు కేసులు..

- కీలక విషయాలు వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ : కోవిడ్ తర్వాత యువకుల్లో గుండె ఆగిపోవడం వల్ల ఆకస్మిక మరణాలు నమోదయ్యాయి. అయితే కారణాన్ని నిర్ధారించడానికి తగిన ఆధారాలు అందుబాటులో లేవని కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవ్య ఈరోజు పార్లమెంటుకు తెలిపారు. మహమ్మారి తర్వాత పెరుగుతున్న కార్డియాక్ అరెస్ట్ కేసులకు సంబంధించి వాస్తవాలను తెలుసుకోవడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ మూడు వేర్వేరు అధ్యయనాలను నిర్వహిస్తోందని లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా మాండవ్య చెప్పారు. భారతదేశంలోని 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల పెద్దవారిలో ఆకస్మిక మరణాలకు సంబంధించిన కారకాలపై అధ్యయనం దాదాపు 40 ఆస్పత్రులు/పరిశోధన కేంద్రాలలో కొనసాగుతోందని ఆయన చెప్పారు. భారతదేశంలో 2022లో 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల జనాభాలో గుండెపోటు సంఘటనలపై కోవిడ్ వ్యాక్సిన్ ప్రభావాన్ని గుర్తించడానికి దాదాపు 30 కొవిడ్ క్లినికల్ రిజిస్ట్రీ ఆసుపత్రులలో మరో మల్టీసెంట్రిక్ హాస్పిటల్ అధ్యయనం జరుగుతోందన్నారు. అంతేకాకుండా, వర్చువల్, ఫిజికల్ శవపరీక్ష ద్వారా యువకులలో ఆకస్మిక వివరించలేని మరణాలకు కారణాన్ని గుర్తించడానికి మరొక అధ్యయనం జరుగుతోందని మాండవ్య చెప్పారు. హృదయ సంబంధ వ్యాధులకు సంబంధించిన ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నాన్-కమ్యూనికేట్ డిసీజెస్ (ఎన్‌పీ-ఎన్‌సీపీ) నివారణ, నియంత్రణ కోసం జాతీయ కార్యక్రమం కింద రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. కార్డియోవాస్కులర్ వ్యాధిలో అంతర్భాగం.

ఈ కార్యక్రమంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, మానవ వనరుల అభివద్ధి, ఆరోగ్య ప్రమోషన్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ కింద 30 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ప్రజల్లో జనాభా ఆధారిత స్క్రీనింగ్, ముందస్తు రోగ నిర్ధారణ, నిర్వహణ, తగిన స్థాయి ఆరోగ్య సంరక్షణ సదుపాయానికి రెఫరల్ ఉన్నాయి.కింద, 724 జిల్లా నాన్-కమ్యూనికేబుల్ డిసీజ్ క్లినిక్‌లు, 210 డిస్ట్రిక్ట్ కార్డియాక్ కేర్ యూనిట్లు, 326 డిస్ట్రిక్ట్ డే కేర్ సెంటర్లు, 6,110 కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. కార్డియోవాస్కులర్ వ్యాధి రోగులు మెడికల్ కాలేజీలు, ఎయిమ్స్ వంటి కేంద్రీయ సంస్థలు, కేంద్ర ప్రభుత్వ ప్రయివేట్ రంగ ఆస్పత్రులతో సహా హెల్త్‌కేర్ డెలివరీ సిస్టమ్‌లోని వివిధ ఆరోగ్య సదుపాయాలలో చికిత్స పొందుతున్నారని మాండవ్య చెప్పారు.


వివేకా హత్య కేసులో వెలుగులోకి కీలక సాక్ష్యాలు

- స్వీకరించిన సిబిఐ కోర్టు

హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో కీలక సాక్ష్యాలను సిబిఐ నమోదు చేసింది. కీలక వ్యక్తుల వాంగ్మూలాలను గత నెల 30న సిబిఐ కోర్టుకు సమర్పించింది. వీటిని కోర్టు విచారణకు స్వీకరించడంతో ఈ వివరాలు శుక్రవారం వెలుగులోకి వచ్చాయి. వివేకా హత్య కేసులో సిఎం జగన్ ఒఎస్‌డి పి.కృష్ణమోహన్‌రెడ్డి, విశ్రాంత సిఎస్ అజేయ కల్లం, వైసిపి నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జగన్ అటెండర్ గోపరాజు నవీన్‌కుమార్, వైఎస్ షర్మిల సాక్షులుగా ఉన్నట్లు కోర్టుకు సిబిఐ తెలిపింది. వివేకా హత్య జరిగిన 2019 మార్చి 15న జగన్ లోటస్‌పాండ్‌లో ఉన్నట్లు సాక్షులు తెలిపారని పేర్కొంది. వైసిపి ఎన్నికల మేనిఫెస్టోపై చర్చించేందుకు తెల్లవారుజామునే సమావేశమైనట్లు సిబిఐ కోర్టుకు నివేదించింది. సిబిఐకి ఇచ్చిన వాంగ్మూలాలు ఈ కింద విధంగా ఉన్నాయి.

అవినాషే చెప్పారు : కృష్ణమోహన్‌రెడ్డి

2019 మార్చి 15 తెల్లవారుజామున లోటస్‌పాండ్‌లో జగన్‌తో సమావేశంలో ఉన్నప్పుడు ఆయన అటెండర్ నవీన్ వచ్చి ఎంపి అవినాష్ ఫోన్ లైన్‌లో ఉన్నారని, బయటకు రావాలని పిలిచారు. వివేకా మరణించారని అవినాష్ నాకు ఫోన్‌లో చెప్పారు. ఎలా జరిగిందని అవినాష్‌రెడ్డిని అడిగాను. బాత్‌రూమ్‌లో రక్తపు మడుగులో పడి ఉన్నారని చెప్పారు. జగన్‌కు సమాచారం ఇవ్వండని అవినాష్ చెప్పారు. వివేకా మరణం విషయం, అవినాష్ చెప్పిన సమాచారం జగన్‌కు చెప్పాను. తర్వాత జగన్ పులివెందుల వెళ్లారు. జగన్ పర్యటన విషయం మాట్లాడేందుకు ఆ సమయంలో అవినాష్‌కు ఐదుసార్లు ఫోన్ చేశాను'



వివేకానంద రెడ్డి (ఫైల్)

'బాబాయ్ ఇక లేరు' అని జగన్ చెప్పారు : అజేయ కల్లం

లోటస్‌పాండ్‌లో జగన్‌తో సమావేశంలో ఉండగా ఉదయం 5.30 గంటల సమయంలో అటెండర్ తలుపు కొట్టారు. వైఎస్ భారతి మేడపైకి రమ్మంటున్నారని అటెండర్ జగన్‌కు చెప్పారు. జగన్ బయటకు వెళ్లి పది నిమిషాల తర్వాత మళ్లీ వచ్చారు. బాబాయ్ ఇక లేరనే విషయాన్ని జగన్ నిలబడే మాకు చెప్పారు.

అవినాష్ ఫోన్ చేసి కృష్ణమోహన్‌కి ఫోన్ ఇవ్వమన్నారు : అటెండర్ నవీన్

ఆ రోజు ఉదయం 6.30 గంటలకు అవినాష్‌రెడ్డి ఫోన్ చేసి జగన్ ఉన్నారా? అని అడిగారు. కృష్ణమోహన్‌రెడ్డి, అజేయ కల్లం, ఉమ్మారెడ్డి తదితరులతో సమావేశంలో ఉన్నారని చెప్పాను. కృష్ణమోహన్‌రెడ్డికి వెంటనే ఫోన్ ఇవ్వమని అవినాష్ చెప్పారు. సమావేశ గదికి వెళ్లి అవినాష్ లైన్‌లో ఉన్నారని కృష్ణమోహన్‌రెడ్డికి ఫోన్ ఇచ్చాను. అవినాష్, కృష్ణమోహన్‌రెడ్డి ఏం మాట్లాడుకున్నారో నేను వినలేదు.

ఆ విషయం జగన్‌కు ఎవరు చెప్పారో గుర్తులేదు : ఉమ్మారెడ్డి

'సమావేశంలో ఉన్నప్పుడు ఎవరో యువకుడు వచ్చి వివేకా మరణించారని జగన్‌కు చెప్పారు. ఆయన ఎవరో నాకు గుర్తులేదు. కాసేపటికే సమావేశం ముగిసింది'

రాజకీయ కారణాలతోనే హత్య : వైఎస్ షర్మిల

రాజకీయ కారణాలతోనే బాబాయ్ హత్య జరిగింది. హత్యకు కుటుంబ, ఆర్థిక వ్యవహారాలు కారణాలు కాదు. పెద్ద కారణం ఉంది. అవినాష్ కుటుంబానికి వ్యతిరేకంగా వివేకా నిలబడడమే కారణం కావొచ్చు. వారికి అడ్డొస్తున్నారని మనసులో పెట్టుకోవచ్చు. హత్యకు కొన్ని నెలల ముందు బెంగళూరులోని మా ఇంటికి వివేకా వచ్చారు. కడప ఎంపిగా పోటీ చేయాలని ఆయన నన్ను అడిగారు. ఎంపిగా అవినాష్ పోటీ చేయొద్దని కోరుకుంటున్నట్లు చెప్పారు. అవినాష్‌కు టికెట్ ఇవ్వకుండా ఎలాగైనా జగన్‌ను ఒప్పిద్దామన్నారు. జగన్‌కు వ్యతిరేకంగా నేను వెళ్లనని వివేకా ఆలోచించారు. కచ్చితంగా ఒప్పించగలననే ధీమాతో ఆయన మాట్లాడారు. జగన్ నాకు మద్దతివ్వరని తెలుసు కాబట్టి ఎంపిగా పోటీకి మొదట ఒప్పుకోలేదు. బాబాయ్ పదేపదే ఒత్తిడి చేయడంతో సరే అన్నాను. ఎమ్మెల్సీగా బాబాయ్ ఓటమికి అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొందరు సన్నిహితులే కారణం. కుటుంబంలో అంతా బాగున్నట్లు బయటకు కనిపించినా, లోపల కోల్డ్‌వార్ ఉండేది.

సభలో చర్చకు 31 బిల్లులు

- పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ : పార్లమెంటు వర్షకాల సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. అయితే, ఈ సమావేశాల్లో కేంద్రం మొత్తం 31 బిల్లులను చర్చకు తీసుకొచ్చే అవకాశం కనిపిస్తున్నది. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. వర్షకాల సమావేశాలు షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 11 వరకు కొనసాగనున్నాయి. 17 సిట్టింగ్‌లలో జరిగే పార్లమెంటు సమావేశాలు సాఫీగా జరగటం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష భేటీకి 34 పార్టీల నుంచి 44 మంది లీడర్లు పాల్గొన్నారని ఆయన చెప్పారు.

బిల్లులు

1. గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (సవరణ) బిల్లు, 2023
2. ది సినిమాటోగ్రాఫ్ (సవరణ) బిల్లు, 2019
3. డీఎన్‌ఏ టెక్నాలజీ (యూజ్ అండ్ అప్లికేషన్) రెగ్యులేషన్ బిల్, 2019
4. ది మీడియేషన్ బిల్, 2021
5. ది బయోలాజికల్ డైవర్సిటీ (సవరణ) బిల్లు, 2022
6. బహుళ రాష్ట్ర సహకార సంఘాలు (సవరణ) బిల్లు, 2022
7. ది రిపీలింగ్ అండ్ అమెండింగ్ బిల్, 2022
8. ది జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు, 2023
9. అటవీ (సంరక్షణ) సవరణ బిల్లు, 2023
10. ది కాన్‌స్టిట్యూషన్ (షెడ్యూల్డ్ ట్రైబ్స్) ఆర్డర్ (మూడో సవరణ) బిల్లు, 2022 (హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినది)
11. ది కాన్‌స్టిట్యూషన్ (షెడ్యూల్డ్ ట్రైబ్స్) ఆర్డర్ (ఐదో సవరణ) బిల్లు, 2022 (ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సంబంధించినది)
12. తపాల సేవల బిల్లు, 2023
13. జాతీయ సహకార విశ్వవిద్యాలయ బిల్లు, 2023
14. పురాతన స్మారక చిహ్నాలు మరియు పురావస్తు ప్రదేశాలు మరియు అవశేషాలు (సవరణ) బిల్లు, 2023
15. డిజిటల్ పర్సనల్ ప్రొటెక్షన్ బిల్, 2023
16. అంతర్జాతీయ ద్రవ్య నిధి మరియు బ్యాంక్ బిల్, 2023
17. పన్నుల తాత్కాలిక సేకరణ బిల్లు, 2023
18. జాతీయ దంత కమిటీ బిల్లు, 2023
19. నేషనల్ నర్సింగ్ మరియు మిడ్‌వైఫరీ కమిషన్ బిల్లు, 2023
20. మందులు, వైద్య పరికరాలు మరియు కాస్మోటిక్స్ బిల్, 2023
21. జననాలు మరియు మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2023
22. జమ్మూ మరియు కాశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు, 2023
23. సినిమాటోగ్రాఫ్ (సవరణ) బిల్లు, 2023
24. ది ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్, 2023
25. ది అడ్వొకేట్స్ (సవరణ) బిల్లు, 2023
26. గనులు మరియు ఖనిజ (అభివృద్ధి మరియు నియంత్రణ) బిల్లు
27. రైల్వేలు (సవరణ) బిల్లు, 2023
28. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లు, 2023
29. రాజ్యాంగం (జమ్మూ మరియు కాశ్మీర్) షెడ్యూల్డ్ కులాల ఆర్డర్ (సవరణ) బిల్లు, 2023
30. రాజ్యాంగం (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్ (సవరణ) బిల్లు, 2023
31. రాజ్యాంగం (జమ్మూ మరియు కాశ్మీర్) షెడ్యూల్డ్ తెగలు ఆర్డర్ (సవరణ) బిల్లు, 2023

బీజేపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

- మణిపూర్ ఘటనకు కేంద్ర బాధ్యత వహించాలి: సామాజిక, మహిళా, ప్రజా సంఘాల నిరసనలో నేతలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ పాలిత మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసి గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగిక దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని సామాజిక, మహిళా, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా), సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాస), కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్), ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు మల్లు లక్ష్మి, పాలడుగు భాస్కర్, ఆర్ వెంకట్రాములు, టి స్కైలాబ్‌బాబు, అన్నిగంటి వెంకటేశ్ మాట్లాడుతూ గత మూడు నెల్లుగా మణిపూర్‌లో మతవిద్వేషాలు రెచ్చగొట్టింది సంఘ్‌పరివార్ శక్తులేనని విమర్శించారు. బీజేపీ రాజకీయ క్రీడలో ఎంతో మంది అమాయక గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని నివారించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. ఆదివాసి మహిళలను నగ్నంగా ఊరేగించటం భారతీయ సంస్కృతిలో భాగమా? అని ప్రశ్నించారు. ఈ దుర్ఘటన పట్ల సభ్య సమాజం సిగ్గుతో తలదించుకున్నదని తెలిపారు. పాలకులు నిర్లక్ష్య వైఖరి విడనాడాలని హితవు పలికారు. సుప్రీకోర్టు జోక్యం చేసుకున్న తర్వాత కానీ.. ప్రధాని మోడీ మౌనం వీడలేదని తెలిపారు. భారత మాతాకీ జై అంటూనే మహిళలను నగ్నంగా ఊరేగించడం వీరి ద్వంద వైఖరికి నిదర్శనమని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి సంఘటనలు పెచ్చుమీరుతున్నాయన్నాయని గుర్తుచేశారు. బేటి బచావో బేటి పడావో అని మాట్లాడుతున్న మోడీ సర్కార్ మహిళలకిచ్చే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు. పౌర సమాజమే..మతోన్మాద పాలకులకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీ రమ, ఐద్వా అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్,ఐద్వా నాయకురాలు మద్దెల వినోద, నాగలక్ష్మి, శశికళ, పద్మ సీఐటీయూ నాయకులు వంగూరి రాములు, శ్రీకాంత్, కూరపాటి రమేష్, యాటల సోమన్న వ్యకాస మహిళా కన్వీనర్ బొప్పని పద్మ, డివైఎఫ్ఎస్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, నాయకులు జావీద్, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు బాలపీరు, బి సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ
- బంగాళాఖాతంలో అల్పపీడనం
- రాష్ట్రంలో 769 ప్రాంతాల్లో వర్షపాతం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే రెండు రోజుల పాటు తేలిక పాటి నుంచి మోస్తరు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. బంగాళాఖాతంలోని ఒడిస్సా తీరంలో ఉన్న అల్పపీడన ప్రాంతం ఈ రోజు వాయువ్య మరియు పశ్చిమ మధ్య బంగాళాఖాతం పక్కనున్న దక్షిణ ఒడిస్సా - ఉత్తర ఆంధ్రప్రదేశ్ వద్ద కొనసాగుతున్నది. ఈ అల్పపీడన ప్రాంతానికి అనుబంధంగా ఏర్పడిన ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు వ్యాపించి ఉంది. రాబోయే రెండు రోజుల్లో దక్షిణ ఒడిస్సా - ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరం వెంబడి వెళ్లే అవకాశముంది. రాష్ట్రంలో శుక్రవారం రాత్రి 11 గంటల వరకు 769 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా లోకారి(కె)లో అత్యధికంగా 8.48 సెంటీమీటర్ల వర్షం పడింది. నిజామాబాద్ జిల్లా కోటగిరిలో 7.7 సెంటీమీటర్లు, ఆదిలాబాద్ జిల్లా చాప్రాలలో 7.45 సెంటీమీటర్లు, ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లో 6.7 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది.

బిజెపితో పొత్తు... టిడిపితో కాపురం!

- చంద్రబాబుకు పదేళ్లుగా వలంటీర్ 'దత్తపుత్రుడు'
- వెంకటగిరి బహిరంగ సభలో సిఎం జగన్
- 'నేతన్న నేస్తం' రూ.194 కోట్లు జమ



తిరుపతి : 'నీతిమాలిన రాజకీయాలు చేసేవారు కూడా వలంటీర్ వ్యవస్థను విమర్శిస్తున్నారు. చంద్రబాబుకు పదేళ్లుగా వలంటీర్‌గా దత్తపుత్రుడు పనిచేస్తున్నాడు. బిజెపితో పొత్తు పెట్టుకుని టిడిపితో కాపురం చేస్తున్నారు. వీరి జీవితమంతా వెన్నుపోట్లు, వంచన' అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. రేణిగుంట విమానాశ్రయానికి శుక్రవారం ఉదయం 9.30 గంటలకు చేరుకున్న సిఎం... ప్రత్యేక హెలికాప్టర్‌లో వెంకటగిరికి పది గంటలకు వచ్చారు. చేనేత కార్మికులతో కలిసి నేత నేశారు. చేనేత రంగంలో రాష్ట్రపతి అవార్డు పొందిన పది మందితో ఫొటోలు తీసుకున్నారు. అనంతరం బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఐదో విడత వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం పథకం కింద 80,806 మందికి రూ.194 కోట్లను బటన్ నొక్కి వారి ఖాతాలకు జమ చేశారు. ఈ సందర్భంగా వెంకటగిరిలో జరిగిన బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ టిడిపి, జనసేన పార్టీలను ఎండగడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. బిసిలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్ బోన్ క్లాస్‌గా మార్చామన్నారు. నవరత్నాల పథకంలో భాగంగా చేనేత కార్మికులను ఆదుకునేందుకు వైఎస్‌ఆర్ నేతన్న హస్తం పథకాన్ని తీసుకొచ్చామని పేర్కొన్నారు. 50 నెలల కాలంలో రూ.970 కోట్లు నేతన్న నేస్తం ద్వారా అందించామన్నారు. చంద్రబాబు పాలనలో చేనేతలు ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకోలేదని విమర్శించారు. 77 నేతన్న కుటుంబాలకు చంద్రబాబు హయాంలో నష్టపరిహారం ఇవ్వలేదని, తాము అధికారంలోకి వచ్చాక ఒక్కో కుటుంబానికీ రూ.5 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియో అందించామని తెలిపారు. 2014-19లో ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలన్నీ మూలన పడేశారని విమర్శించారు. క్యారెక్టర్ లేని వ్యక్తులు వలంటరీ వ్యవస్థపై మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కులం, మతం అని చూడకుండా పార్టీలకతీతంగా అందరినీ ఆప్యాయంగా పలకరించే మనవూరి పిల్లలపైన వలంటీర్లపై తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని 2.65 లక్షల మంది వలంటీర్లలో 65 శాతం మంది తన చెల్లెమ్మలేనన్నారు. వెంకటగిరి టౌన్‌లో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం నారాయణస్వామి, రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుడివాడ అమరనాథ్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపి మద్దిల గురుమూర్తి, ఎంఎల్‌ఎలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, సంజీవయ్య, వరప్రసాద్, అనిల్‌కుమార్ యాదవ్, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, వెంకటగిరి ఇన్‌ఛార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చైతన్యజ్వాల దాశరథి : సీఎం కేసీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో తన సాహిత్యంతో ప్రజల్లో చైతన్యజ్వాల రగిలించిన గొప్ప దార్శనికుడు దాశరథి కష్ణమాచార్యులు అని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు కొనియాడారు.

మహోన్నత కవి, ఉర్దూ, తెలుగు, ఇంగ్లీషు భాషా పండితుడు దాశరథి కష్ణమాచార్య 99 వ జయంతి సందర్భంగా ఆయన సేవల్ని సీఎం స్మరించుకున్నారు. సాహిత్యంలోని పలు ప్రక్రియల్లో విశేష కృషి చేసి, తెలుగు భాషా సాహిత్యాన్ని దాశరథి సుసంపన్నం చేశారని అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం దాశరథి కష్ణామాచార్య జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడంతో పాటు, తెలుగు సాహిత్యంలో విశేష కషి చేసిన కవులకు ఆయన పేరుపై పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నదని తెలిపారు. 2023 సంవత్సరానికిగాను ఆయాచితం నటేశ్వర శర్మకు దాశరథి పురస్కారాన్ని ప్రదానం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తెలంగాణను సాధించడంలో, రాష్ట్ర ప్రగతిని కొనసాగించడంలోనూ ఆయన స్ఫూర్తి ఇమిడి ఉన్నదని చెప్పారు.

శ్రీలంకలో తమిళులకు గౌరవప్రదమైన జీవితం కల్పించండి

: విక్రమసింఘేకు మోడీ విజ్ఞప్తి



న్యూఢిల్లీ : శ్రీలంక 13వ సవరణను అమలు చేసి, రాష్ట్ర ఎన్నికలను నిర్వహించాలని ఆ దేశ అధ్యక్షులు రణిల్ విక్రమసింఘేకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. 13వ సవరణతో శ్రీలంకలో తమిళలకు గౌరవప్రదమైన జీవితం లభిస్తుందని మోడీ పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం రణిల్ విక్రమసింఘే గురువారం న్యూఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో కేంద్ర విదేశాంగశాఖ సహాయమంత్రి వి. మురళీధరన్ స్వాగతం పలికారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌కి చేరుకున్న విక్రమ్‌సింఘేకు ప్రధాని నరేంద్రమోడీ సాదరంగా స్వాగతం పలికారు. ద్వైపాక్షిక సంబంధాలపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి 'ఈ ఏడాది రెండు దేశాలు దౌత్య సంబంధాలకు 75 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా.. దీర్ఘకాలంగా ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలను సమీక్షించి, రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలపర్చుకోవడానికి ఈ సమావేశం దోహపడతుంది' అని ట్వీట్ చేశారు. కాగా, 13వ సవరణ అనేది 30 ఏళ్ల క్రితం నాటి శ్రీలంక చట్టం, ఈ చట్టం అమలుతో 9 రాష్ట్రాలకు అధికార వికేంద్రీకరణ జరుగుతుంది. ఈ చట్టం ఇంకా అమల్లోకి రాలేదు. ప్రధానమంత్రి మోడీని కలిసే ముందు కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తోనూ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌తోనూ శ్రీలంక అధ్యక్షులు భేటీ అయ్యారు.

గౌతం అదానీ భేటీ

శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ్ సింఘెతో అదానీ గ్రూప్ అధిపతి గౌతం అదానీ భేటీ అయ్యారు. "కొలంబో పోర్టు వెస్ట్ కంటైనర్ టెర్మినల్ అభివృద్ధి, 500 మెగావాట్ విండ్ ప్రాజెక్ట్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ గురించి చర్చించాం" అని అదానీ ట్వీట్ చేశారు. ప్రధాని మోడీ మద్దతుతో శ్రీలంకలో విద్యుత్, పోర్టుల అభివృద్ధి తదితర ప్రాజెక్టులను అదాని గ్రూపు చేపడుతోందనే విమర్శలు ఉన్నాయి.

రూ.2 లక్షల కోట్ల సంపద ఆవిరి

- సెన్సెక్స్ 888 పాయింట్ల పతనం
- లాభాల స్వీకరణతో భారీ నష్టాలు

బిజినెస్



ముంబయి : వరుసగా ఆరు రోజులుగా ర్యాలీ చేసిన దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కుప్ప కూలాయి. లాభాల స్వీకరణతో సెన్సెక్స్, నిఫ్టీలు భారీ నష్టాలు చవి చూశాయి. ఒక్క పూటలోనే రూ.2 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరయ్యింది. ఇన్ఫోసిస్, రిలయన్స్, టిసిఎస్, హిందుస్తాన్ యూనిలీవర్ తదితర ప్రధాన సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ నేపథ్యంలో బిఎస్‌ఇ సెన్సెక్స్ 888 పాయింట్లు లేదా 1.3 శాతం పతనమై 66,684కు పడిపోయింది. ఇంట్రాడేలో ఏకంగా 1,000 పాయింట్లు నష్టపోయింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 234 పాయింట్లు లేదా 1.17 శాతం కోల్పోయి 19,745 వద్ద ముగిసింది.

ఇన్ఫోసిస్ షేర్ ఏకంగా 7.7 శాతం నష్టపోయింది. హిందుస్తాన్ యూనిలీవర్ 3.65 శాతం, హెచ్‌సిఎల్ టెక్నాలజీ 3.33 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.19 శాతం, విప్రో 3.07 శాతం చొప్పున అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ 0.26 శాతం, స్మాల్ క్యాప్ 0.13 శాతం చొప్పున తగ్గాయి. నిఫ్టీలో ఐటి సూచీ ఏకంగా 4 శాతం పతనాన్ని చవి చూసింది. ఎఫ్‌ఎంసిజి 1 శాతం నష్టపోయింది. పిఎస్‌యు బ్యాంకింగ్, మీడియా, ఆటోమొబైల్ సూచీలు 0.5 శాతం మేర పెరిగాయి.

ఒక్క మాటతో మస్క్‌కు లక్షల కోట్ల దెబ్బ

అమెరికాలోని దిగ్గజ ఇవి కార్ల తయారీ సంస్థ టెస్లా అధినేత ఎలన్ మస్క్ మాట్లాడిన ఒక్క మాటా ఆయనకు లక్షల కోట్ల నష్టాన్ని తెచ్చి పెట్టింది. టెస్లా కార్ల ధరలను తగ్గిస్తామని మస్క్ చేసిన ప్రకటనతో గురువారం నాస్‌డాక్‌లో ఆ కంపెనీ షేర్లు 9.7 శాతం పతనమై 262.90 డాలర్లకు పడిపోయాయి. దీంతో మస్క్ వ్యక్తిగత సంపద 20.3 బిలియన్ డాలర్లు ఆవిరయ్యింది. భారత కరెన్సీలో ఈ విలువ రూ.1.65 లక్షల కోట్లుగా ఉంటుంది.

సరికొత్త ఫీచర్‌తో కియా సెల్టోస్ విడుదల

న్యూఢిల్లీ : కియా ఇండియా తన సెల్టోస్‌ను సరికొత్త అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెంట్ సిస్టమ్ (అడాస్)-2 ఫీచర్‌తో విడుదల చేసినట్లు ప్రకటించింది. భద్రతకు కొత్త ప్రమాణామని.. ఆధునిక టెక్నాలజీలో వివిధ ఇంటిలిజెంట్ ఫీచర్స్ కోసం ఆధునిక ఫార్వర్డ్ కొలిజన్ నివారించే అసిస్ట్, లేన్ కీప్ అసిస్ట్, స్టాప్ అండ్ గోతో స్మార్ట్ క్రూయిజ్ కంట్రోల్ సహా 1 కెమేరా, 3 రాడార్స్‌తో డ్రైవర్‌కు, ప్రయాణికులకు ఒకే విధంగా భద్రతను కలిగిస్తుందని తెలిపింది. నూతన సెల్టోస్ వాహన ధరల శ్రేణిని రూ.10.89 - రూ.19.99 లక్షలుగా పేర్కొంది.

నేడు సీపీజీఈటి ప్రవేశ పరీక్ష ప్రిలిమినరీ 'కీ' విడుదల

- జర్నలిజం పరీక్ష రద్దు, ఆగస్టులో తిరిగి నిర్వహణ
- కొత్తగా డేటా సైన్స్ కోర్సుకు నోటిఫికేషన్

నవతెలంగాణ- ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల 8 యూనివర్సిటీల్లో 50 పీజీ కోర్సులకు నిర్వహించిన సీపీజీఈటీ ప్రవేశ పరీక్షల ప్రిలిమినరీ 'కీ'ని శనివారం సాయంత్రం విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు కన్వీనర్ ప్రొఫెసర్ పాండు రంగారెడ్డి తెలిపారు. మొత్తం 69,498 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 60,464 మంది ప్రవేశ పరీక్ష రాశారు. ఈ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించే అభ్యర్థులు 2023కు సంబంధించిన కుల, ఆదాయ సర్టిఫికెట్స్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

22 నుంచి 25 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఈ నెల 22 నుంచి 25 అర్ధరాత్రి వరకు ప్రిలిమినరీ 'కీ'లో తప్పులు, లోపాలు, అభ్యంతరాలు ఉంటే ఈ-మెయిల్‌కు లేదా స్వయంగా వచ్చి చెప్పొచ్చని సూచించారు. ఇక సీపీజీఈటీ అడ్మిషన్స్ ప్రవేశ ప్రక్రియను ఆగస్టు 2వ వారంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు కన్వీనర్ చెప్పారు.

జర్నలిజం పరీక్ష రద్దు

జర్నలిజం ప్రవేశ పరీక్షకు సంబంధించి సిలబస్‌లో పలు తప్పిదాలు జరగడంతో పరీక్షను తిరిగి ఆగస్టు మొదటి వారంలో నిర్వహించనున్నట్టు కన్వీనర్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 955 మంది విద్యార్థులు తిరిగి పరీక్ష రాయొచ్చన్నారు. దీనిపై ఇటీవల ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు వినతిపత్రం అందజేసిన విషయం తెల్సిందే.

కొత్తగా ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సుకు నోటిఫికేషన్

ఒక యూనివర్సిటీ, పలు కళాశాలల అభ్యర్థన మేరకు.. ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సుకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

ఇందుకు ఆగస్టు మొదటి వారంలో నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు స్వీకరించి ప్రవేశ పరీక్ష నిర్వహించనునట్టు కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి చెప్పారు.

ఆ ఐదు విభాగాల్లో నేరుగా ప్రవేశాలు

ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో సీట్ల సంఖ్యకన్నా దరఖాస్తులు తక్కువగా వచ్చిన అరబిక్, మరాఠీ, కన్నడ, పర్షియన్, థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశ పరీక్ష నిర్వహించలేదు.

ఈ ఐదు కోర్సుల్లో 10మంది కన్నా ఎక్కువ మంది విద్యార్థులు చేసేందుకు సిద్ధంగా ఉంటే నేరుగా అడ్మిషన్స్ పొందే వేసులుబాటు కల్పించనున్నారు.

రాష్ట్రంలో సమగ్ర , సమతుల్య అభివృద్ధి

అభయ్ త్రిపాఠి స్మారకోపన్యాసంలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'నీళ్లు, నిధులు, నియామకాలు లక్ష్యంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం.. సమగ్ర, సమీకృత, సమతుల్య అభివృద్ధిని సాధించింది. ఐటీ ఉద్యోగాల కల్పనలో బెంగళూరును దాటేశాం' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో శుక్రవారం అభయ్ త్రిపాఠి స్మారక ఉపన్యాసంలో భాగంగా 'కొత్త రాష్ట్రం-సవాళ్లు' అనే అంశంపై కేటీఆర్ ప్రసంగించారు.

హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. 1950 నుంచి 2014 వరకు దేశంలో ఎన్నో రాష్ట్రాలు ఏర్పడ్డాయన్నారు. దశాబ్దాల పోరాటం తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడినప్పుడు ఎన్నో సవాళ్లు, సందేహాలు ఉన్నాయని, ఇక్కడ ఇతర ప్రాంతాల వారి భద్రతపై ఎన్నో సందేహాలు వ్యక్తమయ్యాయని అన్నారు. కానీ ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారని, శాంతిభద్రతలు ఎలాంటి విఘాతం కలగలేదన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కేసీఆర్ ప్రతి ఇంటికి తాగునీరు అందించారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ భగీరథ పథకం అమలు చేశామని తెలిపారు. రాష్ట్రంలో 30 లక్షలకుపైగా వ్యవసాయ బోర్లు ఉన్నాయని, కరెంట్ ఎక్కువ అవసరం పడుతుందనీ, వ్యవసాయానికి నాణ్యమైన 24 గంటల విద్యుత్‌ను ఉచితంగా అందజేస్తు న్నామని వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద నీటి పారుదల ప్రాజెక్టు కాళేశ్వరమని చెప్పారు. దాంతో ఉత్తర తెలంగాణ సస్యశ్యామలమైందన్నారు. వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు.

మిషన్ భగీరథ లాంటి పథకాలను ఇతర రాష్ట్రాలు, కేంద్రం కాపీ కొడుతున్నాయని పేర్కొన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన ఏ ఒక్క హామీని కేంద్రం నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి ఎన్నో అంశాల్లో మద్దతు ఇచ్చామని, అయితే నిటి ఆయోగ్ చెప్పినా మోడీ సర్కార్ తెలంగాణకు నయా పైసా ఇవ్వలేదన్నారు. కేంద్రానికి రాష్ట్రం రూపాయి ఇస్తే, రాష్ట్రానికి 46 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని తెలిపారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని స్పష్టం చేశారు.

కోవిడ్ ముందటి స్థాయిని దాటిన రష్యా వాణిజ్యం

ప్రపంచ సమరం



రష్యా వాణిజ్య టర్నోవర్ ఈ సంవత్సరం మొదటి ఆరు నెలల్లో కోవిడ్ ముందటి స్థాయిని దాటిందని రష్యా కస్టమ్స్ అథారిటీ ప్రకటించింది. జనవరి-జూన్ మధ్య పెరుగుదల 2019లో అదే కాలం కంటే 3శాతం పెరిగిందని ఫెడరల్ కస్టమ్స్ సర్వీస్(ఎఫ్ సి ఎస్) అధినేత, రస్లాన్ దవీదోవ్ అన్నాడు. రష్యా వాణిజ్యం పెరుగుదలకు ఎఫ్‌సిఎస్ తీసుకున్న అనేక చర్యలు ఉపయోగపడ్డాయని రష్యా ప్రధాని మైఖైల్ మిషుస్టిన్‌తో జరిగిన సమావేశంలో దవీదోవ్ పేర్కొన్నాడు. కస్టమ్స్ క్లియరెన్స్ ప్రక్రియలను వేగ వంతం చేయటం, కొన్ని సరుకులపైన కస్టమ్స్ డ్యూటీ లను తొలగించటం, ఆన్ లైన్ లో కొన్న వస్తువులపైన పన్ను మినహాయింపు పరిధిని పెంచటంవంటి చర్యలు రష్యా వాణిజ్యం పెరగటానికి ఉపయోగపడ్డాయి.

యూరోపియన్ యూనియన్ కేంద్రకంగా సాగిన రష్యా వాణిజ్యం తూర్పు, దక్షిణ దేశాలకు మారిందని దవీదోవ్ చెప్పాడు. వస్తువుల ప్రవాహం వేగవంతం కావటంతో రష్యాలో కస్టమ్స్ విభాగంలో పనిచేస్తున్న వాళ్ళ సంఖ్యను గణనీయంగా పెంచారు. చెక్ పాయింట్లను తగ్గించారు. కొన్ని చెక్ పాయింట్లను 24/7 పనిచేసేలా చేశారు. పెద్ద పెద్ద కార్గోలను పర్యవేక్షించటానికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్నిప్రవేశపెట్టారు. ఉక్రెయిన్ లో సైనిక చర్యను ప్రారంభించాక రష్యాపైన పశ్చిమ దేశాలు ఆంక్షలను విధించటంవల్ల యూరోపియన్ యూనియన్ మార్కెట్ ను కోల్పోయాక రష్యా బ్రిక్స్ దేశాలతో తన వాణిజ్యాన్ని పెంచుకుంది.

2022లో ఇదే కాలంతో పోల్చినప్పుడు ఈ సంవత్సరం మొదటి ఆరు నెలల్లో రష్యా, చైనాల మధ్య వాణిజ్యం 40శాతం పెరిగి 114.5 బిలియన్ డాలర్లకు చేరుకుందని చైనా విడుదల చేసిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. గత సంవత్సరం ఇదే కాలంతో పోల్చినప్పుడు రష్యా, ఇండియాల మధ్య కూడా జనవరి, ఏప్రిల్ నెలల మధ్యకాలంలో వాణిజ్యం నాలుగు రెట్లు పెరిగి 22బిలియన్ డాలర్లకు చేరుకుందని భారతదేశ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సమాచారం ఆధారంగా ఆర్ ఐ ఏ నొవోస్తి వార్తాసంస్థ జూన్ లో రిపోర్ట్ చేసింది. చైనా, ఇండియా, టర్కీ, అజర్బజాన్‌లతో రష్యా పెంపొందించిన వాణిజ్యం యూరోపియన్ యూనియన్‌లో తాను కోల్పోయిన విదేశీ వాణిజ్యాన్ని భర్తీ చేసిందని రస్లాన్ దవీదోవ్ అన్నాడు.

నల్లసముద్రంలో రష్యా యుద్ధ నౌకల విన్యాసాలు



రష్యా నల్లసముద్ర నౌకాదళం నావల్ బ్లాకేడ్ ను విధించటానికి విన్యాసాలను నిర్వహించింది. పౌర సేవలకు వినియోగించే అన్ని నౌకలు సైనిక సామాగ్రిని కలిగివున్నట్లుగానే భావిస్తామని రష్యా, ఉక్రెయిన్ ప్రకటించాక ఈ నౌకా విన్యాసాలు జరిగాయి. ఈ విన్యాసాలలో శత్రు నౌకలను ధ్వంసం చేయటంపైన ద్రుష్టిని సారించటం జరిగిందని రష్యా రక్షణ శాఖ ప్రకటించింది.

ఐక్యరాజ్య సమితి, టర్కీల చొరవతో చేసుకున్న ఉక్రెయిన్ రేవుల నుంచి ధ్యాన్యాన్ని ఎగుమతి చేసే ఒప్పందాన్ని పొడిగించటానికి సోమవారం నాడు రష్యా తిరస్కరించింది. ఆహార ధాన్యాలను, ఎరువులను రష్యా ఎగుమతి చేయటంపైన పశ్చిమ దేశాల ఆంక్షలను తొలగించేలా చేస్తామని ఇచ్చిన హామీని ఐక్యరాజ్య సమితి నిలబెట్టుకోలేక పోయిందని రష్యా ప్రకటించింది.

ఈ ఒప్పందం ప్రకారం రష్యా ఇచ్చిన అన్ని భద్రతా హామీలను రద్దు చేసుకోవటం జరుగుతుందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇప్పటి నుంచి నల్ల సముద్రంలోని ఉక్రెయిన్ రేవులవైపు పయనించే అన్ని నౌకలు సైనిక సామాగ్రిని తీసుకుపోయేవిగాను, వాటి యాజమాన్య దేశాలు ఉక్రెయిన్ తరపున జోక్యం చేసుకుంటున్న దేశాలుగా భావించబడతాయి. ఉక్రెయిన్ కూడా గురువారంనాడు ఇటువంటి హెచ్చరికనే చేసింది. నల్ల సముద్రంలో రష్యావైపు పయనిస్తున్న నౌకలు "డేంజర్ జోన్"లో ప్రవేశించినట్టేనని ఉక్రెయిన్ ప్రకటించింది.

త్వరలో గోఫస్ట్ సర్వీసుల పునరుద్ధరణ

న్యూఢిల్లీ : ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని రెండున్నర నెలల క్రితం విమానయాన సేవలను రద్దు చేసుకున్న గోఫస్ట్ సర్వీసులు త్వరలోనే పునరుద్ధరణకు నోచుకోనున్నాయి. ఇందుకు కొన్ని షరతులతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఆమోదం లభించింది. ఈ నెల 15న గోఫస్ట్ తన విమాన సర్వీసుల పునరుద్ధరణ ప్రణాళికను సవరించింది. 15 విమానాలతో ప్రతి రోజు 114 విమాన సర్వీసులు నడుపుతామని పేర్కొంది. ఈ సవరణ ప్రతిపాదనను ఆమోదించిన డిజిసిఎ తాజాగా కొన్ని షరతులతో సేవల పున ప్రారంభానికి అనుమతులు ఇచ్చింది.

రిలయన్స్ లాభాల్లో 10.8% పతనం

న్యూఢిల్లీ : ముకేష్ అంబానికి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 10.8 శాతం పతనంతో రూ.16,011 కోట్ల లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.17,955 కోట్ల లాభాలు సాధించింది. క్రితం క్యూ1 లో కంపెనీ రెవెన్యూ 5.3 శాతం తగ్గి రూ.2.11 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. రిలయన్స్ రిటైల్ లాభాలు 18.8 శాతం పెరిగి రూ.2,448 కోట్లుగా నమోదయ్యాయి. రిలయన్స్ జియో ఇన్ఫోకమ్ లాభాలు 12.2 శాతం పెరిగి రూ.4,863 కోట్లుగా చోటు చేసుకున్నాయి. శుక్రవారం బిఎస్‌ఇలో రిలయన్స్ షేర్ 2.57 శాతం పతనమై రూ.2536.20 వద్ద ముగిసింది.

శ్రీలంక అధ్యక్షుడితో గౌతం అదానీ భేటీ



న్యూఢిల్లీ : శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ్ సింఘెతో అదానీ గ్రూప్ అధిపతి గౌతం అదానీ భేటీ అయ్యారు. ఆ దేశంలోని తమ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించినట్లు అదానీ ట్వీట్ చేశారు. విక్రమ్ సింఘె ప్రస్తుతం రెండు రోజుల భారత పర్యటనలో ఉన్నారు. "కొలంబో పోర్టు వెస్ట్ కంటైనర్ టెర్మినల్ అభివృద్ధి, 500 మెగావాట్ విండ్ ప్రాజెక్ట్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ గురించి చర్చించాం" అని అదాని పేర్కొన్నారు. ప్రధాని మోడీ మద్దతుతో శ్రీలంకలో విద్యుత్, పోర్టుల అభివృద్ధి తదితర ప్రాజెక్టులను అదాని గ్రూపు చేపడుతోందనే విమర్శలు ఉన్నాయి.

కెనరా హెచ్ఎస్‌బిసి లాభాల్లో 9 రెట్ల వృద్ధి

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో కెనరా హెచ్ఎస్‌బిసి లైఫ్ ఇన్సూరెన్స్ నికర లాభాలు తొమ్మిది రెట్లు పెరిగి రూ.91.2 కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం ఏడాది రూ.10.2 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన 2022-23లో పన్ను చెల్లింపులకు ముందు రూ.100 కోట్ల లాభాలు ఆర్జించినట్లు పేర్కొంది. ఇదే సమయంలో స్థూల ప్రీమియం వసూళ్లు 22 శాతం పెరిగి రూ.7,197 కోట్లుగా నమోదయినట్లు వెల్లడించింది. 2021-22లో రూ.5,890 కోట్ల ప్రీమియం చోటు చేసుకున్నట్లు తెలిపింది.

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సీఎం సిద్ధం

- ఎంప్లాయ్ హెల్త్ స్కీం అమలుకు ఉద్యోగులు, పెన్షనర్లతో ప్రత్యేక కమిటీ :మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని మంత్రి టి హరీశ్‌రావు అన్నారు. టీఎన్జీవో కేంద్రసంఘం గౌరవాధ్యక్షులు దేవీప్రసాద్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో హరీశ్‌రావును కలిశారు. ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్, ఇతర సమస్యల గురించి మంత్రి దృష్టికి వారు తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయ్ ఫ్రెండ్లీగా ఖ్యాతి గడించిందని అన్నారు. ఎంప్లాయ్ హెల్త్ స్కీంను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు ఉద్యోగు లు, పెన్షనర్ల ప్రతినిధులు సభ్యులుగా ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ స్కీమ్ ద్వారా అత్యున్నత వైద్య సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా అందుబాటు లోకి వస్తాయన్నారు. ఉద్యోగులకు అత్యధిక వేతనాలు, పెన్షన్లు అందిస్తూ తెలంగాణ ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని మంత్రి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధుల విడుద లలో మొండిగా ప్రవర్తిస్తున్నప్పటికీ సీఎం కేసీఆర్ రాష్ట్రాభి వృద్ధి, సంక్షేమంపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని వివరించారు. ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణ స్టేట్ గౌట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసి డెంట్ దామోదర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ గంగారెడ్డి, పెన్షనర్ల జేఏసీ చైర్మెన్ లక్ష్మయ్య, పూర్ణ చందర్ రావు, నర్సింగ్‌రావు, ఎల్ శ్రీనివాస్ రెడ్డి ఇతర సభ్యులున్నారు.

బాలికపై సామూహిక లైంగిక దాడి

మండవల్లి (ఏలూరు జిల్లా) : బాలికపై సమీప బంధువే ఇతరులతో కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన ఏలూరు జిల్లా మండవల్లి శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా పరిధిలోని నందివాడ మండలానికి చెందిన ఒక కుటుంబం చేపల చెరువుపై కాపలా ఉంటూ జీవనం సాగిస్తోంది. వారి కుమార్తె (10) హాస్టల్‌లో ఉంటూ సమీపంలోని జడ్‌పి హైస్కూల్లో ఐదో తరగతి చదువుతోంది. బాలికకు వరుసకు సోదరుడయ్యే కుటుంబం ఆ ప్రాంతంలోనే ఉండడంతో అప్పుడప్పుడు సోదరుని ఇంటికి వెళ్లేది. ఈ క్రమంలోనే సదరు ప్రబుద్ధుడు బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి ఒడిగట్టాడు. అంతటితో ఆగకుండా సోదరుడి కుటుంబం అద్దెకు ఉంటున్న ఇంటి యజమానికి కుటుంబానికి చెందిన మరో బాలుడు (13), మరో లారీ డ్రైవర్ (45) గత నాలుగు నెలలుగా బాలికపై అఘాయిత్యానికి పాల్పడుతున్నారు. .

ఆల్మట్టిలోకి 70వేల క్యూసెక్కులు

అమరావతి : కృష్ణానదిపైన ఆల్మట్టి డ్యామ్‌కు వరద నీరు వస్తోంది. శుక్రవారం నాటి గణాంకాల ప్రకారం ఆల్మట్టి డ్యామ్‌లోకి 70 వేల క్యూసెక్కుల నీరు వస్తున్నాయి. ఆల్మట్టి పూర్తి స్థాయి సామర్థ్యం 129.72 టిఎంసీలు కాగా ప్రస్తుతం 38.40 టిఎంసీల నీరు వుంది. అలాగే తుంగభద్ర డ్యామ్‌లోకి 13,340 క్యూసెక్కులు వస్తోంది. తుంగభద్ర డ్యామ్ పూర్తి స్థాయి సామర్థ్యం 105.79 టిఎంసీలు కాగా ప్రస్తుతం 13.72 టీఎంసీల నీరు వుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో ఇప్పటికీ డెడ్ స్టోరేజ్ స్థాయిలోనే నీటి మట్టాలు వున్నాయి. శ్రీశైలం పూర్తి స్థాయి సామర్థ్యం 215 టీఎంసీలుకాగా ప్రస్తుతం 33.58టీఎంసీలు, నాగార్జునసాగర్ 312 టీఎంసీలకు గాను 144టీఎంసీల నీరు మాత్రమే వుంది. అలాగే పులిచింతలలో 45.77 టీఎంసీలకుగాను 16.88టీఎంసీలు మాత్రమే వున్నాయి. గత ఏడాది జూలై నాటికే కృష్ణానదిపై వున్న ప్రాజెక్టులన్నీ పూర్తిస్థాయి నీటి మట్టాలకు చేరుకోవడం గమనార్హం.